# ప్రజా విముక్తి


అమరవీరుల చరిత్రలు ..... 2
కార్మిక వ్యతిరేక చట్టాలు ....12
రైతుల ఆత్మహత్యలు ......14
ఛిద్రం కానున్న సింగరేణి.......16
కరువు కోరల్లో ప్రజలు . ...18
ఎవరు దేశభక్తులు .....20
సిద్ధాంత వ్యాసం . ..24
పనామా పత్రాలు .....29
ఇరోమ్ షర్మిల నిరహారదీక్ష .34
కాల్‌మనీ వ్యాపారం ...36
పోరాట వార్తలు ......41
పత్రికా ప్రకటనలు .....45



**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు), తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార పత్రిక**

**సంపుటి:1** **సంచిక:2** **ఏప్రిల్ - జూన్, 2016**




కా. రమేశ్(లచ్చన్న) ఎస్.జెడ్.సీ.ఎం.



కా. యూసుఫ్ బీ (సోని)డీ.వీసీ.ఎం.



కా. చందు పీ.ఎల్. కమాండర్



కా.సృజన (నవత, ఏ.సీ.ఎం.)



కా. సారక్క (అనిత, పీ.ఎం.)



కా. చైతు (రోషన్, పీ.ఎం.)



కా. మాడవి దేవె (పీ.ఎం.)

## శత్రువు పాశవిక సాయుధ దాడిని వీరోచితంగా తిప్పికొడుతూ
## నెత్తురు చిందించి నేల రాలిన బొట్టెం అమరులారా
## మీకివే మా అరుణారుణ జోహార్లు

# బొట్టెం అమరుల జీవిత చరిత్రలు

కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ సామ్రాజ్యవాదానికి, బహుళ జాతి కంపెనీలకు, దేశంలోని ఖనిజ సంపదను దోచి పెట్టేందుకు 'మేక్ ఇన్ ఇండియా', 'డిజిటల్ ఇండియా' లాంటి ఆకర్షణీయమైన నినాదాలతో తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. అధికారంలోకి వచ్చినప్పటి నుండి నరేంద్రమోడీ అనేక దేశాలు పర్యటిస్తూ తమ దేశంలోని సంపదను దోచుకపొమ్మని ఆహ్వానిస్తున్నాడు. వారిని మరింత మచ్చిక చేసుకోవడానికి 2017 వరకు భారతదేశాన్ని మావోయిస్టు రహిత దేశంగా మారుస్తాననే సంకల్పంతో ఆపరేషన్ గ్రీన్‌హంట్ 3వ దాడిని మరింత విస్తృతం చేసిండు.

'మావోయిస్టు ఎజెండానే మా ఎజెండా అంటూ' తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తెరాస ప్రభుత్వం మావోయిస్టు పార్టీని బలోపేతం కాకుండా ఆపరేషన్ గ్రీన్‌హంట్ 3వ దాడిని కొనసాగిస్తూ పొరుగు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలతో సంయుక్తంగా ఆపరేషన్స్ నిర్వహిస్తున్నది. కేంద్రం అండదండలతో ఛత్తీస్‌గఢ్ రమణ్‌సింగ్ ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి 2016 వరకే రాష్ట్రాన్ని మావోయిస్టు రహిత రాష్ట్రంగా చేస్తామని ప్రగల్భాలు పలుకుతున్నాడు.

అందులో భాగంగా చేపట్టిన మహా అభియాన్‌లో భాగంగా తెలంగాణ గ్రేహౌండ్స్, ఛత్తీస్‌గఢ్ బలగాలు సంయుక్తంగా చేపట్టిన 'ఆపరేషన్ హరిభూషణ్' పర్యావసానమే మార్చి 1, 2016 న జరిగిన బొట్టెం ఎన్‌కౌంటర్. ఈ ఎన్‌కౌంటర్లో వీరోచితంగా పోరాడుతూ 9 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. వీరిలో డీ.కే.ఎస్.జెడ్.సీ. సభ్యుడు కామ్రేడ్ గొట్టిముక్కుల రమేశ్ (లచ్చన్న), దక్షిణ బస్తర్ డివిజనల్ కమిటీ సభ్యురాలు కామ్రేడ్ యూసుఫ్ బీ (సోని), 22 ప్లాటూన్ కమాండర్ కామ్రేడ్ కిస్కె పాండ్రు (కమ్లు, చందు), సీ.ఆర్.సీ. 2వ కంపెనీ ప్లాటూన్ డిప్యూటీ కమాండర్ కామ్రేడ్ నోరోటి సన్నాయి (మిన్కో), కామ్రేడ్ కొత్తకొండ సృజన (నవత, రాగో) ఏ.సీ.ఎం., కామ్రేడ్ పద్దం చైతు (రోషన్) పీ.ఎం., డీ.వీ.సీ.ఎం. గార్డు కామ్రేడ్ నూపో రామె (పీ.ఎం.), కామ్రేడ్ దనసరి సారక్క (అనిత) పీ.ఎం., కామ్రేడ్ మాడివి దెవె (పీ.ఎం.)లు ఉన్నారు. శత్రువు 8 శవాలను కైవసం చేసుకున్నాడు. మరో అమరురాలు కా.మిన్కో శవాన్ని ప్రజలే స్వాధీనం చేసుకున్నారు.

ఈ మారణకాండలో 5 గురు మహిళా కామ్రేడ్స్‌ను పోలీసులు సజీవంగా పట్టుకొని చిత్రహింసలు పెట్టి హత్యచేశారు. మరో ముగ్గురు కామ్రేడ్స్ శత్రువుతో జరిగిన ప్రతిఘటనలో అమరులయ్యారు.

అమరుల ఆశయాలను, ఆదర్శాలను ఎత్తిపడుతూ వారు కలలుగన్న నూతన సమాజ నిర్మాణానికై ఆహర్నిశలు కృషి చేద్దాం. వారికివే మన నివాళులు. అమరవీరులకు జోహార్లు. అమరవీరుల ఆశయాలను తుదివరకు కొనసాగిస్తాం.

## కా. గొట్టి ముక్కుల రమేష్ (లచ్చన్న)



కామ్రేడ్ గొట్టిముక్కుల (రమేష్ ఎస్.జెడ్.సీ.ఎం.) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, గుంటూరు జిల్లా క్రోసూరు మండలం, పీసపాడు గ్రామంలో 50 సం॥రాల క్రితం ఈశ్వరమ్మ, బ్రహ్మచారి దంపతులకు 5వ సంతానంగా జన్మించాడు. అనంతరం కా. లచ్చన్నను తన పినతల్లి మాణిక్యమ్మ దత్తత తీసుకొని పెంచి పెద్ద చేసింది. క్రోసూరులో పాఠశాల విద్య నుండి ఇంటర్మీడియెట్ వరకు పూర్తి చేశాడు. హైదరాబాద్, రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీ.ఎస్.సీ. (అగ్రికల్చర్)లో చేరాడు.

బీ.ఎస్.సీ.చదువుకుంటున్న సమయంలోనే రాడికల్ విద్యార్థి సంఘం నిర్వహిస్తున్న ఉద్యమాలకు ఆకర్షితుడై విద్యార్థి సంఘంలో చేరినాడు. విద్యార్థి సమస్యలపై, ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలలో క్రియాశీలంగా పాల్గొన్నాడు. మతోన్మాద, భూస్వామ్య ముద్దు బిడ్డలైన ఏ.బీ.వీ.పీ. గూండాల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడుతూ, విప్లవ విద్యార్థులపై దాడులకు పాల్పడుతున్న గూండాలను ప్రతిఘటించే చర్యల్లో ముందు వరుసలో నిలబడ్డాడు. సామాజిక సమస్యలపై పోరాడుతున్న ప్రజలకు రాడికల్ విద్యార్థి సంఘం మద్దతు తెలియజేస్తూ, వారి పోరాటాలలో పాలు పంచుకున్నాడు. అనతి కాలంలోనే కా. రమేష్ తోటి విద్యార్థుల అభిమానాన్ని చూరగొన్నాడు.

పార్టీ యిచ్చిన పిలుపును అందుకొని 1990లో కా. రమేష్ పూర్తి కాలం కార్యకర్తగా విప్లవోద్యమంలోకి అడుగుపెట్టాడు. మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేట దళంలో పని చేశాడు. తర్వాత కల్వకుర్తి దళానికి కమాండర్‌గా బాధ్యతలు చేపట్టాడు. దళ కమాండర్‌గా పీడిత ప్రజలను వ్యవసాయ విప్లవంలో సంఘటితపరచడంలో, సమస్యలపై పోరాటాలలో కదిలించడానికి కృషి చేసాడు. పోరాటాలలో కదులుతున్న ప్రజలపై, విప్లవోద్యమంపై భూస్వాములు, బీ.జే.పీ. గూండాలు చేస్తున్న దాడులను

ప్రతిఘటించడంలో ముఖ్య పాత్ర పోషించాడు. అనతి కాలంలోనే నల్లమల చెంచులకు, పాలమూరు ప్రజలకు, సహచర కామ్రేడ్స్‌కు ఆత్మీయుడిగా మారాడు. పోలీసులు చేస్తున్న అనేక దాడుల నుండి తప్పుకుంటూ, తోటి కామ్రేడ్స్‌ను రక్షించాడు. ఏరియాలో పనిచేస్తున్న క్రమంలో కా. సోనితో పెళ్లి జరిగింది. 1995 తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ అధికార పత్రిక క్రాంతిలో ప్రింటింగ్, టెక్నికల్ బాధ్యతలను నెరవేర్చాడు. తన బాధ్యతలను నిర్వర్తించటానికి తన జీవిత సహచరి కా. యూసుఫ్ బీతో కలిసి నగరాలలో పనిచేసాడు. తీవ్ర నిర్బంధ పరిస్థితుల వల్ల 2003లో క్రాంతి పత్రికను తాత్కాలికంగా రద్దు చేశారు. 2006లో క్రాంతి పత్రికను సీ.ఆర్.బీ. అధికార పత్రికగా గెరిల్లా జోన్‌లో పునఃప్రారంభించిన తరువాత కా. లచ్చన్న సంపాదక మండలి సభ్యుడిగా చేరి 2012 వరకు పనిచేసాడు.

క్రాంతి పత్రికతో పాటు ఇతర పత్రికలకు అనేక వ్యాసాలు రాశాడు. అనువాదాలు చేసాడు. పార్టీ సాహిత్యాన్ని క్యాడర్‌కు, ప్రజలకు అందించడంలో ముఖ్య పాత్ర పోషించాడు. కామ్రేడ్ రమేష్ పత్రికా రంగానికి చేసిన కృషి మరువలేనిది. కామ్రేడ్ రమేష్ 2011లో ఆర్.సీ.ఎం.గా ప్రమోట్ అయ్యాడు.

2012లో కామ్రేడ్ రమేష్‌ను బెటాలియన్‌కు బదిలీ చేశారు. బీ.ఎన్.పీ.సీ.లో ఉంటూనే క్యాడర్‌కు మిలిటరీ స్కిల్స్, సిద్ధాంత, రాజకీయ, విద్యా బోధనలలో కృషి చేసాడు. క్యాడర్‌కు అన్ ఆర్మ్‌డ్ జుడో కరాటే శిక్షణ ఇచ్చాడు. సీఆర్‌బీ తీసుకున్న బోల్షివీకరణ క్యాంపెయిన్‌లో భాగంగా బీ.ఎన్.లోని సభ్యులందరికీ బోల్షివీకరణ క్లాసులు నిర్వహించాడు. మినప, పిడిమల్, కస్నాల్‌పాడ్ లలో జరిగిన మిలిటరీ దాడులల్లో పాల్గొన్నాడు.

వివిధ ప్రాంతాలలో పనిచేసినపుడు ప్రజలతో, క్యాడర్‌తో కలిసిపోయేవాడు. గెరిల్లా జీవితంలో మంచి డాక్టరుగా సేవలందించాడు. దాదాపు 25 సం॥రాలు వివిధ రంగాలలో దృఢసంకల్పంతో పనిచేసి అత్యంత విశ్వాసం కలిగిన నాయకునిగా ఎదిగాడు.

2015 అక్టోబర్‌లో జరిగిన డీ.కే.ప్లీనంలో ఆల్టర్‌నేటివ్ ఎస్.జెడ్.సీ.ఎం.గా ఎన్నుకోబడ్డాడు. పార్టీ అవసరాల రిత్యా బదిలీ చేశారు. పార్టీ నిర్ణయం మేరకు విస్తరణ ప్రాంతానికి వెళ్తున్న కామ్రేడ్ లచ్చాలు తన సహచరిని కా. సోనితో కలిసి తెలంగాణ కామ్రేడ్స్‌ను కలువడానికి వచ్చాడు. కలిసి వెళ్లే సమయంలోనే సమాచారం ఆధారంగా తెలంగాణ గ్రేహౌండ్స్ బలగాలు, ఛత్తీస్‌గఢ్ పోలీసులు కలిసి ఆపరేషన్ హరిభూషణ్ పేరుతో బొట్టెం దగ్గర చేసిన దాడిలో కామ్రేడ్ రమేశ్ తోటి సహచరులను రక్షిస్తూ, వీరోచితంగా పోరాడుతూ అమరుడయ్యాడు. ఆ దాడిలోనే కా. లచ్చాలు సహచరిని కా. సోనీ, మరో ఏడుగురు కామ్రేడ్స్ అమరులయ్యారు.

## కామ్రేడ్ యూసుఫ్ బీ (సోని)



కామ్రేడ్ యూసఫ్ బీ (సోని, డీ.వీ.సీ.ఎం.) తెలంగాణ రాష్ట్రం, మెదక్ జిల్లా, దౌల్తాబాద్ మండలం, మాచిన్‌పల్లి గ్రామంలో సుమారు 40 ఏళ్ల క్రితం హుస్సేన్ అహ్మద్, ఖుషుంబీ దంపతులకు జన్మించింది. సోనికి ఇద్దరు అన్నలు ఉన్నారు. వారిది విప్లవ రాజకీయాలతో ముడిపడి ఉన్న కుటుంబం. స్వంత గ్రామంలోనే మూడవ తరగతి వరకు చదువుకున్న కా. సోని విప్లవ రాజకీయాల పట్ల ఆకర్షితురాలయి 16 సం॥రాల వయస్సులోనే 1993లో పూర్తికాలం కార్యకర్తగా ఇందుప్రియాల్ దళంలో చేరింది. తరువాత గిరాయిపల్లి దళంలో పనిచేసింది.

దళ సభ్యురాలుగా చేరి, డిప్యూటీ దళ కమాండర్‌గా ఎదిగింది. పనిచేస్తున్న క్రమంలో కామ్రేడ్ లచ్చన్నతో 2000 సం॥లో పెళ్లి జరిగింది. తరువాత క్రాంతి పత్రిక స్టాఫ్ మెంబర్‌గా టెక్ పనులను తన జీవిత సహచరుడు కా. లచ్చన్నతో కలిసి 2006 వరకు నగరాలలో పనిచేసింది. ఆ తరువాత కొంత కాలం ఏ.వో.బీ.లో పని చేసింది.

కామ్రేడ్ సోని 2006లో దండకారణ్యంలోనికి వచ్చింది. దక్షిణ బస్తర్ డివిజన్ పామేడ్ ఏరియా కమిటీ సభ్యురాలిగా ఉంటూనే ఏరియా మోపోస్ టీచర్‌గా బాధ్యతలు చేపట్టింది. దండకారణ్యంలో పని చేయడానికి ఆదివాసుల ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలి. దండకారణ్య పార్టీ చరిత్రలో చైతన్యవంతమైన కామ్రేడ్స్ కూడా ఇక్కడి ఆదివాసుల తిండి, ఆచార వ్యవహారాలను ఒంట పట్టించుకోలేక తిరిగి తమ పాత ఏరియాలోకి లేదా ఇంటికి పోయిన సంఘటనలు అనేకం వున్నాయి. కానీ కా. సోని అలా కాకుండా ప్రజలు పెట్టిన తిండిని ప్రేమగా తిన్నది. వాళ్ల యాస, భాషలను గౌరవించి గోండి భాషను నేర్చుకుంది. దక్షిణ బస్తర్‌లో చిన్న పిల్లల నుండి మొదలుకొని పెద్ద వయస్సు వారికి కూడ కా. సోనితో పరిచయాలుండేవి. ఇక్కడి ప్రజల తలలో నాలుకగా కలిసిపోయి, క్యాడర్‌తో కలివిడిగా ఉన్నది. తనలో వున్న నిరాడంబరత, ఓపిక, ప్రజలతో కలిసిపోయే మనస్తత్వం వలన ప్రజలకు, క్యాడర్‌కు తొందరగా సన్నిహితురాలయింది. ఆర్.పీ.సీ.లకు, క్యాడర్‌కు పార్టీ డాక్యుమెంట్లపై రాజకీయ క్లాసులు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతం చేయడానికి కృషి చేసింది. ఇలాంటి పరిచయాలతో పార్టీ రాజకీయాలను ప్రజల్లోకి తీసుకపోయి దక్షిణ బస్తర్ ఒక పోరాట ప్రాంతంగా ఎదగడానికి కా. సోని చేసిన కృషి మరువలేనిది.

ఆదివాసీ పెత్తందార్ల అణచివేత, పితృస్వామ్యానికి,

మూడనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేయడంలో కా. సోని కృషి చేసింది. తెలుగులో వస్తున్న సాహిత్యాన్ని కోయలోకి అనువాదం చేయడం, పత్రికలలో రాయడం చేసేది. తను బాధ్యతల రీత్యా సివిల్‌లో పని చేయవలసి వచ్చినప్పటికీ, తను దీర్ఘకాల పేషెంట్ అయినప్పటికీ ఏనాడు కూడ రెస్ట్‌ను కోరుకోలేదు. ఒక వైపు శత్రువు ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడిలో భాగంగా ఆదివాసీ గ్రామాలపై పడి ఇండ్లను ధ్వంసం చేయడం, మహిళలపై అత్యాచారాలు చేయడం, అక్రమంగా అరెస్టు చేయడం లాంటి అనేక చర్యలు సాగించినప్పటికీ అధైర్య పడకుండా ప్రజలల్లో ఒకరిగా కలిసి పని చేసింది. శత్రువు చేస్తున్న దౌర్జన్యాలను బయటి ప్రపంచానికి తెలుపడం కోసం పార్టీ చేపట్టిన కార్యక్రమాలలో విలేఖర్లను, హక్కుల సంఘాల వాళ్లను పిలిపించినపుడు వారికి ఒక గైడ్‌లాగా ఉంటూ కోయ భాషలో మాత్రమే చెప్పగలిగిన ప్రజల బాధలు, కష్టాలు తెలుగులోకి అనువదించేది. శత్రువు ప్రజలను, పార్టీని నిర్మూలించాలని చూస్తున్నప్పటికీ కామ్రేడ్ సోని మాత్రం మావో చెప్పినట్టు ప్రజలే చరిత్ర నిర్మాతలు, ప్రజలు అజేయులు అనే భావన కామ్రేడ్ సోనిలో వ్యక్తమయ్యేది. కామ్రేడ్ సోని అనేక ఆటంకాల మధ్యనే దాదాపు 8 సంవత్సరాలు పామేడ్ ఏరియా కమిటీ సభ్యురాలుగా సేవలందించింది.

అనేక సంవత్సరాలు తెలుగు ప్రాంత ప్రజలతో, రాజకీయాలతో సంబంధం లేకపోయిననూ పార్టీ పనుల రీత్యా తెలుగు క్యాడర్, నాయకత్వం కలిసినపుడు చాలా ఉత్సాహంగా ఉండేది. వారితో రాజకీయాలు నిరంతరం చర్చించేది.

కామ్రేడ్ సోని 2013లో డివిజనల్ కమిటీ సభ్యురాలిగా ప్రమోట్ అయింది. తనకు డివిజన్ 'మోపోస్' టీచర్‌గా బాధ్యతలు ఇచ్చారు. ఇదే బాధ్యతలో 2015 వరకు పనిచేసింది. దాదాపు 22 సంవత్సరాలు విప్లవోద్యమంలో పనిచేసి ఆదర్శవంతమైన ప్రజా సేవకురాలిగా, నాయకురాలిగా ఎదిగింది. పార్టీ చేపట్టిన టీచర్ ట్రైనింగ్ క్యాంపెయిన్స్, ఫీల్డ్ ట్రైనింగ్ క్యాంపెయిన్, బోల్షివీకరణ క్యాంపెయిన్‌లలో ముఖ్య పాత్ర పోషించింది. 2015 డిసెంబర్ డివిజనల్ కమిటీ సమావేశంలో కామ్రేడ్ సోనిని పార్టీ అవసరాల రిత్యా డివిజన్ నుండి బదిలీ చేశారు. డివిజన్ నుండి బదిలీ కావడమంటే తన కన్న తల్లి నుండి బదిలీ అయినట్లు కన్నీరు కార్చుతూ, తనతో కలిసి మెలిసి ఇన్ని రోజులు తనకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించిన ప్రజలను నేను తిరిగి చూస్తానో, లేదో అనే బాధతో మాట్లాడింది. తను పుట్టి పెరిగిన తెలంగాణ, ఏ.పీ. ఉద్యమాన్ని వీడి దండకారణ్యానికి వచ్చినప్పుడు కూడా ఇంత బాధలేదు. కానీ ఈ రోజు దండకారణ్యం నాకు కన్న తల్లిలాంటిది. ఈలాంటి దండకారణ్యాన్ని వదులుతున్నందుకు బాధ ఉన్నప్పటికీ పార్టీ అవసరాల రీత్యా తప్పదనే నిర్ణయానికి వచ్చి క్యాడర్‌తో, ప్రజలందరితో వీడ్కోలు తీసుకున్నది.

తాను డీ.కే.నుండి బదిలీ అవుతున్న సందర్భంలోనే తెలంగాణ కామ్రేడ్స్‌ను చూసి వెళుతాననే కోరికతో తెలంగాణ కామ్రేడ్స్‌ను కలవడానికి వెళ్లింది. ఇదే సమయంలో శత్రువు చేపట్టిన ఆపరేషన్‌లో అమరురాలైంది. తను అనారోగ్యంతో ఉండి తుపాకి తేలేనని గ్రహించి తన తుపాకి వేరే కామ్రేడ్‌కు ఇచ్చింది. శత్రువు చేత చిక్కి అనేక చిత్రహింసలను అనుభవించి తాను ప్రేమించిన ఆదివాసీ గడ్డపైనే అమరురాలయింది. కామ్రేడ్ సోని భౌతికంగా మనముందు లేకున్నను, తన ఆశయం ప్రజల గుండెల్లో దాగి ఉంటుంది. కా. సోనికి విప్లవ జోహార్లు.

## కామ్రేడ్ కిస్కె పాండ్రు (కమ్లు, చందు)



కామ్రేడ్ కిస్కె పాండ్రు (కమ్లు, చందు, ఏ.సీ.ఎం.) ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, బీజాపూర్ జిల్లా భైరాన్‌గఢ్ బ్లాక్ ఊతుల గ్రామంలో 30 సంవత్సరాల క్రితం జన్మించాడు. కా. చందు కుటుంబం మొదట మాడ్ డివిజన్ ఇంద్రావతి ఏరియాలోని మెట్టపాడ్ గ్రామంలో ఉండేది. అక్కడ వారికి భూమి లేనందువల్ల బ్రతుకుదెరువు కోసం ఊతుల గ్రామంలో స్థిరపడ్డారు. ఊతుల గ్రామం పార్టీ రాజకీయాలకు బలంగా ఉంటుంది. దానితో కా. చందుకు చిన్నతనం నుండే విప్లవ రాజకీయాలతో పరిచయం ఉంది. గ్రామంలోని పెత్తందారుల ఆధిపత్యాన్ని, సమాజంలోని అసమానతలను అర్థం చేసుకొని 2002లో పార్టీలోకి పూర్తి కాలం కార్యకర్తగా వచ్చాడు.

ఇంద్రావతి ఎల్.ఓ.ఎస్.లో కొంతకాలం పనిచేసిన తర్వాత ఎల్.జీ.ఎస్.కు బదిలీ అయ్యాడు. 2004 సెప్టెంబర్‌లో 1వ కంపెనీకి బదిలీ అయ్యాడు. 1 కంపెనీలో ఉండగా దౌలా, కసంసూర్ ఘాటి, జార ఘాటి ఆంబుష్ దాడులలో పాల్గొన్నాడు. జారఘాటీ ఆంబూష్ దాడిలో 7గురు పోలీసులను చంపి, 7 తూపాకులు స్వాధీనం చేసుకున్న ఘటనలో పాల్గొన్నాడు. 2009లో నిబ్ కంపెనీకి బదిలీ అయ్యాడు. నిబ్ కంపెనీలో మిలిటరీ క్రమశిక్షణ, చొరవ, పట్టుదలతో బాధ్యతాయుతంగా పని చేయటాన్ని చూసి పీ.పీ.సీ.లోకి తీసుకుని సెక్షన్ కమాండర్‌గానూ, ప్లాటూన్ డిప్యూటీ కమాండర్‌గానూ బాధ్యతలు ఇచ్చారు.

నిబ్ కంపెనీలో ఉండగా ముర్కులా, లాహెరి ఆంబూష్‌లతో పాటు ఇంకా అనేక దాడులలో పాల్గొన్నాడు. 2009 లాహెరి దాడిలో 17 మంది పోలీసులు చనిపోయారు. 17 తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. కొంగెర, బాద్రాగఢ్ దాడులలో పాల్గొన్నాడు. తను మిలిటరీ రంగంలో పనిచేస్తున్నప్పటికీ, ఒక ఆర్గనైజర్ వలే మాడ్ డివిజన్ ప్రజలకు రాజకీయాలు బోధిస్తూ చైతన్య పరిచేవాడు. ప్రజలతో సంబంధాలను పెంచుకోవటంలో శ్రద్ధ చూపేవాడు. 2011 మార్చి

లో కా. లక్ష్మిని పార్టీ పద్ధతులతో పెళ్లి చేసుకున్నాడు. వారి వైవాహిక జీవితంలో ఎలాంటి సమస్యలు రాకుండా వ్యవహరించాడు.

సెప్టెంబర్ 2013లో 22 పీ.ఎల్.కు కామ్రేడ్స్ చందు, లక్ష్మి లు ఇరువురు అవసర రీత్యా బదిలీ అయ్యారు. కా. చందు కమాండర్‌గా, కా. లక్ష్మి ఏ.సీ.మెంబర్‌గా బాధ్యతలు చేపట్టారు.

2013 సెప్టెంబర్ నుండి తాను అమరుడయ్యే నాటికి 22 పీ.ఎల్.కు కమాండర్‌గా బాధ్యత వహించి నాయకత్వ కామ్రేడ్‌కు రక్షణగా, వారి పనులకు సహాయ పడ్డాడు. పీ.ఎల్. కొత్తది అయినప్పటికీ క్యాడర్‌తో కలిసిపోయి సమిష్టి పనులలో పాల్గొనేవాడు. నాయకత్వ రక్షణను దృష్టిలో పెట్టుకొని క్యాడర్‌కు రక్షణ విషయాలలో జాగ్రత్తలు, మెళుకువలు, మిలిటరీ శిక్షణ నిరంతరం ఇచ్చేవాడు. తనకు ఆసక్తిగా వున్న కమ్యూనికేషన్ క్లాసులో పాల్గొన్నాడు. రాజకీయంగా క్యాడర్‌ను అభివృద్ధి చేయడానికి కృషి చేసేవాడు.

తనది పేద కుటుంబం కావడంతో పార్టీలోకి వచ్చిన తర్వాతనే చదువు నేర్చుకున్నాడు. అలాగే 22 పీ.ఎల్.లోకి రావడంతో తెలుగు కూడా రాయడం, చదవడం నేర్చుకోవడానికి తీవ్ర ప్రయత్నం చేశాడు. జనవరి 11, 2016లో నేషనల్ పార్క్ ఏరియాలో తన జీవిత సహచరి కా. లక్ష్మి ఎన్‌కౌంటర్‌లో అమరత్వం చెందిననూ అధైర్యపడకుండా యుద్ధంలో ఇవి సహజమేనని నిబ్బరంగా తన బాధ్యతలు నిర్వహించాడు.

తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో టీ.సీ.ఓ.సీ.లో కలిసి ఉన్న సమయంలో సమాచార ఆధారంగా గ్రేహౌండ్స్, ఛత్తీస్‌గఢ్ బలగాలు సంయుక్తంగా చేపట్టిన అభియాన్‌లో బొట్టెం గ్రామం వద్ద మార్చి 1, 2016న శత్రువు దాడి చేయగా ఈ దాడిలో చందు వీరోచితంగా పోరాడుతూ అమరుడయ్యాడు. కా. చందు స్వగ్రామం దూరంగా ఉండడంతో పామేడ్ విప్లవ ప్రజానీకం కా. రోషన్‌తో పాటు కా. చందును కూడ విప్లవ సాంప్రదాయాలతో దహన సంస్కారాలను చేశారు. కామ్రేడ్స్ చందు, రోషన్‌ల ఆశయాలను ముందుకు తీసుకపోదామని శపథం చేశారు.

## కామ్రేడ్ నోరోటి సన్నాయి (మిన్కో)

కామ్రేడ్ మిన్కో (ఏ.సీ.ఎం.) మహారాష్ట్రలోని గఢ్‌చిరోలి జిల్లా, కసంసూర్ బ్లాక్, కోయన్‌గూడ గ్రామంలో 35 సం॥రాల క్రితం నోరోటి కూలే, దంపతులకు జన్మించింది. తల్లిదండ్రులకు ఉన్న నలుగురు సంతానంలో కా. మిన్కో మూడవది, ఒక అక్క, ఇద్దరు చెల్లెళ్లు వున్నారు. కా. మిన్కో తండ్రి, చెల్లెలు కూడా విప్లవోద్యమంలో అమరులయ్యారు. గఢ్‌చిరోలి జిల్లాలో పార్టీ బలంగా ఉన్న గ్రామాలలో కోయన్‌గూడ ఒకటి. పార్టీ నాయకత్వంలో గ్రామంలోని కుల వివక్షకు, తెగ కట్టుబాట్లకు, పెత్తందార్లకు, మహిళల పట్ల వివక్షకు వ్యతిరేకంగా కొనసాగుతున్న పోరాటాలకు ఆకర్షితురాలయింది. ఊరికి దళం వచ్చినప్పుడు తిండి సామానులు తెచ్చి ఇచ్చేది. సంఘం ఏ పని అప్పగించినా ఉత్సాహంగా, శ్రద్ధతో చేసేది.



కామ్రేడ్ మిన్కో లోని చురుకుదనాన్ని, చొరవను గమనించిన సంఘం క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘంలో పెట్టి పని చేయించింది. కా. మిన్కో అనతికాలంలోనే ఆ సంఘానికి నాయకురాలిగా ఎదిగింది. కా. మిన్కో తెగపెత్తందార్ల అణచివేతకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా మహిళలను సంఘటితం చేస్తూ విప్లవ రాజకీయాలను బోధించేది. పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమానికి మహిళలను కూడగడుతూ ధర్నాలు, ర్యాలీలకు నాయకత్వం వహించేది.

సాయుధ పోరాటంతో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయటం ద్వారా మాత్రమే సమాజంలోని మౌలిక సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మి 2003లో పూర్తి కాలం కార్యకర్తగా కసంసూర్ దళంలో చేరింది. వివిధ దళాలలో పని చేస్తున్న క్రమంలో కా. మిన్కోలోని మిలిటరీ క్రమశిక్షణ, పట్టుదల, చొరవను చూసి పార్టీ 2007లో సీ.ఆర్.సీ. 1వ కంపెనీకి బదిలీ చేసింది. సీ.ఆర్.సీ. 1వ కంపెనీ చేసిన నయాగఢ్ దాడిలో పాల్గొన్నది. ఈ దాడిలో 1200 తుపాకులు, 1లక్ష తూటాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న తుపాకులను రక్షించుకోవడంలో ముందున్నది. సీ.ఆర్.సీ. 1వ కంపెనీలో ఉన్నప్పుడే పీ.పీ.సీ.ఎం.గా ప్రమోటయ్యింది.

కా. మిన్కోను 2008లో సీ.ఆర్.సీ. 2వ కంపెనీకి సెక్షన్ కమాండర్‌గా బదిలీ చేశారు. కంపెనీ చేసిన అనేక దాడుల్లో తన సెక్షన్‌కు నాయకత్వం వహించింది. 2009లో దమన్‌జోడి (నాల్కో ఏ.వో.బీ.) దాడి, బంద అంబూష్ (డీ.కే.), ముకరం అంబూష్ (డీ.కే.), జీరంఘాటీ అంబూష్ (డీ.కే.)లో కాంగ్రెస్ నాయకుల కాన్వాయిపై దాడి, కుర్నపల్లి అపార్చునిటీ అంబూష్ (తెలంగాణ), సత్యానారాయణ పురం (తెలంగాణ) బ్యాంకుపై దాడి చేసి 10 లక్షల రూపాయలు స్వాధీనం చేసుకోవడంలో, ఏ.ఓ.బీ.లో విద్యుత్ కేంద్రంపై దాడి చేసి జనరేటర్లను స్వాధీనం చేసుకోవడం వంటి పెద్ద దాడులతో పాటు, గోవిందపల్లి దాడి, కోరాపుట్ (ఏ.వో.బీ) దాడిలో 303 తుపాకులను స్వాధీనం చేసుకోవటంలో, తేమల్‌వాడ్ అంబూష్ (డీ.కే.), పూజారిగూడ అంబూష్ (ఏ.వో.బీ.), శ్రీరాంపూర్ అంబూష్ (ఒడిషా), గీదం దాడి, జప్పూర్ అంబూష్ (డీ.కే.) వంటి చిన్న దాడులతో పాటు అనేక దాడులలో పాల్గొన్నది. అనేక మంది హోంగార్డులు, ఇన్‌ఫార్మర్లను ఖతం చేయడంలో, ప్రభుత్వ, భూస్వాముల ఆస్తులను స్వాధీనం చేసుకొని ప్రజలకు పంచటంలో ముఖ్య పాత్ర పోషించింది. ప్రభుత్వ ఆస్తులు, మోబైల్ టవర్లు, భూస్వాముల ఆస్తులను ధ్వంసం చేసిన దాడులలో కా. మిన్కో పాల్గొన్నది. తను కమాండర్‌గా వుండి బంద లో 10

మంది ఎస్.పీ.ఓ.లను చంపటంలో పాల్గొన్నది. కా. మిన్కో సీ.ఆర్.సీ. రెండవ కంపెనీకి వచ్చినప్పటినుండి కంపెనీ సభ్యులందరితోనూ కలివిడిగా ఉంటూ, పార్టీ క్రమశిక్షణను తాను పాటిస్తూ తోటి కామ్రేడ్స్ కూడ క్రమశిక్షణగా వుండే విధంగా తన వంతు బాధ్యతను నిర్వహించింది. రాజకీయంగా, మిలిటరీ పరంగా పట్టుకలిగి ఉండి, తెలియని విషయాలు తెలుసుకోవడానికి శ్రద్ధ చూపేది. ప్రజలతో సంబంధాలను పెంచుకోవడానికి చొరవ చేసేది. కా. మిన్కోను 2012 లో ప్లాటూన్ డిప్యూటీ కమాండర్‌గా ప్రమోట్ చేసినప్పటి నుండి సెక్షన్ కమాండర్‌గానూ, ప్లాటూన్ డిప్యూటీ కమాండర్‌గాను ఉంటూ రోజు వారి పనులలో తాను పాల్గొంటూ సభ్యులను పాల్గొనేలా ప్రోత్సహించేది. కా. మిన్కో తనకు తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉన్నప్పటికీ తనకు అప్పగించిన పనులను బాధ్యతాయుతంగా చేసేది.

సమాచార ఆధారంగా తెలంగాణ గ్రేహౌండ్స్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు సంయుక్తంగా బొట్టెం గ్రామం వద్ద చేసిన దాడిలో కా. మిన్కో నాయకత్వాన్ని రక్షిస్తూ 8 మంది సహచరులతో పాటు కామ్రేడ్ మిన్కో అమరురాలైంది. గెరిల్లాల ప్రతిఘటన దాడికి ఆందోళన చెందిన పోలీసులు డేరా మొత్తం తనిఖీ చేయకుండా దొరికిన 8 శవాలను మాత్రమే తీసుకెళ్లారు. మరుసటి రోజు కా. మిన్కో శవాన్ని ప్రజలు తీసుకొచ్చి విప్లవ సాంప్రదాయాలతో అంత్యక్రియలు చేశారు. ఇందులో అనేక గ్రామాల ప్రజలు, ప్రజా సంఘాలు, పీ.ఎల్.జీ.ఏ., పార్టీ పాల్గొని కా. మిన్కో ఆశయాలను తుదివరకు కొనసాగిద్దామని శపథం చేస్తూ, అంతిమ వీడ్కోలు పలికారు.

## కామ్రేడ్ కొత్తకొండ సృజన (రాగో, నవత)

కా. కొత్తకొండ సృజన (రాగో, నవత, ఏ.సీ.ఎం.) వరంగల్ జిల్లా హన్మకొండ మండలం పైడిపల్లి గ్రామంలో 1990 అక్టోబర్ 26న నిరుపేద కుటుంబమైన కొత్తకొండ శాంతక్క భీమన్న దంపతులకు జన్మించింది. కా. నవతకు ఒక అన్న, ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. నవత తల్లి దండ్రులు కూడ విప్లవోద్యమంలో కొంత కాలం పని చేసి సాధారణ జీవితం గడుపుతున్నారు. అయినప్పటికీ విప్లవోద్యమం నుండి దూరం కాకుండా పార్టీని అంటిపెట్టుకొని వున్నారు.



కా. సృజనది విప్లవ కుటుంబమే కాకుండా వరంగల్ జిల్లా విప్లవోద్యమ నిర్మాణానికి బీజాలు వేసిన కా. జన్ను చిన్నాలుకు తను మేన కోడలు. కా. సృజన చిన్న తనం నుండే కా. చిన్నాలు యొక్క ప్రేరణతో, స్ఫూర్తితో విప్లవాన్ని ప్రేమించడం, చదవడం అలవాటు చేసుకున్నది. అలాగే గ్రామం కూడ పార్టీకి పెట్టని కోటగా పని చేయడం, తన తల్లి ప్రజాసంఘంలో క్రియాశీలంగా పని చేయడంతో కా. సృజనకు చిన్న తనం నుండే పార్టీ చరిత్ర, సాహిత్యం పరిచయమయ్యాయి. నవత ప్రాధమిక విద్య నుండి హైస్కూల్ విద్య వరకు తన స్వంత గ్రామమైన పైడిపల్లిలోనే చదువుకుంది. చిన్నతనం నుండే కా. సృజన ప్రజా సంఘాల కార్యకర్తలతో వివిధ సభలకు, సమావేశాలకు ముఖ్యంగా మహిళా సంఘాల కార్యక్రమాలకు, అమర వీరుల బంధు మిత్రుల సంఘం కార్యక్రమాలకు తన తల్లితో పాటు హాజరయ్యేది.

పై చదువుల (ఇంటర్మీడియట్) కోసం హైదరాబాద్ చేరుకుంది. మలిదశ తెలంగాణ పోరాటం ఉధృతంగా సాగుతున్న కాలంతో పాటు తన చిన్ననాటి నుండే ఆదర్శమైన విప్లవం కోసం పని చేయాలనే తపనతో కాలేజీ చదువుతో పాటు మహిళా సంఘాలలో పని చేస్తూ నగరంలోని మురికివాడలు, పేద బస్తీలల్లో ఉండే ప్రజల సమస్యలను తెల్సుకున్నది. చైతన్య మహిళా సంఘంలో చేరి, మహిళలను కూడగడుతూ కాలేజీలల్లో, హాస్టల్లలో జరిగే అవినీతికి, ర్యాగింగ్‌లకు వ్యతిరేకంగా పోరాడాలని చెపుతూ మహిళా సంఘం చేపట్టిన కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేది. తన స్నేహితులను కూడా కార్యక్రమాలలో పాల్గొనే విధంగా ప్రోత్సహించేది. నగరంలో, కాలేజీలలో మహిళలపై వేదింపులకు, అత్యాచారాలకు, వివక్షలకు వ్యతిరేకంగా పోరాడుతూనే ప్రజాస్వామిక తెలంగాణ కోసం జరుగుతున్న పోరాటంలో తన వంతు పాత్రను పోషించేది. ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతూనే కా. సృజన తన కార్యాచరణను మరింత విశాలం చేసుకోవడంలో భాగంగా 2006 అక్టోబర్‌లో పార్టీలోకి పూర్తికాలం కార్యకర్తగా వచ్చింది.

తను ప్రేమించిన పార్టీని ప్రత్యక్షంగా కలవడం, అడవి తల్లి అందాన్ని చూడడంతో కా. సృజన చాలా సంతోషంతో తన సాయుధ విప్లవ జీవితాన్ని ప్రారంభించింది. ఒక పని నిమిత్తం దళం నుండి మండల కేంద్రానికి పోయిన తర్వాత ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో పోలీసులు కా. సృజనను అరెస్టు చేసి, చిత్రహింసలు పెట్టినప్పటికీ పార్టీ నాయకత్వాన్ని రక్షించడం కోసం తను ధైర్యంగా, మనో నిబ్బరంగా శత్రువుతో వ్యవహరించింది. దీనితో ఏమి చేయలేని శత్రువు సృజనను జైల్లో వేశాడు.

కా. సృజన అనారోగ్యంగా వుండగా శత్రువు పెట్టిన చిత్రహింసలు తనను మరింత అనారోగ్యం పాలు చేసినాయి. సంవత్సర కాలం జైలు జీవితాన్ని గడిపింది. ఆ సమయంలో జైలులో సీనియర్ నాయకత్వం వుండడంతో కామ్రేడ్ సృజనకు జైలు కూడా పోరు పాఠశాల అయింది. జైలులో విప్లవ పాఠాలు నేర్చుకుంటూనే జైలు అధికారుల దోపిడీకి, అవినీతికి వ్యతిరేకంగా, ఖైదీల హక్కులకై, జైలులోని మహిళా సమస్యలపై జరిగే

పోరాటాలలో చురుకుగా పాల్గొన్నది. జైలు అధికారులు నీవు చిన్న పిల్లవు కదా నీకెందుకు గొడవలు అనగా కష్టాలు అనేవి చిన్న పిల్లలకు కూడా వున్నాయి గదా అంటూ అధికారులకు సమాధానం చెప్పింది. జైలులో పొందిన ప్రేరణతో విడుదలయిన వెంటనే కామ్రేడ్ సృజన మళ్లీ డిసెంబర్ 2007లో పార్టీ పిలుపు మేరకు పార్టీలోకి వచ్చింది.

2008 జనవరి నుండి ఏటూరు నాగారం-మహాదేవపూర్ ఏరియాలో తన కార్యాచరణను కొనసాగించింది. దళం నిరంతరం శత్రువు డేగ కళ్ల మధ్యనే తన కార్యకలాపాలు సాగించేది. ఈ ప్రాంతం కొంత సమతల ప్రాంతం కావడంతో, శత్రువు నిరంతరం కూంబింగ్‌లు చేసేవాడు. దానితో దళం రోజుల తరబడి నడవడం, గంటల తరబడి నీళ్లు, వంట సామాను మోయడం లాంటి కష్టమైన జీవితాన్ని కొనసాగించేది. ఈ క్రమంలో మైదాన, పట్టణ ప్రాంతం నుండి వచ్చిన కా. సృజనకు ఇలాంటి పనులు కొత్తవే అయినప్పటికీ, జైలులో చిత్రహింసలతో మరింత అనారోగ్యం పాలైనప్పటికీ సమిష్టి పనులు (వంట, కిచెన్, సెంట్రీ, బరువులు మోయడం) చేసేది. దళం అలసి పోయినప్పుడు తన కవితలతో దళాన్ని ఉత్తేజపరిచేది. ఈ ఏరియాలో దాదాపు 8 నెలలు పని చేసిన తరువాత తన ఆరోగ్యం, పై కమిటీల పనుల రిత్యా కా. సృజనను సీ.ఆర్.బీ. ప్రెస్‌కు బదిలీ చేశారు.

2008 సెప్టెంబర్‌లో సీ.ఆర్.బీ. ప్రెస్ యూనిట్‌కు వచ్చిన తరువాత తనకు పరిచయం లేని కంప్యూటర్ జ్ఞానాన్ని నేర్చుకొని సీ.ఆర్.బీ. పత్రిక అయిన క్రాంతి తీయడానికి రాత్రింబవళ్లు కష్టపడి పనిచేసేది. అంతే కాకుండా కేంద్ర కమిటీ అందించే సాహిత్యాన్ని, సర్క్యులర్లను, కరపత్రాలను వివిధ రాష్ట్రాల క్యాడర్‌కు అందించడంలో తన పాత్ర కూడా వుంది. ప్రెస్ పనులు చేస్తూనే ఖాళీ సమయంలో సమిష్టి పనులు చేస్తూ పీ.ఎల్.లో క్యాడర్‌తో కలిసిపోయేది. వారితో కలుపుగోలుగా వుంటూనే తనకు రాని గోండీ భాషను త్వరలోనే నేర్చుకొని తెలుగు పత్రికలను, సమాచారాన్ని క్యాడర్‌కు కోయలో చెప్పగలిగేది. పీ.ఎల్.లో మంచి డాక్టర్‌గా కూడా తన సేవలను అందించింది.

శత్రు నిర్బంధ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని పార్టీ నాయకత్వం తాత్కాలికంగా క్రాంతి పత్రికను 2013లో రద్దు చేసింది. ఈ పరిస్థితులలో కా. సృజనను తిరిగి తెలంగాణ రాష్ట్ర కమిటీ పరిధిలోకి (స్టాఫ్‌గా) ఫిబ్రవరి 2014లో బదిలీ చేశారు. దాదాపు 6 నెలల పాటు నాయకత్వానికి కంప్యూటర్ పనులలో సహాయ సహకారాలు అందించింది. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రెస్ యూనిట్ ప్రారంభం కాగానే అందులో రెండు సంవత్సరాలు పని చేసింది. తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార పత్రిక అయిన తెలంగాణ సమాచార బులెటిన్‌లు-2, ప్రజా విముక్తి పత్రిక-1 రావడానికి తను ఆహర్నిశలు కృషి చేసింది. ఈ విధంగా ఏ ప్రెస్ యూనిట్‌లో వున్ననూ క్యాడర్‌కు నిరంతరం సాహిత్యం, బోల్షివిక్, దిద్దుబాటు సర్క్యులర్లను అందిస్తూ, రాజకీయాలు పెంపొందడానికి పరోక్షంగా తను ఉపయోగపడ్డది. తనకు సమయం దొరికినపుడు వివిధ సందర్భాలలో వస్తున్న సమస్యలు, అమరులపై పత్రికలలో సృజన పేరుతో కవితలు రాసేది. సమావేశాలలో పాటలు పాడేది. తను ఎక్కడ పనిచేసిననూ తోటి కామ్రేడ్స్‌తో పాటు ప్రజలతో కూడా త్వరలోనే కలిసిపోయేది. అట్లా డి.కే.లోని దక్షిణ బస్తర్, పశ్చిమ బస్తర్ ప్రజలలో కూడా చాల మందికి నవతతో పరిచయముంది. నవత ప్రజలకు వైద్యం కూడా అందించేది.

కా. నవతలోని పట్టుదలను, కలిసిపోయే సుగుణాలను, అనారోగ్యాన్ని సహితం లెక్క చేయకుండా తుది శ్వాస విడిచే వరకు పోరాడిన త్యాగాన్ని ఎత్తిపడుదాం. కా. సృజన ఆశయాలను తుదివరకు కొనసాగిస్తామని శపథం చేద్దాం.

## కామ్రేడ్ దనసరి సారక్క (అనిత)



కామ్రేడ్ దనసరి సారక్క (అనిత, పీ.ఎం.) వరంగల్ జిల్లా కొత్తగూడ మండలంలోని మడగూడెం గ్రామంలో పేద ఆదివాసీ కుటుంబంలో 25 సం॥రాల క్రితం జన్మించింది. నలుగురు అక్కా చెల్లెళ్లు, ముగ్గురు అన్నదమ్ములు వున్నారు. పేదవారు కావడంతో చదువుకోలేదు. చిన్న తనంలోనే అదే మండలంలోని ఎర్రారం గ్రామస్థునితో తల్లి దండ్రులు వివాహం జరిపించారు. తన గ్రామం విప్లవ రాజకీయాలకు నెలవు కావడంతో ప్రజా పోరాటాలలో చురుకుగా పాల్గొన్నది. వేళ్లూనికొని వున్న పితృస్వామ్య వ్యవస్థకు, గృహహింస, సారా వ్యతిరేక ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీ.డీ.పీ. అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళా సంఘంలో పని చేస్తున్న క్రమంలో తమ నియోజకవర్గ ఎం.ఎల్.ఏ. అయిన సీతక్క అనుచరురాలిగా కొంతకాలం పని చేసిన తర్వాత ఏ బూర్జువా రాజకీయ పార్టీలు పేదవాళ్ల ఆకలిని తీర్చేవి కావని, వీడితులను మరింత దోచుకొని ఆస్థులను కూడబెట్టుకోవడానికేనని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలోని లోసుగులను గమనించింది. ఇలా సమాజంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను, మహిళలపై జరుగుతున్న హింస, అత్యాచారాలను సునిశిత దృష్టితో పరిశీలిస్తూ, అభ్యుదయంగా ఆలోచిస్తూ తన భర్తలో పేరుకుపోయిన పితృస్వామ్య భావజాలాన్ని ఎండగడుతూ, అతని అవలక్షణాలను నిరంతరం గుర్తుచేస్తూ, అభ్యుదయ ఆలోచనపరురాలిగా వ్యవహరిస్తున్న కా. సారక్కను తన భర్త నిరంతరం వేదించసాగాడు.

ఈ క్రమంలో కుటుంబ బంధనాలను తెంచుకొని అందుబాటులో వున్న సీ.పీ.ఐ.(ఎం.ఎల్.) న్యూ డెమోక్రసీ దళంలో చేరింది. అనతి కాలంలోనే కమ్యూనిస్టు ముసుగులో న్యూడెమోక్రసీ పార్టీ, దళ నాయకులు అవలంభించే విధానాలు, పద్ధతులు, సొంత ఆస్థులు

కూడబెట్టుకోవడం, మహిళల పట్ల చిన్న చూపు, ప్రజల కోసం పని చేస్తున్నామనే భ్రమే తప్పా, వాస్తవం లేదని న్యూడెమోక్రసీ వర్గ సంకర రాజకీయాలను ఎండగడుతూ భారతదేశంలో పీడిత ప్రజల విముక్తి కోసం నిస్వార్థంతో పనిచేస్తున్న మావోయిస్టు పార్టీ వైపు అడుగులు వేసింది.

కా. దనసరి సారక్క 2014 ఆగస్టులో ఇల్లెందు-నర్సంపేట దళ సభ్యురాలిగా చేరింది. చిన్నతనం నుండి కష్టాలను అనుభవించిన కా. అనిత అందరితో కలివిడిగా ఉంటూ చదువు నేర్చుకొనుటకు నిరంతరం శ్రమించేది. 10 రోజులు జరిగిన మిలిటరీ క్యాంపులో ఉత్సాహంగా పాల్గొన్నది. తనకు అనారోగ్య సమస్యలు ఉన్నప్పటికీ వాటిని అధిగమిస్తూ సమిష్టి పనులల్లో చురుకుగా పాల్గొనేది. తెలంగాణ విప్లవోద్యమాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో శత్రువు ఎన్ని దాడులు, ఎన్‌కౌంటర్లు చేసినా మొక్కవోని దీక్షతో, తనతో పని చేసిన సహచరులు అమరులవుతున్నా విప్లవం పట్ల వారికున్న అంకిత భావాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఆచరణలో ముందుకెళ్లింది.

ఏరియాలోకి దళం వెళ్లినపుడు తను స్థానికురాలు కావడంతో పైలట్‌గా, కోరియర్‌గా పని చేసేది. తెలంగాణలో విప్లవోద్యమ పునర్నిర్మాణానికి తన బంధువులను, మిత్రులను విప్లవోద్యమానికి పరిచయం చేస్తూ నిర్మాణాల పునాదిని పటిష్టం చేయడంలో ఎంతో కృషి చేసింది. విప్లవోద్యమంలో పని చేసిన సంవత్సరన్నర కాలంలో క్యాడర్‌కు, నాయకత్వానికి తలలో నాలుకలా ఆత్మీయ అనురాగాలు పంచింది. తెలంగాణ విప్లవోద్యమ పునర్నిర్మాణానికై తనవంతు నెత్తురునిచ్చి బొట్టెం వద్ద అమరురాలైంది. కా. సారక్క కలలుగన్న రాజ్యాన్ని స్థాపించేవరకు విశ్రమించని సైనికులవుతాం. కా. అనిత నీకివే మా విప్లవ జోహార్లు!

## కా. పద్దం చైతు (రోషన్)



కా. చైతు (పీ.ఎం.) ది బీజాపూర్ జిల్లా ఊసూరు బ్లాక్‌లోని పెద్ద భట్టుం గ్రామం. 22 సంవత్సరాల క్రితం ఒక మధ్య తరగతి ఆదివాసి కుటుంబంలో లక్ము, సోమె దంపతులకు మూడో సంతానంగా జన్మించాడు.

కా. చైతు బాల్యమంతా విప్లవ కార్యకలాపాల నడుమనే వికసిస్తూ వచ్చింది. బాలల సంఘంలో ఉంటూనే పంచాయితీ జనతన సర్కార్ పాఠశాలలో ప్రాథమిక విద్యనభ్యసించాడు. 16 ఏళ్ళ వయస్సు వచ్చాక దండకారణ్య ఆదివాసీ రైతుకూలీ సంఘంలో చేరాడు. ఆ తరువాత క్రమంలో జీ.ఆర్.డీ.లో వుంటూ మిలిటెంట్‌గా పని చేశాడు.

కా. చైతు పూర్తికాలం పార్టీలోకి 2012లో వచ్చాడు. గత నాలుగు సంవత్సరాలుగా కా. చైతు పార్టీలో మిలిటరీ రంగంలో పని చేశాడు. పామేడ్ ఏరియా పరిధిలో జరిగిన అనేక మిలిటరీ చర్యలలో, టీ.సీ.ఓ.సీ. కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నాడు. అనేక ఘటనలలో కా.చైతు గందరగోళ పడకుండా శత్రువుపై సాహసాన్ని, వీరత్వాన్ని ప్రదర్శించాడు. పార్టీ అతనిలోని పోరాట పటిమను, క్రమశిక్షణను గుర్తించి కా. చైతును నాయకత్వ కామ్రేడ్‌కు గార్డుగా నియమించింది. అయితే కొద్ది సమయంలోనే తను ఒక మిలిటరీ ట్రైనింగ్ క్యాంపులో ఒక నూతన సైనిక విన్యాసాన్ని నేర్చుకునే క్రమంలో గాయపడ్డాడు. చికిత్స చేయించుకొని త్వరలోనే తిరిగి తన పనుల్లో నిమగ్నమయ్యాడు.

2015లో ఒక ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా కా. చైతును స్థానిక పార్టీ కమిటీ తెలంగాణకు పంపింది. సంవత్సరన్నర కాలం తెలంగాణలోనే పని చేశాడు. తెలంగాణ ప్రాంతం తనకు కొత్తదయినప్పటికీ, తీవ్ర నిర్బంధ పరిస్థితులకు అనుగుణంగా తన కార్యాచరణను కొనసాగించాడు. తెలంగాణలో శత్రువు అవలంబిస్తున్న మోసపు ఎత్తుగడలను నీరుగారుస్తూ తన వంతు సేవలందించాడు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ బలగాలు సంయుక్తంగా చేసిన లంకపల్లి ఆంబుష్‌లో సాహసంగా శత్రువును ప్రతిఘటిస్తూ తోటి కామ్రేడ్స్ సురక్షితంగా రిట్రీట్ అయ్యేందుకు తోడ్పడ్డాడు. రిట్రీట్ అయిన నిరాయుధ కామ్రేడ్స్‌ను శత్రువు పట్టుకోవడానికి ప్రయత్నించగా ప్రజల మద్దతుతో శత్రువు ఎత్తులను చిత్తు చేసి తప్పుకోవడంలో తన పాత్ర కీలకమైనది. సింగం, పావురు దాడులలో పాల్గొన్నాడు.

పార్టీ రాజకీయాలు, మిలిటరీ నియమాలు, ప్రజల్ని సంఘటిత పరిచే విషయాల్లో కా. చైతు శ్రద్ధ పెట్టేవాడు. సమస్యల పట్ల తన అభిప్రాయాలను స్పష్టంగా వ్యక్తీకరించేవాడు. కొత్త విషయాలను నేర్చుకోవటానికి ఆసక్తి కనబరిచేవాడు. విప్లవ భావాలను మనసులో నింపుకొని నిలదొక్కుకోవడం లాంటి అమూల్యమైన ఆదర్శాలు కా. చైతులో కనబడతాయి.

కా. చైతు భవిష్యత్తుపై స్థానిక పార్టీ కమిటీ ఎన్నో ఆశలు పెట్టుకుంది. పీ.ఎల్.జీ.ఏ. క్యాడర్స్ " ఒక అలగా ఎగిసిపడ్డ ప్రతిఘటనా రూపాన్ని" కా. చైతులో చూసారు. కా. చైతులోని ఆదర్శాలు, పట్టుదల మనకందరికి ఆదర్శం. చైతు అమరత్వానికి, ద్రోహి అయిన "శివాజి" కుక్కచావుకు మధ్య అగాధాన్ని స్పష్టంగానే ప్రజలు చూడగలుగుతారు.

కా. చైతు శవాన్ని ప్రజలు అనేక కష్టాల మధ్యనే భద్రాచలం నుంచి తెచ్చుకొని విప్లవ సాంప్రదాయాలతో దహన సంస్కారాలు చేశారు. అంతిమయాత్రలో అనేక గ్రామాల ప్రజలు పాల్గొని తమ కన్నీటితో అంతిమ వీడ్కోలు పలికారు. కా. చైతు ఆశయమైన విప్లవాన్ని విజయవంతం చేద్దామని ప్రతిన బూనారు.

## కా. నూపో రామె



కా. రామె (పీ.ఎం.)ది బీజాపూర్ జిల్లా ఊసూరు బ్లాక్‌లోని నర్సాపురం గ్రామం. త్యాగాలకు పేరుగాంచిన, ప్రతిఘటనకు మరో రూపమున్న ఈ గ్రామం పది మంది విప్లవ వీరుల్ని విప్లవానికి అంకితమిచ్చింది. అందులో కా. రామె ఒకరు.

కా. రామే పేద కుటుంబంలో తల్లి దండ్రులకు రెండో సంతానంగా 23 ఏళ్ల క్రితం జన్మించింది. రామెకు ఒక అక్క, ఇద్దరు తమ్ముళ్లు వున్నారు. చిరు ప్రాయంలోనే అమ్మ ప్రేమకు దూరమయింది. తండ్రిని పోలీసులు అరెస్టు చేసి జైల్లో వేసారు. తండ్రి అంధుడు. చిన్న వయసులోనే అక్కకు పెళ్లి అయింది. అప్పట్నుంచి రామె కుటుంబానికి పెద్ద దిక్కయింది. చిన్న వయసులోనే బాధ్యతగా పనులు చేయడం నేర్చుకుంది. నిరుపేద జీవన పోరాటంలోని అనుభవాలను ఒంట బట్టించుకుంటూ తమ ఊరిలో కొనసాగుతున్న విప్లవ కార్యకలాపాలకు ఆకర్షితురాలయింది. ఒక పక్క తన కుటుంబాన్ని పోషిస్తూనే "చేతనా నాట్యమంచ్" సాంస్కృతిక కళా సంస్థలో సభ్యురాలైంది. విప్లవ రాజకీయాలను ఆ సంఘంలో పని చేస్తూ అర్థం చేసుకోవడం మొదలు పెట్టింది. ఈ క్రమంలో తమ కుటుంబ సమస్యలతో పాటు గ్రామంలోని వర్గ సంబంధాలను కొద్ది కొద్దిగా అర్థం చేసుకుంటూ వ్యవస్థ మార్పుకై విప్లవోద్యమం చూపించిన పరిష్కార మార్గాన్ని తన జీవితంలోని ఒడి దుడుకుల అనుభవాల నుండి సులువుగానే గుర్తించగలిగింది.

2006లో కా. రామె ఇంటిని సల్వాజుడుం గూండాలు కాల్చివేయగా, సర్వం కోల్పోయి అనేక కష్టాలు పడ్డారు. తమ కష్టాలకు, పీడిత ప్రజల బాధలకు పరిష్కారం విప్లవోద్యమంతోనే సాధ్యమవుతుందని నమ్మి, కా. రామె ఒక రోజు తన కుటుంబ సభ్యులందరిని కూర్చోబెట్టి మాట్లాడింది. తను పార్టీలోకి వెళ్లాలనుకున్న విషయం చెప్తూనే ఎలా బ్రతకాలి, ప్రజలతో, స్థానిక పార్టీ, ప్రజా సంఘాలతో ఎలా మెలగాలి, విప్లవానికి తమ వంతు చేయూత నివ్వడం ఎలా, అనే విషయాలు వాళ్లతో చర్చించింది. కా. రామె జూలై 2012లో పీ.ఎల్.జీ.ఏ.లోకి రిక్రూట్ అయింది. అప్పటి నుండి తన చివరి శ్వాస వరకు కా. రామె ఉత్సాహంగా పార్టీ ఇచ్చిన పనుల్లో పాల్గొంది. త్వరగా చదువు నేర్చుకొని, ఇతరులకు కూడా చదువు చెప్పేది. సంవత్సరం పాటు పామేడ్ ఏరియా స్థానిక దళాలలో పని చేసింది. పార్టీ 2013లో కా. రామెను కా. సోని (తనతో అమరురాలైన) కి గార్డుగా నియమించింది. దీర్ఘకాలం అనారోగ్యంతో బాధపడుతున్న కా. సోనికి రామె బాధ్యతాయుతంగా గార్డుగా విధులు నిర్వహించింది. విప్లవ స్ఫూర్తితో సేవలందించింది.

కా. రామె ఎక్కువగా మాట్లాడేది కాదు. పనులలో మాత్రం ముందుండేది. సమస్యలు ఎదురైనప్పుడు ఊగిసలాటకు గురయ్యేది కాదు. తనలో జరిగే తప్పుల్ని సూచిస్తే నిజమైన కమ్యూనిస్టు చైతన్యంతో స్వీకరించేది. దొరికిన సమయాన్ని వినియోగించుకుని అధ్యయనం చేస్తూ తన రాజకీయ చైతన్యాన్ని పెంపొందించుకునేందుకు ప్రయత్నించేది.

కా. సోనితో పాటే కా. రామె కూడా సజీవంగా పోలీసుల చేతికి చిక్కింది. పులి నోటికి చిక్కానని అర్థమయ్యి కూడా కా. రామె వర్గ రాజకీయాలను మరువలేదు. పోరు వారసత్వాన్ని విడువలేదు. శత్రువు చిత్రహింసల్ని వర్గ చైతన్యంతో ఓడించింది. ప్రాణాన్ని ఫణంగా పెట్టి అమరుల ఆశయాలను ఎత్తిపట్టింది.

తనువు చాలించిన ఆ పోరు బిడ్డ అంతిమయాత్రకు వందల సంఖ్యలో ప్రజలు తరలివచ్చి కా. రామె ఆశయ సాధనకు అంకితమవుదామని శపథం చేసారు.

## కా. మాడివి దేవె



కా. దేవె (పీ.ఎం.)ది బీజాపూర్ జిల్లా ఊసూరు బ్లాక్‌లోని మెట్టగూడెం. దండకారణ్యంలో విప్లవోద్యమం తొలి అడుగులు పడ్డప్పటి నుండి చాల బలమైన విప్లవ రాజకీయాలతో, నిర్మాణాత్మక కార్యక్రమాలతో ముడిపడి వున్న పామేడ్ ఏరియాలోని మెట్టగూడెం గ్రామంలో ఒక పేద ఆదివాసీ కుటుంబంలో 18 సం॥రాల క్రితం జన్మించింది. కా. దేవె తల్లిదండ్రులు మాడివి జోగి, సుక్కాలు. దేవెకు ఒక అన్న, ఒక అక్క ఒక తమ్ముడు, ఒక చెల్లెలు వున్నారు. తమ అత్త మామలకు బిడ్డలు లేని కారణంగా చిన్న వయస్సు నుండే దేవెను పెంచుకున్నారు. అలా తన అత్త, మామల వద్దనే ఎంతో కష్టపడుతూ వారికి తోడ్పటునందించింది.

మెట్టగూడెం ఒక విప్లవ గ్రామం కావడంతో ఈ వాతావరణంలో పుట్టి పెరిగిన కా. దేవె సహజంగానే విప్లవోద్యమానికి ఆకర్షితురాలయింది. తన బాల్యంలోనే బాలల సంఘంలో పనిచేస్తూ, వయసు పెరిగిన క్రమంలో మిలీషియా, జీఆర్‌డీ లలో పని చేస్తూ ప్రజా కార్యక్రమాలకు శత్రువు ప్రమాదం నుండి రక్షణనిచ్చింది.

కా. మాడివి దేవె 2015 డిసెంబర్‌లో పీ.ఎల్.జీ.ఏ.లోకి రిక్రూట్ అయింది. తను పార్టీలోకి వచ్చేముందు కుటుంబ సభ్యులందరితో మాట్లాడి వాళ్ళందరూ కూడా తన ప్రతిపాదనను స్వీకరించేలా స్వయంగా తానే సిద్ధపరిచింది. అయితే నేడు ఇంత తక్కువ కాలంలోనే ఈ కుటుంబాన్నే కాకుండా, పార్టీని, పీ.ఎల్.జీ.ఏ.ను, విప్లవ

**(మిగతాది 10వ పేజీలో)**

# తొలితరం విప్లవ మహిళ కామ్రేడ్ ద్రోణవల్లి అనసూయమ్మ అమర్ రహే!

కామ్రేడ్ ద్రోణవల్లి అనసూయమ్మ (75), 2015 నవంబర్ 5న తాను నివాసముంటున్న విజయవాడలో మృతి చెందారు. ఆమె ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో కోస్తాంధ్ర ప్రాంతంలో నిర్మితమైన సాయుధ దళాల్లో పనిచేసిన మొదటి మహిళా గెరిల్లా యోధ. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా మొదలైన ఆమె విప్లవ ప్రయాణం, సీపీఐ (ఎం-ఎల్) (పీపుల్స్‌వార్) నాయకత్వంలోని రైతు కూలీ సంఘం వరకూ కొనసాగింది.



కామ్రేడ్ అనసూయమ్మ 1930లో నాటి ఆంధ్ర రాష్ట్రంలోని కృష్ణా జిల్లా మేడూరులోని ఒక మధ్య తరగతి రైతు కుటుంబంలో పుట్టారు. పది పదకొండేళ్ల నుండే జాతీయోద్యమం పట్ల ఆసక్తిని పెంచుకున్న కామ్రేడ్ అనసూయమ్మ పద్నాలుగేళ్ల వయసులో కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆకర్షితులయ్యారు. ఊళ్లోని గ్రంథాలయంలో రష్యన్ సాహిత్యం చదివి ఉత్తేజితులయి, రష్యాలో వున్నటువంటి కమ్యూనిస్టు ప్రభుత్వం మన దేశంలోనూ వుండాలని కలలు కన్నారు. ఆ కలల సాకారం కొరకు కమ్యూనిస్టు పార్టీలో చురుకైన కార్యకర్తగా మారారు. వరకట్నం, హిందూ మత సాంప్రదాయాలను ధిక్కరించి ఆనాడు కమ్యూనిస్టు పార్టీలో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తున్న కామ్రేడ్ ద్రోణవల్లి సత్య ప్రసాద్‌ను ఆదర్శ వివాహం చేసుకున్నారు. పెళ్లయ్యాక తన విప్లవ కార్యాచరణను మరింత చురుగ్గా కొనసాగించి కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలయ్యారు. యువజన సంఘాలు నిర్మించడంలో కృషిచేశారు. నిండు గర్భిణిగా వున్న సమయంలోనూ ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. పదహారు రోజుల పసిగుడ్డును వదిలి జైలుకు వెళ్లారు. జైల్లోనూ పోరాటాలు చేపట్టారు. జైలు నుండి విడుదలైన వెంటనే, కనీసం ఇంట్లో అడుగు పెట్టకుండా ఆమె అజ్ఞాత జీవితంలోకి వెళ్లారు. కృష్ణా జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఏర్పడిన సాయుధ దళంలో పట్టుపట్టి చేరి, ఆ ప్రాంతంలో మొదటి మహిళా దళ సభ్యురాలిగా చరిత్ర పుటల్లో తన స్థానాన్ని సుస్థిరపరుచుకున్నారు. సాయుధ చర్యల్లో పాల్గొన్నారు. పోలీసులు చేసిన పలు దాడుల నుండి చాకచక్యంగా తప్పుకున్నారు. ఆ క్రమంలో భర్త అమరుడైనప్పటికీ ఉద్యమంలో దృఢంగా నిలబడ్డారు. సాయుధ పోరాట విరమణ జరిగిన తర్వాత మహిళా సంఘ నిర్మాణంలో చురుకైన పాత్ర వహించారు. సీపీఐలో జరిగిన అంతర్గత పోరాటం ఫలితంగా సీపీఎం ఏర్పడినపుడు ఆమె సీపీఎం పక్షం వహించారు. భర్త చనిపోయిన కొంత కాలానికి కామ్రేడ్ అనసూయమ్మ కొండపల్లి సీతారామయ్యను జీవిత భాగస్వామిగా ఎన్నుకొన్నారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల కారణంగా క్రియాశీల రాజకీయాలకు కొంత కాలం దూరమయ్యారు. రివిజనిస్టు రాజకీయాలను, పార్లమెంటరీ పంథాను తిప్పికొడుతూ భారత విప్లవానికి సరైన మార్గ నిర్దేశం చేస్తూ సీపీఐ (ఎం-ఎల్), ఆ తర్వాత 80లో కొండపల్లి సీతారామయ్య నేతృత్వంలో సీపీఐ (ఎం-ఎల్) (పీపుల్స్‌వార్) ఏర్పడడంతో ఆ రాజకీయాలు ఆమెకూ పరిచయం అయ్యాయి. పీపుల్స్‌వార్ పార్టీ ఆచరణను శ్రద్ధగా అధ్యయనం చేసిన కామ్రేడ్ అనసూయమ్మ తిరిగి 84 నుండి సీపీఐ (ఎం-ఎల్) (పీపుల్స్‌వార్) నేతృత్వంలోని రైతుకూలీ సంఘంలో క్రియాశీలంగా పని చేయడం ప్రారంభించారు. ఐలూరు, గురువింద పల్లి, పెదవేంగి ప్రాంతాల్లో జరిగిన భూస్వామ్య వ్యతిరేక పోరాటాలకు నాయకత్వం వహించారు. క్రమంగా క్రిష్ణా జిల్లా రైతు కూలీ సంఘం అధ్యక్షురాలిగా, రాష్ట్ర రైతుకూలీ సంఘం ఉపాధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టి పనిచేశారు.

కొండపల్లి సీతారామయ్య పార్టీలో సంక్షోభం సృష్టించిన సమయంలో ఆమె ఆయన వైఖరిని తీవ్రంగా ఖండించి విప్లవకర మెజారిటీ పక్షం వహించి తన వ్యక్తిత్వాన్ని ప్రదర్శించుకున్నారు. ఆ తర్వాత క్యాన్సర్ బారినపడిన కూతురుకు అండగా వుండడం కోసం ఆమె అమెరికా వెళ్లారు. అలా క్రియాశీల రాజకీయాల నుండి నిష్క్రమించినప్పటికీ, విప్లవోద్యమాన్ని నిరంతరం నిశితంగా పరిశీలిస్తూనే వచ్చారు. విప్లవోద్యమానికి సహాయ సహకారాలు అందించారు. ఎందరో విప్లవకారులకు అమ్మగా ఆప్యాయతను పంచారు. 2003లో మహిళామార్గం అనే పత్రికకు ఆమె ఇచ్చిన ఇంటర్వ్యూలో ఏనాటికైనా మన దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతమవుతుందనీ, ఆ నమ్మకమే తనను ప్రస్తుతం బతికిస్తోందని చెప్పిన మాటలు విప్లవ విజయం పట్ల దృఢ విశ్వాసాన్ని చాటుతాయి. 2006లో ఏఓబీ మహిళా అమరుల జీవిత చరిత్ర పుస్తకానికి ఆమె రాసిన ముందు మాటలోనూ ఇదే విశ్వాసాన్ని ఆమె వ్యక్తం చేశారు. ఈ విధంగా విప్లవోద్యమంలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ సంభవించిన అనేక ఒడిదొడుకులను నిబ్బరంగా ఎదుర్కొని చివరి ఊపిరి వరకూ విప్లవ రాజకీయాలను ఎత్తిపట్టిన కామ్రేడ్ అనసూయమ్మకు 'ప్రజా విముక్తి' వినమ్రంగా నివాళి అర్పిస్తున్నది. ★

---

**(9వ పేజీ తరువాయి)**

ప్రజానికాన్ని విడిచి తను నమ్మిన విప్లవ లక్ష్య సాధన కోసం అమరురాలు కావడమనేది విప్లవ ప్రజానీకానికి దిగమింగుకోలేని దుఃఖమే. ఆ పోరులో గాయపడ్డ కా. దేవెను పోలీసు మృగాలు చిత్రహింసలు పెట్టి హత్యచేశారు. తనలోని వర్గకసే కా. దేవెను అమరుల వారసత్వాల సరసన నిలిపింది.

కా. దేవె శవాన్ని భద్రాచలం నుండి తెచ్చుకోవడానికి ప్రజలందరూ ముఖ్యంగా మహిళలందరూ వీరోచితంగా పోరాడారు. తమ ఊరి, ఆ ప్రాంతపు పోరాట వారసత్వాన్ని తన అమరత్వంతో ఎత్తిపట్టిన కా. దేవె శవాన్ని వేలాది విప్లవ ప్రజానీకం దుఃఖ సముద్రంలోనే విప్లవ ఒరవడిలో అంత్యక్రియలు నిర్వహించారు. కా. దేవె ఆశయాలను నెరవేరుస్తామని శపథం చేసారు. ★

# హెచ్.సీ.యు. పరిశోధక విద్యార్థి ఉదయ్‌భానుపై పోలీసులు, హిందూ మతోన్మాదుల హత్యాయత్నాన్ని ఖండించండి!

కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో కే.సీ.ఆర్. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి హిందూ మతోన్మాద భావజాలాన్ని విపరీతంగా ప్రోత్సహిస్తూ ప్రజల సమస్యలను పక్కదారి పట్టిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా విద్యా సంస్థలకు, పరిశోధనా సంస్థలకు హిందూమత భావజాలం కలిగిన వారిని అధిపతులుగా నియమిస్తూ మొత్తం విద్యారంగాన్ని కాషాయికరిస్తున్నది. హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయంలో దళిత పరిశోధక విద్యార్థి రోహిత్ ఆత్మహత్య అనంతరం విద్యార్థుల తీవ్ర నిరసనలతో సెలవుపై వెళ్లిన వైస్ చాన్సలర్ అప్పారావు మార్చి 22న తిరిగి విధుల్లో చేరాడు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పోలీసుల సహకారంతో విద్యార్థులపై దారుణమైన అణచివేతను అమలు చేస్తున్నాడు. విద్యార్థులను బయటికి, బయటివారిని లోపలికి అనుమతించకుండా విశ్వ విద్యాలయాన్ని జైలులా మార్చి పోలీసుల పహారాలో పరిపాలిస్తున్నాడు.

వి.సి. పొదిలె అప్పారావు తను విధుల్లో చేరటాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలుపటానికి విద్యార్థులు వి.సి. గెస్ట్ హౌస్‌కు వస్తారని ముందే ఊహించి తన అనుచరులతో వీడియోలు, ఫోటోలు తీయించే ఏర్పాటు చేశాడు. విద్యార్థులు అక్కడకు వచ్చి నిరసన తెలుపుతున్నప్పుడు తన మనుషులే అద్దాలు, టీ.వీ.లు పగులగొట్టటం మొదలు పెట్టారు. తన మనుషులు అందించిన వీడియోలు, ఫోటోలు మీడియాలో విస్తృతంగా ప్రచారమైన మరుక్షణమే పోలీసులు దాడి చేయటం మొదలు పెట్టారు. అమ్మాయిల జుట్టు పట్టి ఈడ్చుకెళ్లటం, కడుపులో తన్నటం, బట్టలు చింపటం, అబ్బాయిల మర్మాంగాల మీద తన్నడం చేశారు. సుమారు 100 మందికి పైగా విద్యార్థుల్ని ఎత్తుకెళ్లిపోయారు. 22వ తేదీ మధ్యాహ్నం నుండి మెస్సులు, ప్రైవేట్ క్యాంటీనులను, హాస్టళ్లకు నీరు, విద్యుత్ సరఫరాలను బంద్ చేశారు. విద్యార్థులను ఆకలితో మాడ్చాలని కుట్ర పన్నారు. విద్యార్థులు గిన్నెలు, బియ్యం, కూరగాయలు, కట్టెలు సమకూర్చుకొని వంట మొదలు పెట్టటంతో పోలీసుల ప్రయత్నం విఫలమైంది. దాంతో పోలీసులు వంట చేసుకుంటున్న విద్యార్థుల వద్దకు వచ్చి అక్కడున్నవాళ్లను తోసేసి దళిత పరిశోధక విద్యార్థి ఉదయ్‌భానును కొట్టుకుంటూ పోలీసు మినీ బస్సులోకి తీసుకుపోయి చిత్రహింసలు పెట్టి వదిలి వేసిన తర్వాత ఒక పోలీసు అధికారి 'నిన్ను చంపేస్తా' అని హెచ్చరించాడు.

ఉదయ్‌భాను వివిధ సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలపై సభలు, సమావేశాలను నిర్వహించి ప్రత్యామ్నాయ భావజాల వ్యాప్తికి కృషి చేశాడు. విద్యార్థులను ఆర్గనైజ్ చేసి నిర్మాణాత్మక పోరాటాలు నిర్వహించటమే కాకుండా స్పష్టమైన సైద్ధాంతిక, రాజకీయ దృక్పథాన్ని కలిగి ఉన్నాడు. రోహిత్ కుటుంబానికి అండగా ఉన్నాడు. కవితలు, వ్యాసాలు, పాటలు రాస్తూ, ప్రత్యామ్నాయ రాజకీయాలను ప్రచారం చేస్తున్నాడు. అందువల్ల విశ్వ విద్యాలయ అధికారులకు, హిందూ మతోన్మాదులకు, రాజ్యానికి, పోలీసులకు లక్ష్యంగా మారాడు. ఇది స్పష్టంగా హిందూత్వ హత్యాయత్నమే. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఐక్యమై హిందూ మతోన్మాద శక్తులను ప్రతిఘటించాలి.

**(35వ పేజీ తరువాయి)**

చట్టం రాజ్యాంగ బద్ధమైనదేనని తీర్పు చెప్పి తన అప్రజాస్వామిక వైఖరిని చాటుకుంది.

ఈ చట్టాన్ని నక్సలైట్ వ్యతిరేక ఆపరేషన్స్‌లో భాగమయ్యే సాయుధ బలగాలకు కూడా వర్తింపజేయాలని సీఆర్‌పీఎఫ్ అధికారులు కోరుతున్నారు. ప్రస్తుతం దండకారణ్యంలో వైమానిక దాడులు చేయడానికి ప్రభుత్వం తయారవుతున్నది. ఇప్పటికి రెండు చోట్ల డ్రిల్స్ కూడా నిర్వహించారు. ప్రభుత్వం ఎక్కడ సైన్యాన్ని దింపినా ఇటువంటి చట్టాన్ని తోడిచ్చే పంపుతుంది. కనుక ఈ చట్ట ప్రమాదం ఇక్కడ కూడా పొంచి వుంది. సాయుధ బలగాలకు ప్రత్యేక అధికారాల వంటి చట్టాలు లేకుండానే, ఛత్తీస్‌గఢ్ స్పెషల్ పబ్లిక్ సెక్యూరిటీ ఆక్ట్ 2005 వంటి వాటి ద్వారా ప్రజలపై నిర్బంధం ఎంత బీభత్స స్థాయిలో కొనసాగుతున్నదో మీడియాను ఎంత తొక్కిపెట్టినా కొన్నైనా వాస్తవాలు బయటకు వస్తూనే వున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో పోలీసు రాజ్యం ఎట్లా కొనసాగుతున్నదో ఇటీవల బీబీసీ మాధ్యమం ద్వారా బస్తర్ ఐజీ కల్లూరి అందరికీ అర్థం చేయించాడు. ఇక యిటువంటి చట్టం కూడా తోడయితే పరిస్థితి ఊహించలేనంత భయంకరంగా వుంటుందనడంలో సందేహం లేదు.

కనుక ఇటువంటి చట్టాలకు వ్యతిరేకంగా మిలిటెంట్ పోరాటం చెయ్యాల్సి వుంటుంది. చట్టాలేవైనా ప్రస్తుత వ్యవస్థను పరిరక్షించడానికే రూపొందించబడుతాయి. వ్యవస్థ మరింత క్రూరత్వాన్ని సంతరించుకుంటున్న కొద్దీ చట్టాలకు కోరలు పెరుగుతూ వుంటాయి. కనుక క్రూర చట్టాలకు వ్యతిరేకంగా చేసే పోరాటం క్రూర సమాజానికి వ్యతిరేకంగా చేసే పోరాటమే అవుతుంది. ★

# నరేంద్రమోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించండి!

# తెలంగాణలో మూసివేసిన పరిశ్రమల పునరుద్ధరణకై పోరాడండి!

# సింగరేణిలో వారసత్వ ఉద్యోగ హక్కు కోసం ఉద్యమించండి!

ప్రపంచ ఆర్థిక సంక్షోభం పర్యవసానంగా మన దేశ ఆర్థిక వ్యవస్థలో అలుముకున్న మాంద్య పరిస్థితి నేపథ్యంలో సంక్షోభ భారాన్నంతటినీ కార్మికుల భుజాలపై వేసి లే ఆఫ్‌లు, షట్‌డౌన్‌లు, మూసివేతలు కొనసాగిస్తున్నారు. అయితే ఇందులో ఎక్కువశాతం అధికారికంగా ఎక్కడా రికార్డుల్లో కనిపించవు. 2014 డిశంబర్ నాటి అధికారిక నివేదిక ప్రకారం దేశంలో రిజిస్టర్ అయిన 13.70 లక్షల కంపెనీలలో 20 శాతం మూతపడ్డాయి. మూతపడిన అనేక భారీ, మధ్య తరహా పరిశ్రమలలో అత్యధిక భాగం చట్ట వ్యతిరేకంగా మూతపడినవే. ఇందులో హర్యానాలోని మారుతి సుజుకీ, తమిళనాడులోని నోకియా, ఫాన్స్‌కాన్ వంటి బహుళజాతి సంస్థలు, పెస్సోప్, హిందూ మోటార్స్, నిజాం షుగర్ ఫ్యాక్టరీ, జనపనార మిల్లులు, తేయాకు తోటలు ఉన్నాయి. అయినా ఎవరిపైన ప్రభుత్వం చర్య తీసుకోలేదు. తెలంగాణలోని సిర్పూర్ పేపర్ మిల్లు, వరంగల్‌లోని అజంజాహి మిల్లు, కమలాపూర్ పేపర్ మిల్లు (బిల్ట్), రామగుండం ఎరువుల కర్మాగారం మూతపడ్డాయి. అనేక మంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. సిరిసిల్లా చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. సింగరేణిలో తొలగించడబడిన కార్మికులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. వేలాది కుటుంబాలు రోడ్ల మీదికి వచ్చాయి. లక్షలాది మంది కార్మికులకు వుపాధి లేకుండా పోయింది. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సోయిలేదు.

1991 నుండి మొదలైన నూతన ఆర్థిక విధానాల మూలంగా కేంద్ర ప్రభుత్వాలు (యు.పి.ఏ., ఎన్.డి.ఏ.) అమలు చేస్తున్న ఫలితంగా 1982-83లో 30 శాతం కార్మికుల వేతనాల వాటా పడిపోగా 2012-13 వచ్చే నాటికి 22.9 శాతానికి పడిపోయింది. ఏకకాలంలో యజమానుల లాభాల వాటా 50 శాతానికి పెరిగింది.

శ్రమ ఉత్పాదకత నిరంతరం పెరుగుతున్నప్పటికీ వేతనాల వాటా పడిపోతూనే ఉంది. నరేంద్రమోడీ ప్రభుత్వం మాత్రం వేతనానికి సంబంధించి వివక్షతను మరింత తీవ్రతరం చేసింది. ఫ్యాక్టరీలలో పని చేస్తున్న కార్మికులలో 80 శాతం మంది, సేవా రంగంలో పని చేస్తున్న వారిలో 90 శాతం మంది ఈ చట్ట సవరణ కారణంగా పూర్తిగా యజమానుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బతకాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాత చట్టంలో 14-21 రోజుల ముందు సమ్మె నోటీసు ఇస్తే సరిపోతుంది. కానీ కొత్త చట్టంలో 6 వారాల ముందు సమ్మె నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా చాలా విషయాలకు సంబంధించి వివాదాస్పదమైన కార్మిక వ్యతిరేకమైన మార్పులను మోడీ ప్రభుత్వం తీసుకవచ్చింది. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలన్నీ ఒక్కటయి టోకెన్ సమ్మెను (సెప్టెంబర్ 2, 2015) విజయవంతం చేసాయి. "మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియా" నినాదాలతో విదేశీ పెట్టుబడిదారుల కోసం ఎర్ర తివాచీలు పరిచి వారి ముందు బీ.జే.పీ. ప్రభుత్వం మోకరిల్లుతున్నదని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. అభివృద్ధి, మార్పు, ఉపాధి కల్పన, అవినీతి రహిత పాలన అంటూ అధికారంలోకి వచ్చిన ఎన్.డీ.ఏ. చేసిందేమీ లేదని, కార్మికులను యథేచ్ఛగా దోపిడీ చేసేందుకు బడా కార్పొరేట్లకు మరింత సంపద చేకూర్చేందుకు ప్రభుత్వ విధానాలు దోహదపడుతున్నాయని బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, రక్షణ, రైల్వే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలన్నీ ఈ సమ్మెకు పిలుపునిచ్చాయి.

ప్రభుత్వ, ప్రైవేటు రంగాలన్నింటిలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానమే విచ్చలవిడిగా పెరిగిపోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లలో సామాజిక సంక్షేమ పథకాలకు నిధుల కేటాయింపులలో కోతపెడుతున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థల్లోని వాటాలను ప్రైవేటు వారికి కారుచౌకగా అమ్ముతున్నది. రక్షణ, రైల్వే, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ రంగాలన్నింటిలోకి ఎఫ్.డీ.ఐ.లకు తలుపులు బార్లా తెరిచింది. దేశంలో ఉన్న బొగ్గు బ్లాకులను ప్రైవేటు వారికి అమ్ముతున్నారు. విదేశీ, స్వదేశీ కార్పొరేట్ సంస్థలు దేశ సహజ వనరులను లూటీ చేసేందుకు వీలుగా చట్టాలలో మార్పు చేస్తున్నది. నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించి అదుపులో పెట్టాలని, కనీస వేతనం నెలకు 15 వేలుగా నిర్ణయించాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి వారిని రెగ్యులరైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ట్రేడ్ యూనియన్‌లు డిమాండ్ చేస్తున్నాయి. అసంఘటిత రంగం, వ్యవసాయ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని, కార్మిక చట్టాల సవరణను ఆపాలని, వాటిని పకడ్బందీగా అమలు చేయాలని, కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా తెచ్చిన భూసేకరణ ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలని, పీ.ఎఫ్., ఇ.ఎస్.ఐ., బోనస్ చట్టాలు విధిగా అమలు చేయలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు 1998 జూన్ 6వ తేదీ నుండి నిలిచిపోయాయి. అప్పటి నుంచి పోరాటాలు కొనసాగుతూనే ఉన్నాయి. గుర్తింపు సంఘం టీ.జీ.బీ.కె.ఎస్. సైతం ఇదే హామీ ఇవ్వడంతో కార్మికులు ఈ సంఘాన్ని గెలిపించారు. మూడు సంవత్సరాలు గడిచినా గాని వారు సాధించింది శూన్యం. ఎన్నికల ముందు ఊరించి, ఓట్లేపించుకున్న టీ.ఆర్.ఎస్. కార్మిక సంఘాలు అధికారంలోకి వచ్చిన

తర్వాత మొండి చేయి చూపిస్తున్నారు.

వారసత్వ ఉద్యోగ హక్కుకై ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన కే.సీ.ఆర్. సైతం పట్టించుకోకపోవడంతో కార్మికులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఎలాగైనా వారసత్వ హక్కు సాధించాలనే పట్టుదలతో కార్మికుల పిల్లలు పోరాడుతున్నారు.

**"కాంట్రాక్టు" జీవితాల కష్టాలు తీరేనా:** తెలంగాణలో అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిలో కాంట్రాక్టు కార్మిక వ్యవస్థ రోజురోజుకు పెరుగుతున్నది. వారికి కనీస వేతనాలు, సౌకర్యాలు లేకుండా తీవ్ర శ్రమ దోపిడీకి గురవుతున్నారు. మౌలిక సదుపాయాల కోసం సమ్మెలు చేసినా యాజమాన్యం, ప్రభుత్వం నుంచి స్పందన వుండడం లేదు.

సింగరేణి సంస్థలో 1990 అనంతరం ఆర్థిక, పారిశ్రామిక యాంత్రీకరణ, సంస్కరణల నేపథ్యంలో నూతన రిక్రూట్‌మెంట్ నిలిపివేసి కాంట్రాక్టు కార్మికులకే అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. దీనితో ప్రస్తుతం సంస్థలలో రెగ్యులర్ కార్మికులు 59 వేల మంది ఉండగా సుమారు 25 వేల మందికి పైగా కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారు. గతంలో సర్ఫేస్‌కు మాత్రమే పరిమితమైన కాంట్రాక్టు కార్మికులు ప్రస్తుతం భూగర్భ గనుల్లోను రెగ్యులర్ కార్మికులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారు. మొత్తం 16 రకాల కాంట్రాక్టు కార్మికులు సంస్థలో పని చేస్తున్నారు.

భూగర్భ గనుల్లోని లాంగ్‌వాల్, ఎల్.హెచ్.డీ., కంటీన్యూయస్ మైనర్ వంటి యంత్రాల వద్ద విధులు నిర్వహిస్తున్నారు. కాంట్రాక్టు కార్మికులకు దేశవ్యాప్తంగా అమలవుతున్న వేజ్‌బోర్డు నిర్ణయాలు సైతం ఇక్కడ సక్రమంగా అమలు కాకపోవడంతో సమ్మెకు దిగినారు. ఇటీవల జే.బీ.సీ.సీ.ఐ.లో తీసుకున్న నిర్ణయం ప్రకారం స్కిల్డ్ కార్మికులకు 554 రూపాయలు ఇవ్వాల్సి ఉండగా కేవలం 329 రూపాయలు మాత్రమే ఇస్తున్నారు. సెమీ స్కిల్డ్ కార్మికులకు 464 రూపాయలకు బదులు 248 రూ॥లు మాత్రమే ఇస్తున్నారు. భూగర్భ గనుల్లో పనిచేస్తున్న కార్మికులకు మరో 10 శాతం అదనంగా వేతనం అందుతుంది. దీంతో కాంట్రాక్టు కార్మికులు తీవ్రంగా శ్రమ దోపిడీకి గురవుతున్నారు. ఇతర సౌకర్యాలు లభించడం లేదు.

**సింగరేణి కార్మికులకు సలామ్:** సింగరేణిలో చిందే స్వేదం శ్రామిక జన జీవన చైతన్యానికి సుగంధ పరిమళం. శ్రమ జీవులు ఐలెస్సా, ఐలెస్సా అంటూ పాటలు పాడుకుంటూ పనులు చేస్తుంటారు. సింగరేణి తల్లిని నమ్ముకుని ప్రాణాలకు తెగించి భూమి లోతుల్లోకి వెళ్లి శ్రామికులు చేసే సాహసం దేశానికి గర్వకారణం. 'సింగరేణి దండాలు" అంటూ కార్మికులు నల్ల బంగారం వేట మొదలు పెడతారు. బొగ్గు ఉత్పత్తితో పారిశ్రామిక అభివృద్ధికి బాటలు వేస్తున్నారు.

తెలంగాణకే తల మానికం సింగరేణి సంస్థ. సింగరేణిలో హక్కుల రక్షణ కొరకు పోరాడిన అమర వీరుల చరిత్ర ఉంది. నల్లా ఆదిరెడ్డి,గజ్జెల గంగారాం, మాదిరెడ్డి సమ్మిరెడ్డి, కట్ల మల్లేష్, గెల్లి రాజలింగ్, జిలానీ బేగం, జంజుపల్లి శ్రీధర్, తోట రాములు లాంటి కామ్రేడ్స్ ఎందరో రక్త తర్పణం చేశారు. 125 ఏండ్ల చరిత్ర ఉన్న సింగరేణి సంస్థలో కార్మికుల శ్రమ వెలకట్టలేనిది. నిత్యం వారు చేసే వృత్తి ప్రాణాంతకమని తెలిసినా ఏ మాత్రం లెక్క చేయకుండా భూగర్భ గనుల్లో బొగ్గును వెలికితీస్తూ మన ఇళ్లల్లో వెలుగులు నింపుతున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కూడా సింగరేణి కార్మికుల పాత్ర మరువలేనిది. సింగరేణి గని ప్రమాదాల్లో 14 సంవత్సరాల్లో 102 మంది కార్మికులు మృతి చెందినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఏప్రిల్ 2016లో మందమర్రిలో ప్రమాదం జరిగి ముగ్గురు కార్మికులు మరణించారు.

**గ్యారంటీ లేని బతుకులు:** సింగరేణి కార్మికులు అనేక ప్రమాదాలను ఎదుర్కొంటూ, విధులు నిర్వహిస్తూ బొగ్గును వెలికితీస్తారు. బొగ్గును వెలికి తీస్తున్న క్రమంలో బొగ్గు పెళ్లలు మీద పడినా, బొగ్గు గనుల గోడలు కూలినా, విషవాయువులు ఉత్పత్తి అయినా, గనుల నుంచి నీరు ఉబికి వచ్చినా పని చేస్తున్న కార్మికులు సమాధి కావల్సిందే. ఆక్సీజన్ అందకపోయినా అస్వస్థతకు గురై ప్రాణాల మీదకు వస్తుంది. గనుల నుంచి బొగ్గును టబ్బుల ద్వారా భూమి పైకి పంపిస్తున్న క్రమంలో తాడు తెగి టబ్బులు మీద పడినా మృత్యువాత పడాల్సిందే. ఇలా జరిగిన సంఘటనలు సింగరేణి చరిత్రలో ఎన్నో ఉన్నాయి. ఇంత ప్రమాదకర పరిస్థితుల్లో గనులనుండి బొగ్గును తోడేందుకు కార్మికులు చేస్తున్న సాహసం దేశ సైనికులు సరిహద్దుల్లో శత్రువులతో చేస్తున్న పోరాటానికి తక్కువేమి కాదు. బొగ్గు బాయికి వెళ్లిన కార్మికులు ఇంటికి తిరిగి వస్తారో రారోననే బెంగ ప్రతి కుటుంబంలోనూ నిత్యం ఉంటుంది. గ్యారంటీ లేని బతుకులతో ఏ రోజుకారోజు జీవనం సాగించాల్సిన దుస్థితి సింగరేణి కార్మికులది.

**వేలల్లో వేతనం-లక్షల అప్పుల్లో జీవనం**: సింగరేణి కార్మికులంటే వేలల్లో వేతనం, దర్జాగా బతుకులు అనుకుంటాం. కానీ, ఓ సింగరేణి కార్మికుడికి నెలకు 40 వేల రూపాయల వేతనం వస్తే అందులో కార్మికులకు కటింగులే ఎక్కువ. ప్రభుత్వం సింగరేణి కార్మికులకు 10 శాతం ఆదాయపు పన్ను కోత పెడుతుంది. దీనికి తోడు సీ.ఎం.పీ.ఎఫ్. పించన్ కోసం 12 శాతం వేతనంలో కోత విధిస్తున్నారు. ఈ రకంగా ప్రభుత్వానికే తిరిగి 22 శాతం పోతుంది.

నెలలో 30 రోజులకు గాను 4 ఆదివారాలు పనికి సెలవు. ఈ దినాలకు యాజమాన్యం వేతనం కూడ ఇవ్వరు. భూగర్భ గనుల్లో పనులు చేయడం వల్ల ఆరోగ్యం దెబ్బతిని (సహకరించక) సింగరేణి కార్మికులకు నెలలో 4, 5 రోజులు విశ్రాంతి కోసం విధులకు వెళ్లలేరు. పిల్లల చదువు కోసం, పెళ్లిల్లకోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంటుంది. సింగరేణి సంస్థ క్వార్టర్లు ఏర్పాటు సరిగ్గా లేకపోవడంతో ఇండ్లు నిర్మించుకుంటే అదనపు ఖర్చులు అవుతున్నాయి. వీటి కోసం ప్రైవేట్ ఫైనాన్స్‌ల చుట్టు తిరుగుతూ సింగరేణి కార్మికులు అప్పులు

**(మిగతాది 40వ పేజీలో)**

# రైతుల ఆత్మహత్యలు ప్రపంచ వాణిజ్య సంస్థ, పాలక వర్గాల హత్యలే

దేశం, రాష్ట్రంలోను ఉపాధి కల్పనా రంగంగా ఉన్న వ్యవసాయ రంగంలో నేడు తీవ్ర సంక్షోభ పరిస్థితులు ఏర్పడి, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. రాజకీయ పార్టీలు, కూటములు ఏవి అధికారంలో ఉన్నప్పటికి 1991 నుండి ప్రపంచీకరణ విధానాలను అందులో భాగంగా ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందాలను వేగంగా అమలు చేస్తు వస్తున్నాయి. దీంతో పాటు రైతుల ఆత్మహత్యలు పెరుగుతూ వస్తున్నాయి. జాతీయ నేర పరిశోధన బ్యూరో (ఎన్.సి.ఆర్.బి.)అంచనా ప్రకారం 1995-2004 మధ్య మూడు లక్షలకు పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న రాష్ట్రాలలో మహరాష్ట్ర (విదర్భ) మొదటి స్థానంలో ఉండగా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు రెండవ స్థానంలో ఉన్నాయి. మధ్యప్రదేశ్, కర్ణాటక, చత్తీస్‌గడ్ రాష్ట్రాలలో కూడా రైతుల ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రజాస్వామిక ఆకాంక్షలతో పోరాడి సాధించుకున్న పరిమితులతో కూడిన, భౌగోళిక తెలంగాణాలో చంద్రశేఖర్‌రావు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలో సుమారు 2 వేలకు పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు.

గతంలో స్థానిక దుర్భిక్ష పరిస్థితులు, తీవ్రమైన రుణగ్రస్తత, వ్యక్తిగత సమస్యల వల్ల రైతుల ఆత్మహత్యలు జరిగేవి కానీ, విధానపరమైన, వ్యవస్థాగతపరమైన కారణాలతో మూకుమ్మడి ఆత్మహత్యలు జరిగే పరిస్థితులు ప్రపంచీకరణ విధానాలు అమలు చేయడం మొదలైన తర్వాతనే ఏర్పడ్డాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందాలు అమలు మొదలైన తర్వాత నీటి పారుదల సౌకర్యాలు కల్పించటం, పంట రుణాలను మాఫీ చేయటం, రైతులకు రాయితీలు(ఎరువుల,పురుగుమందులు, విత్తనాలు, విద్యుత్) తగ్గించటం తదితర రూపాలలో ఉండే వ్యవసాయరంగంలోని ప్రభుత్వ పెట్టుబడిని గణనీయయంగా తగ్గించారు. దిగుమతులలో పరిమాణాత్మక ఆంక్షలను ఎత్తివేశారు. భారీ కమతాలతో చేసే అమెరికా తరహా కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించారు. సేంద్రీయ ఎరువుల స్థానంలో రసాయనిక ఎరువులను ప్రవేశ పెట్టారు. సామ్రాజ్యవాద అనుకూల పారిశ్రామిక విధానాల వల్ల పర్యావరణం కాలుష్యమవటంతో జీవ నియంత్రణ దెబ్బతిని పురుగు మందుల వాడకం విపరీతంగా పెరిగింది. రైతులు తమ పాత పంట నుండే విత్తనాలను వాడుకునే స్థితి నుండి పూర్తిగా బహుళజాతి సంస్థల సంకర విత్తనాలపై ఆధారపడేటట్లు చేశారు. భారీ యంత్రాలను ప్రవేశపెట్టారు. బీమా సౌకర్యాన్ని అమలు చేయటం లేదు. గిట్టుబాటు ధరలు కల్పించటం లేదు. రైతాంగాన్ని ఆహార పంటలు పండించే స్థితి నుండి వాణిజ్య పంటలు పండించేట్లు చేశారు. బ్యాంకు ద్వారా రుణాలు అందించకుండా, ప్రైవేటు వడ్డీ వ్యాపారులు, వ్యాపారులపై ఆధారపడే విధంగా చేశారు.

తెలంగాణలో నీటిపారుదల సౌకర్యాలు కల్పించటంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వివక్షపూరితంగా తీవ్ర నిర్లక్ష్యం చేశారు. తెలంగాణాలో సాగునీటి ప్రాజెక్టుల నుండి నీరు అందుతున్న భూ విస్తీర్ణం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా ఎంత ఉందో, అంత మాత్రమే భూమి తెలంగాణా రాష్ట్రం మొత్తంలో ప్రాజెక్టుల కింద ఉంది. ఇప్పటికీ కాకతీయుల కాలం నాటి చెరువుల పైననే ఆధారపడి వ్యవసాయ చేస్తున్నారు. కృష్ణ, గోదావరి వంటి జీవ నదులు ప్రవహిస్తున్నా భూగర్భ జలాలపైననే ఆధారపడుతున్నారు. సాగునీటి సౌకర్యం గల భూమిలో 63 శాతం బోరు బావుల కిందనే ఉంది. దాదాపు 16 లక్షల విద్యుత్తు మోటర్లు ఉన్నాయి. ఒక్కో బోరు బావికి లక్ష రూపాయాలపైగా ఖర్చు అవుతున్నది. ఉచిత విద్యుత్ ఇస్తున్నప్పటికీ, రైతులకు అవసరమైన సమయంలో విద్యుత్తు కోతలు విధించటం, లోవోల్టెజి విద్యుత్ సరఫరాతో పంటలకు నీరు అందించలేక దిగుబడి తగ్గుతున్నది. లోవోల్టేజి విద్యుత్తు సరఫరాతో మోటార్లు, స్టార్టర్లు, కెపాసిటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుంటాయి. వాటిని రైతులే దూర ప్రాంతాలకు తీసుకెళ్ళి మరమ్మత్తులు చేసుకోవాల్సి ఉంటుంది. తగు సంఖ్యలో లైన్‌మెన్‌లు ఉండరు. వీటితో రైతులపై అధనపు భారం పడుతున్నది.

అమెరికా వంటి పారిశ్రామిక దేశాలలో మూడు శాతం జనాభా మాత్రమే వ్యవసాయంపై ఆధారపడి ఉంది. భారీ కమతాలలో కార్పొరేటు వ్యవసాయం చేస్తారు. మన దేశంలో సుమారు 65 శాతం ప్రజలు వ్యవసాయపై ఆధారపడుతున్నారు. ఇందులో 86 శాతం చిన్న,సన్నకారు రైతులే ఉన్నారు. వీరి సాగు విస్తీర్ణం ఒక హెక్టారు లోపు ఉంటుంది. తెలంగాణలో 55.7 శాతం మంది ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. మొత్తం 31.7 లక్షల మంది రైతులు ఉంటే అందులో 15 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. కౌలు రైతులలో 58 వేల మందికి మాత్రమే ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇచ్చింది. ఇటువంటి పరిస్థితులలో ప్రపంచ వాణిజ్య సంస్థ సంపన్న దేశాలకు ప్రయోజనకరంగానూ, పేద, వర్ధమాన దేశాలకు నష్టదాయకంగాను నిబంధనలు రూపొందించింది. భూమిని బీడుపెడితే చేసే చెల్లింపులు, వ్యవసాయ పరిశోధనలు, అభివృద్ధి కోసం ఖర్చులు, బీమా చెల్లింపులు వంటి వాటిని పచ్చ డబ్బా (గ్రీన్ బాక్స్) ఒప్పందం కిందకు తీసుకు వచ్చి రాయితీలుగా పరిగణించటం లేదు. అభివృద్ధి చెందిన దేశాలు వ్యవసాయ రంగానికి అత్యధికంగా రాయితీలు ఇస్తున్నారు. రాయితీలే కాకుండా ఎరువులు, ఇంధనం అతి చవకగా పొందుతున్నారు. యూరపులో భూములు బీడు పెట్టినందుకు చెల్లింపులు చేస్తున్నారు. అమెరికాలో వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రతి హెక్టారుకు 500 డాలర్ల చొప్పున రైతులకు ప్రతి సంవత్సరం సబ్సిడీ యిస్తున్నారు. దీనిని రాయితీగా పరిగణించటం లేదు. మన దేశంలో ఎకరాల ప్రాతిపదికన వ్యవసాయం చేస్తున్న ప్రతి రైతుకు సబ్సిడీ ఇవ్వాలని ఏ ప్రభుత్వము ఆలోచించలేదు. అమెరికాలో రైతులు సంస్థాగత రుణాలు పొందుతున్నారు. అభివృద్ధి చెందిన దేశాలు

38-95 శాతం వరకు రాయితీలు కల్పిస్తున్నారు. మన దేశంలో 3 శాతం మాత్రమే రాయితీలు ఇస్తున్నారు. మన రైతాంగం 86 శాతం చిన్న, సన్నకారు రైతులు కావటం, అందులో సగం వరకు కౌలు రైతులు కావటం వల్ల బ్యాంకుల ద్వారా రుణాలు పొందలేక పోతున్నారు. బ్యాంకులు వ్యవసాయానికి ఇచ్చే రుణాలను బాగా తగ్గిస్తున్నాయి. దీంతో రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులు, వ్యాపారుల వద్ద అత్యధిక వడ్డీలకు అప్పులు తీసుకుని తీవ్రంగా నష్టపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించినా ఒకేసారి మాఫీ చేయటంలేదు. విడతల వారిగా 25 శాతం చొప్పున మాఫీ చేయటంతో వడ్డీ, చక్రవడ్డీల కింద బ్యాంకులే జమ చేసుకోవటంతో రైతులకు ప్రయోజనం లేకుండా పోతున్నది.

దిగుమతులలో పరిమాణాత్మక ఆంక్షల రద్దు వల్ల ఏ దేశమైన ఎగుమతులు చేసుకోవచ్చు. మనకు అవసరమున్నా, లేకున్నా విధిగా మన ఆహార ఉత్పత్తిలో 5 శాతం ఇతర దేశాల నుండి ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకోవాలి. ప్రపంచ వాణిజ్య సంస్థ షరతుల ప్రకారం మన దేశంలో దిగుమతి సుంకాలను 250 శాతం నుండి 15 శాతానికి తగ్గించారు. పశ్చిమ దేశాల దిగుమతి సుంకాలు చాలా ఎక్కువగానే ఉన్నాయి.

విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాల రంగాలలో విదేశీ కంపెనీల వాటా 85 శాతం పైగా ఉంది. విత్తనాల రంగంలో మోన్‌సాంటో బహుళజాతి సంస్థ అత్యధిక వాటాను కల్గి ఉంది. విత్తనాల కొరకు రైతులు పూర్తిగా ప్రైవేటు కంపెనీలు, బహుళజాతి కంపెనీలపైన ఆధారపడుతున్నారు. తెలంగాణలో 95 గ్రామీణ నియోజక వర్గాలలో ఒక్క గ్రామాన్ని విత్తన కంపెనీలు దత్తత తీసుకోవాలని, రైతులకు మేలు రకం సాగు పద్ధతులు నేర్పించాలని, 400 విత్తన కంపెనీలు రాష్ట్రంలో పెద్ద ఎత్తున విత్తనోత్పత్తి చేపట్టి ఇతర రాష్ట్రాలకు, దేశాలకు విత్తనాలను సరఫరా చేయాలని సెప్టెంబరులో విత్తన కంపెనీలతో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు చెప్పారు. దీంతో రైతాంగం మొత్తంగా విత్తన కంపెనీలపై ఆధారపడే విధంగా చేశారు. కేంద్ర ప్రభుత్వం 2010లో జన్యు మార్పిడి పంటలకు అనుమతి యిచ్చేందుకు ప్రయత్నించి, దేశ వ్యాప్తంగా తీవ్రమైన నిరసన రావడంతో వెనక్కి తగ్గింది. సుప్రీంకోర్టు కూడా జన్యు మార్పిడి పంటలను వ్యతిరేకించింది. జన్యు మార్పిడి పంటలు జీవ వైవిధ్యాన్ని నాశనం చేస్తాయి. జన్యు స్వచ్ఛతను కలుషితం చేస్తాయి. ఈ విత్తనాలను రైతాంగం ప్రతి యేటా కొనాల్సి ఉంటుంది. ఈ విత్తనాల పంటకు పునరుత్పత్తి సామర్థ్యం ఉండదు. జన్యు మార్పిడి పంటల ద్వారా నేల, నీరు, గాలి, పర్యావరణం కలుషితం అవుతాయి. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వ్యతిరేకించాయి. అందువల్ల ఈ ప్రక్రియ అప్పట్లో నిలిచి పోయింది. నరేంద్రమోడీ అధికారంలోకి రాగానే జన్యుమార్పిడి విధానానికి అనుమతి ప్రక్రియ తిరిగి ప్రారంభమైంది. కేంద్ర ప్రభుత్వం జాతీయ మెట్ట పంటల పరిశోధన సంస్థలకు జన్యుమార్పిడి పంటలను ప్రయోగాత్మకంగా సాగుచేయటానికి అనుమతిచ్చింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించాల్సింది పోయి, పరిశీలించటానికి కమిటీని వేసింది.

స్వామినాథన్ కమిటీ సూచించినట్లుగా రైతులకు వ్యవసాయ ఖర్చులపై 50 శాతం లాభం ఉండేలా కనీస మద్దతు ధరలను నిర్ణయించటం తమ వల్ల కాదని ప్రభుత్వం సొలిసిటర్ జనరల్ ఒక అఫిడవిట్‌లో సుప్రిం కోర్టుకు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలను సగటున 23.55 శాతం మేరకు పెంచాలన్న ఏడవ వేతన సంఘం నివేదికను ప్రభుత్వం ఆమోదించటంలో స్పష్టమైన వివక్ష కనిపిస్తున్నది. 47 లక్షల కేంద్ర ఉద్యోగులకు, 52 లక్షల పెన్షనర్లకు లబ్ధిని కల్గించే ఈ వేతన సవరణ ప్రభుత్వంపై రూ. లక్ష కోట్లకు పైగా ఆర్థిక భారాన్ని మోపుతుంది. అయితే అలాంటి పెంపుదలనే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రభుత్వరంగ సంస్థ ఉద్యోగులకు వర్తింపచేస్తే అప్పుడు వాస్తవంగా పడే భారం 3 లక్షల కోట్లకు తక్కువ ఉండదు. అధికారంలోకి వచ్చిన వెంటనే నరేంద్రమోడీ ప్రభుత్వం వరి, గోదుమ మద్దతు ధరలను స్వల్పంగా క్వింటాల్‌కు రూ.50 చొప్పున పెంచారు. అంటే దాదాపు 3.6 శాతం పెరిగింది. ఈ ఏడాది(2015-16) గోదుమ మద్దతు ధరను క్వింటాల్‌కు రూ.75 మేరకు పెంచారు. ఉద్యోగి కనీస వేతనం నెలకు 18,000 కాగా, సగటున నెలకు ఒక రైతు కుటుంబం రూ. 6,000 ఆదాయం మాత్రమే పొందగలుగుతున్నదని నేషనల్ శాంపుల్ సర్వే (2014)అంచనా వేసింది. అందులో రూ. 3078 వ్యవసాయం నుంచి కాగా, మిగతాది ఇతర పనుల నుంచి అనుబంధ ఆదాయంగా లభిస్తున్నది. ప్రతి ఐదేళ్ళకు ప్రభుత్వ ఉద్యోగుల కనీస వేతనాన్ని ఇంచుమించు 30 శాతం మేరకు పెంచుతున్నారని, 1986లో రూ. 750గా ఉన్న కనీస వేతనం ఏడవ వేతన సంఘం నివేదికను ఆమోదిస్తే 2016 జనవరి నాటికి రూ. 18,000 చేరుతుంది. అదే కొలబద్దతో గోదుమ కనీస మద్దతు ధరను కూడా పెంచితే 1985-'86లో క్వింటాల్‌కు రూ. 315గా ఉన్న మద్దతు ధర రూ. 7,505కు పెరిగి ఉండాల్సింది. కానీ 2015-16 కోతల సీజన్‌కు రైతులకు ఇస్తామనీ వాగ్దానం చేసిన గోదుమ మద్దతు ధర రూ. 1,525 మాత్రమే.

తెలంగాణ ప్రభుత్వం కేంద్రంపైన, కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వంపైన నెపం పెడుతూ పత్తి రైతుల సమస్యల పరిష్కారం చేయకపోవటంతో ప్రైవేటు పత్తి వ్యాపారులు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. నాణ్యత లేదనీ పత్తి ధరను ఇష్టం వచ్చినట్లు తగ్గిస్తున్నారు. ప్రైవేటు కాటన్ జిన్నింగ్, ప్రెస్సింగ్ మిల్లు యాజమాన్యాలతో ప్రభుత్వరంగ సంస్థ సిసిఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) అధికారులు మిలాఖతు అవుతూ పత్తిలో తగిన ప్రమాణాలు లేవనీ తిరస్కరిస్తున్నారు. సిసిఐ ఆ తిరస్కరించిన పత్తినే అతి తక్కువ ధరకు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేసి దాన్ని తిరిగి సిసిఐకి అమ్ముకుంటున్నారు. స్థానిక వ్యాపారులతో కాటన్ అధికారులు కుమ్మక్కై రైతులను ముంచుతున్నారు. మార్కెట్‌లోకి వచ్చిన పత్తిలో 10 శాతం

**(మిగతాది 43వ పేజీలో)**

# టీ.ఆర్.ఎస్. ప్రభుత్వం కుట్రతో, యాజమాన్యం లాభాపేక్షతో ఛిద్రం కానున్న సింగరేణి ప్రాంత ప్రజల బతుకులు

భారత దేశంలోనే మొట్ట మొదటి ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణికి నూట ఇరవై ఎనిమిది సంవత్సరాల చరిత్ర ఉంది. సింగరేణి లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించి విభిన్న సంస్కృతిని, సాంప్రదాయాలను బొగ్గు బావుల నుండి పుట్టించి నాలుగు జిల్లాల కోల్‌బెల్ట్ పట్టణాల నిర్మాణానికి భూమికను పోషించింది. సింగరేణి తెలంగాణ ప్రాంతానికి గుండెకాయ లాంటిది. ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలలోని గోదావరి తీరమంతా బొగ్గు నిక్షేపాలకు నిలయం.

సింగరేణి సంస్థ నూట ఇరవై ఎనిమిది సంవత్సరాలుగా అప్రతిహాతంగా (దేశానికి) తెలంగాణకు అవసరమైన విద్యుత్తుకు బొగ్గును ఉత్పత్తి చేస్తూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ దక్షిణ భారతదేశంలోని బొగ్గు ఆధారిత పరిశ్రమలకు కొంగు బంగారంగా నిలిచింది. సింగరేణి కార్మికులు తమ శ్రమ శక్తితో బొగ్గు బావులనుండి బొగ్గును వెలికితీసి వేల కోట్ల లాభాలను సృష్టిస్తున్నారు. సింగరేణి ప్రతి సంవత్సరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు 3 వేల కోట్ల రూపాయలను పన్నులు, డివిడెండ్లు, రాయల్టీల రూపేణ చెల్లిస్తుంది. ఇప్పటివరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి అభివృద్ధికి నయా పైసా కూడా ఖర్చు పెట్టలేదు. ఇంతటి ఘనమైన చరిత్ర కలిగిన సింగరేణిని యాజమాన్యం లాభార్జన ధ్యేయంగా, వ్యాపారమే పరమావధిగా సాంప్రదాయక బొగ్గు బావులను మూసివేసి ఓపెన్‌కాస్ట్ బావులు ద్వారా బొగ్గు తవ్వకాలను చేపట్టింది.

ప్రకృతి పర్యావరణం, పల్లెలు, పచ్చని పంట పొలాలను ధ్వంసం చేస్తూ, జన జీవనాన్ని, జీవరాసుల బతుకులను నాశనం చేసేందుకు ప్రభుత్వం నుండి సింగరేణి యజమాన్యం ఓపెన్‌కాస్ట్ బొగ్గు తవ్వకాలకు అనుమతి తీసుకున్నది. ఉమ్మడి రాష్ట్రంలో 1 లక్ష 20 వేల మంది కార్మికులు 70 వేలకు తగ్గితే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 50 వేలకు తగ్గిపోయారు. మరో రెండు సంవత్సరాలలో 20 వేల మంది కార్మికులను యజమాన్యం తీసివేయనుంది. ఇప్పటికే సింగరేణి ప్రాంతంలో నిరుద్యోగులు తీవ్రంగా పెరిగిపోయారు. వీటికి తోడుగా ఓపెన్‌కాస్ట్ ద్వారా బొగ్గు తవ్వకాలు కొనసాగిస్తే మరింత మంది నిరుద్యోగులుగా మారి కోల్‌బెల్ట్ ప్రాంతంలో యువతరం జీవితాలు ఆగమాగమౌతాయి.

80 వ దశకంలో విప్లవకర ట్రేడ్ యూనియన్ సింగరేణి కార్మిక సమాఖ్య (సి.కా.స.) కార్మికుల న్యాయమైన హక్కుల కొరకు, యాజమాన్యం దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కార్మికులను సంఘటితపరిచి సి.కా.స. నాయకత్వంలో సమరశీలంగా, చారిత్రాత్మక సమ్మె పోరాటాలతో పాలక వర్గాల గుండెల్లో రైళ్లు పరిగెత్తించి, యాజమాన్యం మెడలు వంచి కార్మికుల హక్కుల్ని సాధించుకున్నారు. సి.కా.స. కార్మికవర్గ పక్షపాతిగా చరిత్రలో నిలిచిపోయింది. ఈ పోరాటాలతో బెంబేలెత్తిన పాలక వర్గాలు, సింగరేణి యాజమాన్యం కుమ్మక్కై దోపిడీ వర్గాలు పెంచి పోషిస్తున్న లైసెన్స్‌డ్ కిరాయి నరహంతక పోలీసులు సి.కా.స. కార్యకర్తలను పదుల సంఖ్యలో హత్యలు చేసి సింగరేణి ప్రాంతంలో రక్తపుటేరులు పారించి భయానక వాతావరణాన్ని సృష్టించారు. అంతటితో ఆగకుండా పాలక వర్గాలు సి.కా.స.పై నిషేధం విధించాయి.

కార్మికుల హక్కుల సాధన కొసమే ఏర్పాటు అయినాయని చెప్పుకునే జాతీయ కార్మిక సంఘాలు కార్మికుల సమస్యలు పట్టించుకోకపోగా ఓట్ల రాజకీయాలతో పాలక వర్గాలతో రాజీపడి సింగరేణి యాజమాన్యానికి తొత్తులుగా మారినారు. సమస్యల పరిష్కారం కొరకు సమ్మెలు చేస్తున్న కార్మికుల తరుపున మాట్లాడుతామని జాతీయ కార్మిక సంఘాల నాయకులు సింగరేణి యాజమాన్యంతో లాభసాటి ఒప్పందాలు చేసుకొని సమ్మెలను విచ్ఛిన్నం చేస్తు బతుకుదెరువు సంఘాలుగా మారినాయి.

జాతీయ కార్మిక సంఘాల బలహీనతలను గుర్తించిన సింగరేణి యాజమాన్యం మమ్ములను అడ్డుకునే వారు ఎవరూ లేరనే ధీమాతో మానవ హననం, ప్రకృతి వినాశనం చేయడానికి ఆధునాతనమైన యంత్రాలను ప్రవేశపెట్టి, కార్మికులను తగ్గించి, నల్ల బంగారాన్ని వెలికితీసి లక్షల కోట్ల రూపాయలను సంపాదించాలనే దుర్బుద్ధితో ఓపెన్‌కాస్ట్ తవ్వకాలపై దృష్టిని పెట్టి ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. 2014లో 50 మిలియన్ టన్నుల వార్షిక బొగ్గు ఉత్పత్తిని ఒకేసారి 10 మిలియన్ టన్నులకు పెంచి 60 మిలియన్ టన్నులుగా నిర్ధేశించింది. నాలుగేళ్లలో వంద మిలియన్ టన్నుల లక్ష్యాన్ని నిర్ధేశించుకుంది. ఇందుకోసం సింగరేణి యజమాన్యం 14 ఓపెన్‌కాస్ట్ బొగ్గుబావుల తవ్వకాలతో ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం నాలుగు జిల్లాలు ఛిద్రం కానున్నాయి.

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు అన్యాయం జరిగిందనేది ఎవరూ కాదనలేని సత్యం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కొంతవరకైనా సమస్యలు తీరుతాయని తెలంగాణ ప్రజలు ఆశించడం అత్యాశేమి కాదు. సబ్బండ వర్గాల ప్రజలు ముక్త కంఠంతో నినదించారు. సంఘటిత శక్తిగా పోరాడినారు. సింగరేణి కార్మికవర్గం సమ్మెలు, నిరాహారదీక్షలు చేపట్టి కార్మికశక్తిని నిరూపించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగితే వారి బతుకులు, వారి పిల్లల బతుకులు బాగుపడుతాయని సింగరేణి ప్రాంత ప్రజలు ఆశపడ్డారు. కానీ నిరాశే మిగిలింది.

ఎన్నికలకు ముందు టీ.ఆర్.ఎస్. తెలంగాణ ప్రజలకు ఎన్నో వాగ్దానాలు చేసింది. సింగరేణి ప్రాంతం బొందలగడ్డగా కాకుండా తన ప్రాణాలను అడ్డం పెట్టి ఓపెన్‌కాస్ట్‌లను అడ్డుకుంటానని ప్రగల్భాలు పలికిండు. అధికారం కోసం పడరాని పాట్లు పడ్డడు. తెలంగాణ ప్రజల ఓట్లతో టీ.ఆర్.ఎస్. అధికారంలోకి వచ్చింది. కే.సీ.ఆర్. ముఖ్యమంత్రి పదవి చేపట్టిన వెంటనే ప్రజల ప్రయోజనాలు తుంగలో తొక్కి దోపిడీ వర్గ అనుకూల విధానాలను ప్రవేశపెట్టి దోపిడీ వర్గాల ప్రతినిధినని చాటుకున్నాడు.

సింగరేణి కార్మికులు ప్రాణాలను లెక్క చేయకుండా భూగర్భంలోకి వెళ్లి బొగ్గును వెలికితీసి కొవ్వత్తుల్లా కరిగిపోతూ ఈ దేశానికి వెలుగు పంచుతున్నారు. అలాంటి సింగరేణి కార్మికుల జీవితాలతో ఆటలాడుకుంటూ లాభార్జనే ధ్యేయంగా యాజమాన్యం, దేశ పాలకులు తర తరాలకు జీవనోపాధి కలిపించే సాంప్రదాయక బొగ్గు బావులను మూసివేసి 10 సంవత్సరాలలో ఓపెన్‌కాస్ట్ బావుల ద్వారా బొగ్గును వెలికితీసి కార్మికుల బతుకులను నాశనం చేసి, ఉత్తర తెలంగాణ జిల్లాలను బొందలగడ్డగా మార్చే కుట్రలు చేస్తున్నారు.

1989లో సింగరేణి కార్మికుల సంఖ్య 1లక్ష 16 వేలు ఉండగా, యాంత్రీకరణ ఫలితంగా 63 వేలకు తగ్గింది. ఓపెన్‌కాస్ట్ బొగ్గు బావుల తవ్వకాలు జరుగుతే కార్మికుల సంఖ్య సగానికి సగం (30 వేలు) తగ్గిపోతుంది. సాంప్రదాయ బొగ్గు బావుల తవ్వకంతో సింగరేణి కార్మికుల సంఖ్య పెరుగుతుంది. దీనితో సింగరేణి ప్రాంతంలో నిరుద్యోగ సమస్య తగ్గుతుంది. ఓపెన్‌కాస్ట్ బావులను పూర్తిగా రద్దు చేసి సాంప్రదాయక బొగ్గు బావుల నుండి బొగ్గును వెలికితీస్తే వారసత్వ ఉద్యోగాలు లభిస్తాయి. మెడికల్ అన్‌ఫిట్, ఏ ఇతర కారణాలతో మరణించిన కుటుంబాలకైనా ఉద్యోగాలు లభించి జీవనోపాధి దొరుకుతుంది.

సింగరేణిలో 1981 జనవరి నుండి వారసత్వ ఉద్యోగాలు ఇవ్వడం మొదలైంది. (కార్మికుల సంఘటిత శక్తితో సమ్మె పోరాటాల ద్వారా వారసత్వ ఉద్యోగాలు సాధించుకున్నారు) సింగరేణి యాజమాన్యం కుట్ర పూరితంగా 1993లో ఎంప్లాయ్‌మెంట్‌ను రద్దు చేసి జనరల్ రిక్రూట్‌మెంట్ నిలిపివేసింది. పీ.వీ. నరసింహారావు కాలంలో వచ్చిన నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాలు, గ్లోబలైజేషన్ ఫలితంగా, జాతీయ కార్మిక సంఘాల ద్రోహంతో 1998 జూన్‌లో వారసత్వ, డిపెండెంట్ ఉద్యోగాలు రద్దయినాయి. దీనితో సింగరేణి ప్రాంతంలో వేలాది మంది యువకులు నిరుద్యోగులుగా మారుతున్నారు. నిరాశ, నిస్పృహలతో కొద్ది మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. చెట్టంత కొడుకులు పనులు లేక కళ్ల ముందే ఆత్మహత్యలకు పాల్పడుతుంటే, అకతాయిలుగా తిరుగుతుంటే తల్లిదండ్రుల మానసిక వ్యధ వర్ణనాతీతం.

వాస్తవానికి సింగరేణిలో 2020 నాటికి 16 వేల మంది కార్మికులు ఉద్యోగ విరమణ చేయనున్నారు. 2024 నాటికి ఈ సంఖ్య 30 వేలకు పెరుగుతుంది. ప్రస్తుతం సింగరేణి కార్మికుల సంఖ్య 63 వేలు. ఇలాగే కొనసాగితే ఉత్తర తెలంగాణలోని నాలుగు జిల్లాలు ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం కనుమరుగై పోతాయి. ఇలాంటి పరిస్థితులలో కార్మికులను సంఘటితపరిచి, ఓపెన్‌కాస్ట్‌లకు వ్యతిరేకంగా, సాంప్రదాయ బొగ్గు బావుల కొరకు, వారసత్వ, డిపెండెంట్ ఎంప్లాయ్‌మెంట్ పునురుద్ధరణ కోసం సమరశీల పోరాటాలు చేయాల్సిన బాధ్యతను విస్మరించి జాతీయ కార్మిక సంఘాల నాయకులు యాజమాన్యంతో లాలూచిపడి కార్మికులకు ద్రోహం తలపెడుతున్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల సవరింపు పేరుతో కార్మికుల హక్కులను కాలరాచే ప్రయత్నం చేస్తున్నది.

టీ.ఆర్.ఎస్. అధికారంలోకి రాకముందు కే.సీ.ఆర్. ఉత్తర తెలంగాణను బొందలగడ్డగా మారకుండా తన ప్రాణాలను అడ్డుపెట్టి ఓపెన్‌కాస్ట్‌లను అడ్డుకుంటానని ప్రగల్భాలు పలికిండు. ఇప్పుడేమో సింగరేణి యాజమాన్యానికి 14 బొగ్గు బావులను తవ్వుకోవడానికి అనుమతులు ఇచ్చినాడు. యాజమాన్యం ఓపెన్‌కాస్ట్ బొగ్గు తవ్వకాలు మొదలుపెడితే మూడు మండలాలలోని 19 గ్రామాలు కనుమరుగై పోతాయి. ప్రజలు నిర్వాసితులవుతారు. కార్మికులు కుదించబడతారు. పశు పక్షాదులు మరణిస్తాయి. చుట్టూ వున్న గ్రామాల ప్రజలు రోగాల బారిన పడతారు. పర్యావరణం దెబ్బతింటుంది. పంట పొలాలు, పచ్చని చెట్లు నాశనమవుతాయి. అడవి ధ్వంసం అవుతుంది. ఎటు చూసినా బొందలగడ్డలే కనిపిస్తాయి. ఇంతటి విధ్వంసం సృష్టిస్తున్నా, మానవ హననం జరుగుతున్నా, సింగరేణి యాజమాన్యానికి ఓపెన్‌కాస్ట్ బొగ్గు బావులను తవ్వుకోవడానికి అనుమతిచ్చిన ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు తెలంగాణ వేశం వేసుకొని తెలంగాణ భాషను నేర్చుకొని, తెలంగాణ యాసలో మాట్లాడుతున్న తెలంగాణ ద్రోహి, తెలంగాణ ముసుగులో వున్న ఆంధ్ర దోపిడీ దారుల ముద్దుబిడ్డ.

పన్నెండున్నర దశాబ్దాలకు పైగా సిరులు పంచి లక్షలాది ప్రజలకు జీవనోపాధి కల్పించి తనదైన జీవన శైలితో, విభిన్న సంస్కృతులతో, కార్మిక వాడలతో కళకళలాడిన సింగరేణి ప్రాంతం టీ.ఆర్.ఎస్. ప్రభుత్వ కుట్రతో, యాజమాన్యం లాభాపేక్షతో కనుమరుగు కానుంది. ఓపెన్‌కాస్ట్ బావుల ద్వారా ఉత్తర తెలంగాణ ప్రాంతం స్మశాన వాటికగా మారుతుంది. ఎటు చూసినా బొందల గడ్డలు దర్శనమిస్తాయి. లక్షలాది మంది ప్రజలు రోడ్డు పాలవుతారు. ఇంతటి దుర్మార్గ విధ్వంసం సృష్టిస్తున్న ఓపెన్‌కాస్ట్‌లను సంఘటితశక్తి ద్వారా అడ్డుకుందాం. సింగరేణి ప్రాంతాన్ని రక్షించుకుందాం. సాంప్రదాయ బొగ్గు బావులకై, వారసత్వ ఉద్యోగాలకై, డిపెండెంట్, ఎంప్లాయ్‌మెంట్ పునరుద్ధరణ కొరకు సమరశీలంగా పోరాడుదాం. సింగరేణి కార్మిక సమాఖ్య (సి.కా.స.), మావోయిస్టు పార్టీ అండగా ఉంటుంది. మార్క్స్ మహాశయుడు చెప్పినట్టు పోరాడితే పోయేది ఏమి లేదు– బానిస సంకెళ్లు తప్ప అనే స్ఫూర్తితో పోరాడితే పోయేది ఏమి లేదు – ఓపెన్‌కాస్ట్‌లు తప్ప అని కార్మిక సంఘటిత శక్తితో, సమ్మె సైరన్ మోతలతో, సమరశీల పోరాటాలే పరిష్కారమార్గం. ★

# కరువుతో అల్లాడుతున్న ప్రజలు - చోద్యం చూస్తున్న ప్రభుత్వం

ఎన్నికల ముందు కే.సీ.ఆర్. రైతులకు రుణమాఫీ చేస్తానని హామీలు ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక ఆచరణలో రుణమాఫీ చేయకుండా కేవలం 25 శాతం మాత్రమే రుణమాఫీ చేసి చేతులు దులుపుకొన్నాడు. మరో వైపు తన వర్గ సహోదరులైన విదేశీ, స్వదేశీ కార్పొరేటు శక్తులకు, సింగిల్ విండో విధానం పేరుతో కోట్లాది రూపాయలు లంచాలు పుచ్చుకొని ఉచిత విద్యుత్, భూమి, నీళ్లు, పారిశ్రామిక రాయితీలు మంజూరు చేశాడు. ప్రతి సం॥రం 2 వేల కోట్ల రూపాయల మేరకు పారిశ్రామికవేత్తలకు రాయితీలను టీ.ఆర్.ఎస్. ప్రభుత్వం ఇస్తున్నది. లక్షా యాభై వేల ఎకరాలను కేటాయించింది.

గత రెండు సంవత్సరాలుగా వర్షాభావం, కరెంటు కోతల కారణంగా పంటలు పండక పోవడం, పండిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో పెరిగిపోయిన రుణభారంతో ఈ సం॥రం గత సంవత్సరం కన్నా ఎక్కువగా తెలంగాణ రైతాంగాన్ని ఆత్మహత్యలకు పురిగొల్పుతున్నాయి. ఇప్పటివరకు తెలంగాణలో దాదాపు 2 వేల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇదే విధంగా దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో రైతాంగం ఆత్మహత్యలు చేసుకున్నారు. ప్రభుత్వ మద్దతు ధర తగ్గి వ్యవసాయ ఆదాయం నిరంతరం తగ్గుతున్నది. నేషనల్ శాంపిల్ సర్వే ప్రకారం రైతుల సగటు నెలసరి ఆదాయం రూ. 6,426 కంటే తక్కువ అని అంచనా వేసింది.

రైతాంగం ఇంత దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నా రైతుల రుణాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాఫీ చేయకపోగా కార్పొరేటు శక్తులకు మాత్రం ప్రోత్సాహకాల పేరుతో 30 లక్షల కోట్ల రూపాయలను సబ్సిడీల పేరుతో దోచిపెట్టాయి. మేక్ ఇన్ ఇండియా, మేక్ ఇన్ తెలంగాణ, మేక్ ఇన్ హైద్రాబాద్ పేర్లతో ప్రధాని మోడీ, సీ.ఎం. కే.సీ.ఆర్. విదేశాలకు పోయి కార్పొరేట్ సంస్థలను దేశంలో పెట్టుబడులు పెట్టండని ఎర్ర తివాచీలు పరిచి ఆహ్వానిస్తున్నారు. నల్లధనాన్ని వెలికి తీస్తామంటూనే లలిత్‌మోడీ, కింగ్‌పిషర్, లిక్కర్ యజమాని విజయ్ మాల్యాలు వేలకోట్ల రూపాయలు బ్యాంకులలో అప్పులు చేసి వాటిని చెల్లించకుండా ఎగ్గొట్టడానికి విదేశాలకు పారిపోవడానికి వీసాలు ఇచ్చి పంపించారు.

వ్యవసాయ రంగానికి కేంద్ర ప్రభుత్వం ఈ సారి 2016-17 బడ్జెట్‌లో రూ. 39,984 కోట్లు కేటాయించింది. ఇది మొత్తం బడ్జెట్‌లో కేవలం 1.9 శాతం మాత్రమే. వాస్తవానికి ఇది చాల తక్కువ. ఒక ప్రత్యేక ప్యాకేజీ కోసం ఎదురు చూస్తున్న రైతులకు ఈ బడ్జెట్ నిరాశే కల్పించింది. రైతు సంఘాలు, ప్రజాస్వామికవాదులు నిరసనలు తెలియచేస్తూ విమర్శించినప్పటికీ దేశాన్ని బహుళజాతి కంపెనీలకు దోచి పెట్టేందుకు, గాట్ ఒప్పందాల్లో, డబ్ల్యూ.టీ.ఓ.లో చేర్చారు. ఈ విధంగా రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ దేశానికి అన్నం పెట్టే రైతులకు పురుగు మందులు ఇస్తూ హత్యలు చేస్తున్నారు. కే.సీ.ఆర్. గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ లాభాల కొరకు నిజాం షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరించడానికి ప్రయత్నించడం లేదు. దీనితో లక్షలాది మంది రైతులు, కార్మికులు ఉపాధి కోల్పోయారు.

ఈ రోజు వర్షాభావ పరిస్థితులకు, భూగర్భజలాలు అడుగంటి పోవడానికి, కరువు పరిస్థితులు ఏర్పడటానికి ఈ పాలక వర్గాల దోపిడీ విధానాలే కారణం. అభివృద్ధి నమూనా మాటున ఓపెన్‌కాస్ట్‌ల తవ్వకం, ఇనుము, బాక్సైట్, డోలమైట్, ఇసుక తవ్వకాలు, నీటి ప్రాజెక్టుల నిర్మాణాలతో ప్రకృతి సహజ లక్షణాలను కోల్పోయి అడవులు నాశనం అవుతున్నాయి. కాలుష్య కారకాలయిన మందుల పరిశ్రమలు, పెట్రో కెమికల్స్, రసాయన పరిశ్రమలు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, ఫార్మా కంపెనీలను నెలకొల్పడంతో బొగ్గు పులుసు వాయువులు, విష పదార్థాలు వాతావరణంలోకి విడుదలయిన ఫలితంగా భూతాపం పెరుగుతున్నది. దీనితో తీవ్రంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీనితో మానవుల వునికికి, పంటలకు మొత్తం జీవరాశి మనుగడకు ముప్పు ఏర్పడుతుందని శాస్త్రవేత్తలు పదేపదే హెచ్చరిస్తున్నప్పటికీ మానవ రక్తానికి రుచిమరిగిన పాలక వర్గాలు, సామ్రాజ్యవాదులు, దళారీ పెట్టుబడిదారులు, భూస్వాములు తమ వర్గ సౌకర్యాల కోసం ప్రకృతి సంపదను, పీడిత ప్రజలందరిని, జీవకోటిని నాశనం చేస్తున్నారు. దీని ఫలితమే ఈ సంవత్సరం గతం కంటే ఉష్ణోగ్రతలు పెరిగిపోయి ఎండదెబ్బతో ఒక తెలంగాణ రాష్ట్రంలోనే 400 మందికి పైగా చనిపోయారు.

తెలంగాణ అనే బురఖా తొడుక్కున్న కే.సీ.ఆర్. ఇపుడు అదే పని కొనసాగిస్తున్నాడు. జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞాన్ని కొనసాగించిన వై.ఎస్.ఆర్. లాగానే మిషన్ కాకతీయ, మిషన్ భగీరథలను మిషన్ కమీషన్ల లక్ష్యంతో కొనసాగిస్తున్నాడు. అభివృద్ధి పనులు చేపట్టటానికి రాష్ట్రానికి అప్పులు అవసరమని 22 నెలలలో 1.50 లక్షల కోట్ల రూపాయల అప్పులు తెచ్చి అప్పుల రాష్ట్రంగా మార్చారు. మరో పక్క మన రాష్ట్రం ధనిక రాష్ట్రమని గొప్పలు చెప్పుతున్నాడు. అప్పుల ఊబిలో కూరుకుపోతుందని కాగ్ కూడా హెచ్చరించింది. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, హరితహారం, కళ్యాణలక్ష్మి ఇంకా తదితర పథకాలకు కేటాయించిన నిధులను నామమాత్రంగానే ఖర్చు చేసారని కాగ్ బయటపెట్టింది. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, సాగునీటి ప్రాజెక్టుల కోసం ఇప్పుడు 2 లక్షల కోట్ల రూపాయల అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పుల మయం చేస్తున్నాడు. అసెంబ్లీలో కోటి ఎకరాల సాగునీటి పథకం గురించి గూగుల్ సహాయంతో బ్యారేజీల గురించి, పెన్‌గంగ, కాళేశ్వరం, మేడిగడ్డ, తుమ్మిడిహట్టి ప్రాజెక్టుల గురించి సాధికారికంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసిన చరిత్ర తనదేనని కే.సీ.ఆర్. గొప్పలు చెప్పుకుంటున్నాడు. మిషన్ కాకతీయలో సుమారు 46 వేల చెరువుల పునరుద్దరణతో పాటు గొలుసుకట్టు వ్యవస్థను పూర్తి చేస్తామంటున్నారు. ఆసరా పథకం, కంప్యూటరీకరణ, పేపర్‌లెస్

అడ్మినిస్ట్రేషన్, మేక్ ఇన్ హైద్రాబాద్, ఉపాధి కల్పన, ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ఎంటర్ ప్రెన్యూర్ షిప్ స్వభావంతో ఎదిగే విధాన స్వీకరణ, కే.జీ. టు పీ.జీ. ఉచిత విద్య, బీడీ కార్మికులకు చేయూత, వృద్ధాప్య పింఛన్, బయోమెట్రిక్ విధానంలో రేషన్ పంపిణీ, కళ్యాణలక్ష్మి, శాదీ ముబారక్, సమగ్ర నీటి ప్రణాళిక, ఐ.టీ. ప్రణాళికలను తీసుకువచ్చారు. శాసనసభలో నీటి ప్రాజెక్టుల గురించి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్, తాగునీటి కొరత నివారణ చర్యలు, కరువు మండలాలు ప్రకటించి అక్కడి ప్రజలను ఆదుకుంటామని, ఆత్మహత్యలు, కరువు లేని తెలంగాణను నిర్మిస్తామని వాగ్దానాలు చేస్తున్నారు. యుద్ధ ప్రాతిపదికన కొనసాగిస్తామని మొత్తం టీ.ఆర్.ఎస్. పార్టీ శ్రేణులు, ఎం.ఎల్.ఏ.లు, ఎం.పీ.లు, మంత్రులు ప్రచార హోరు కొనసాగిస్తున్నారు. కానీ ఆచరణలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే వున్నది. ఇప్పుడు ప్రకటించిన అన్ని పథకాలలో అవినీతి కొనసాగుతున్నది. ఇతర పార్టీల నుండి పదవులు, డబ్బుల కొరకు టీ.ఆర్.ఎస్.లోకి చేరుతున్నారు. ఆంధ్రాలో టీ.డీ.పీ.లోకి చేరుతున్నారు. ఈ రోజు ప్రజాసంఘాలు, ప్రజలే నిజమైన ప్రతిపక్షాలుగా నిలుస్తూ టీ.ఆర్.ఎస్. పార్టీని, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

ఇప్పుడు టీ.ఆర్.ఎస్. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కొనసాగిస్తున్న పని తెలంగాణలోని వనరులను దోచుకోవడం, కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడమే కాబట్టి ప్రజలను అణచివేయడం, ప్రజలకు అండగా వున్న మావోయిస్టు పార్టీని నిర్మూలించడానికి ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడవ దశ దాడిని తీవ్రతరం చేస్తున్నది. బూటకపు ఎన్‌కౌంటర్లు, అరెస్టులు, అత్యాచారాలు కొనసాగిస్తున్నది.

ఇప్పుడు రాష్ట్రంలో 432 మండలాలలో కరువు సమస్య తీవ్రంగా ఉన్నది. ఈ మండలాలలో కరువు నివారణ చర్యలు తక్షణమే చేపట్టాలి. పశుగ్రాసాన్ని అందించాలి. ప్రతి జిల్లాలో వేలాది గ్రామాలలో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. మహారాష్ట్ర లోని లాతూర్ ఏరియాలోని పరిస్థితి తెలంగాణలో ఏర్పడబోతున్నది. అందుకే టీ.ఆర్.ఎస్. ప్రభుత్వం వాగ్దానం చేసినట్లుగా యుద్ధ ప్రాతిపదికన అన్ని జిల్లాలలో అధికార్లతో సర్వే నిర్వహించి తక్షణం తాగునీటి సరఫరాను కొనసాగించాలి. ఏడాది పొడవున కరువు పనులు కల్పించాలి. కరువు సమస్యపై నిరంతరం ప్రభుత్వం సర్వేలు కొనసాగించాలి. పేరుకు మాత్రమే కే.సీ.ఆర్. వంద శాతం వున్న ప్రతి సమస్యను 5 శాతం మాత్రమే పరిష్కరించి మొత్తం పరిష్కరించినట్టుగా గొప్పలు చెప్పుకుంటున్నాడు. దీన్ని ప్రజలంతా తీవ్రంగా వ్యతిరేకించాలి.

టీ.ఆర్.ఎస్. అన్ని పార్టీల వలేనే భూస్వాముల, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదుల పార్టీ. అది ఆంధ్రా భూస్వాముల, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల ఆస్థులను కాపాడుతున్నది. అందుకని కరువు సమస్యపై, తాగునీరు, సాగునీరు, పశుగ్రాసం, కరువు పనులను సాధించే వరకు ప్రజలు ఎక్కడికక్కడ పెద్ద ఎత్తున పోరాటాలు కొనసాగించాలి. ★

**"ఒక రాజకీయ పార్టీ ఎంత నిజాయితీ గలదో, ఆచరణలో తన వర్గం యెడల కష్టజీవుల ప్రజాస్వామ్యం యెడల తన బాధ్యతనెలా నెరవేరుస్తుందో తెలుసుకోవాలంటే అతి ప్రధానమైన ఖచ్చితమైన పద్ధతి, ఆ పార్టీ తాను చేసే పొరపాట్ల యెడల, ఎలాంటి వైఖరిని అవలంబిస్తుందో చూడ్డం. ఏదైనా తప్పుచేస్తే దాపరికం లేకుండా దాన్ని ఒప్పుకోవడం, అందుకు కారణాలేమిటో తెలుసుకోవడం, ఏ పరిస్థితులు ఆ తప్పుకు దారితీశాయో పరిశీలించడం, దాన్ని దిద్దుకునేందుకు ఏమేమి చేయాలో కూలంకషంగా చర్చించడం - ఇదీ సిసలైన రాజకీయ పార్టీ అవలంబించవలసిన విధానం. తన విధానాలను నెరవేర్చవలసిన పద్ధతి. ఆ వర్గాన్ని, ఆ తర్వాత ప్రజాసామాన్యాలను సురక్షితంగా తర్ఫీదు చేయవలసిన మార్గం." -లెనిన్**

**"పాలకవర్గంలోని యే సభ్యుడు పార్లమెంటు ద్వారా ప్రజలను అణగదొక్కవలసిందీ, నలిపివేయలిందీ ప్రతి కొద్ది యేండ్ల కొక్కసారి నిర్ణయించడం - ఇది బూర్జువా పార్లమెంటరీజం యొక్క నిజమైన సారం, పార్లమెంటరీ రాజ్యాంగబద్ధ రాజరిక దేశాలలో మాత్రమే కాదు, అత్యంత ప్రజాస్వామిక రిపబ్లిక్కులలో కూడా."**

**రాజ్యం, విప్లవం -లెనిన్**

# నిజమైన దేశభక్తులెవరు? భారత్ మాతాకీ జై అందామా?

# అన్ని జాతులకు నిజమైన స్వేచ్ఛ ఎలా వస్తుంది?

# బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని ప్రతిఘటించండి!

భారతదేశం అనేక జాతులు, కులాలు, తెగలు, మతాలు భాషలు, సంస్కృతులు గల దేశం. పురాతన నాగరికత విలసిల్లిన అతి పెద్ద దేశం. ప్రస్తుతం భారతదేశ జనాభా దాదాపు 125 కోట్లు ఉంది. వేల సంవత్సరాల పాటు భారత సమాజంపై బ్రాహ్మణీయ హిందూ భావజాల ప్రాతిపదికపై నిర్మితమైన కట్టుదిట్టమైన నిచ్చెనమెట్ల కులవ్యవస్థ పునాదిగా గల భూస్వామ్య విధానం నేటి వరకు పెత్తనం చెలాయిస్తున్నది. సామ్రాజ్యవాదులు, దళారీ నిరంకుంశ పెట్టుబడిదారులు భూస్వామ్యంతో చెట్టాపట్టాలేసుకుని తమ దోపిడీని కొనసాగించడానికి దేశ ఐక్యత, సమగ్రత పేరుతో దేశాన్ని జాతుల బందీఖానాగా మార్చివేశారు. కుల చట్రంలో బిగించివేశారు. భూస్వామ్య ఫ్యూడల్ పెత్తనానికి, సంప్రదాయాలకు సంఘ్ పరివార్ ప్రాతినిధ్యం వహిస్తోంది. కుల వ్యవస్థలో మతాన్నైనా మార్చుకోవచ్చు గానీ కులాన్ని మార్చుకోలేము. పుట్టుకతో వస్తుంది. చావుతోనే అంతమవుతుంది. ఇలాంటి కుళ్లు వ్యవస్థను కాపాడడానికే నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత తమ లక్ష్యాన్ని సాధించడానికి సంఘ్ పరివార్ శక్తులు బ్రాహ్మణీయ హిందూ ఫాసిజం దేశంలోని అన్ని సెక్షన్లపై దాడులు కొనసాగిస్తున్నది. తామే నిజమైన దేశభక్తులమంటూ సామ్రాజ్యవాదానికి దళారీగా వ్యవహరిస్తూ దేశంలో హిందూ సామ్రాజ్యాన్ని నిర్మించే లక్ష్యంతో దాడులను కొనసాగిస్తున్నారు. ఈరోజు సంఘ్ పరివార్ మన దేశంలోని ప్రజల భాష, సంస్కృతి, ఆచారాలు, కళలను అణచివేస్తూ బ్రాహ్మణీయ హిందూ భావజాలాన్ని పరమ ఫాసిస్టు పద్ధతుల్లో ప్రజలపై రుద్దుతున్నది. మరో వైపు విద్య కాషాయీకరణ లక్ష్యంతో కళలు, సాహిత్యం, సంస్కృతి, చిత్ర పరిశ్రమ, చారిత్రక పరిశోధన కేంద్రాలను సంఘ్ పరివార్ శక్తులతో నింపుతున్నారు. వేదాలను సైన్స్‌గా, పుక్కిటి పురాణాలైన రామాయణం, మహాభారతాలను చరిత్రగా మోడీ ప్రభుత్వం చిత్రీకరిస్తున్నది. స్వాతంత్రోద్యమంలో ఏనాడు పాల్గొనని సంఘ్ పరివార్ శక్తులు ఈరోజు జాతీయత, దేశభక్తి మాట్లాడుతున్నాయి. వీళ్లకు ఈ నైతిక హక్కులేదు. దేశంలో గో మాంసం తినే సముదాయలపై బెదిరింపులు, హత్యలు, అఖ్లాక్‌ను హత్య చేయడం, కల్బుర్గి, దబోల్కర్, గోవింద్ పన్సారే వంటి ప్రగతిశీల హేతువాద రచయితలను, మేధావులను చంపి వేశారు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్.సి.యు.)లోని దళిత విద్యార్థి రోహిత్‌ను ఆత్మహత్య చేశారు. ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జె.ఎన్.యు.) విద్యార్థి సంఘం నాయకులు కన్హయ్య కుమార్, ఉమర్ ఖలీద్ లపై దేశద్రోహ నేరం కేసు మోపి జైలుకు పంపడం, ఆయన సహచర విద్యార్థులైన మరో ఎనిమిది మందిపై దేశద్రోహ కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ యూనివర్సిటీ నుండి సస్పెండ్ చేయడం, కన్హయ్య కుమార్‌ను చంపితే నజరానాలు ఇస్తామని ప్రకటించడం, ఢిల్లీలోని ప్రెస్ క్లబ్‌లో మక్బూల్‌భట్, అఫ్జల్‌గురుల స్మారకోపన్యాసం చేసిన ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ గిలానీపై దేశద్రోహ కేసు మోపి అరెస్టు చేయడం, జె.ఎన్.యు.లో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రశ్నించిన సి.పి.ఐ., సి.పి.ఎం. కేంద్ర నాయకులైన రాజా, సీతారామ్ ఏచూరిలకు ఫోన్ బెదిరింపులు, ఢిల్లీలోని పాటియాలా కోర్టు ఆవరణలో సంఘ్ పరివార్‌కు చెందిన లాయర్లు వామపక్ష విద్యార్థులపై, మీడియా ఉద్యోగులపై భౌతికదాడులు, ఢిల్లీ ఐ.ఐ.టీ.లో కశ్మీర్ డాక్యుమెంటరీ ప్రదర్శనను అడ్డుకోవడం, మద్రాస్ ఐ.ఐ.టీ.లో పెరియార్, అంబేద్కర్ స్టడీ సర్కిల్‌ను నిషేధించమని కేంద్ర మానవ వనరుల శాఖామంత్రి స్మృతి ఇరానీ లేఖ రాయడం, హెచ్.సీ.యు.లో వి.సి. పొదిలె అప్పారావు తిరిగి విధుల్లో చేరటాన్ని వ్యతిరేకించిన విద్యార్థులపై లాఠీఛార్జీ చేసి 100 మంది విద్యార్థులను అరెస్టు చేసి, 25 మందిని చర్లపల్లి జైల్లో వేశారు. ఉదయ్‌భానును పోలీసులు తీవ్ర చిత్రహింసలు పెట్టి యూనివర్సిటీ గేటుముందు పడవేసి పోయారు. మరోవైపు దేశ విశ్వవిద్యాలయాలను విదేశీ విశ్వవిద్యాలయాలకు అప్పగించే చట్టాలను రూపొందిస్తున్నారు. దేశంలోని సకల సంపదలను సామ్రాజ్యవాద కార్పొరేటు సంస్థలకు అప్పగిస్తూ, సామ్రాజ్యవాద దేశాల ఆజ్ఞలకు తలొగ్గి దేశాన్ని తాకట్టు పెడుతూ దేశద్రోహ విధానాలను అమలు చేస్తున్న మోడీ ప్రభుత్వం దేశభక్తిని, భారతమాత, జాతీయతల గురించి మాట్లాడటం దయ్యాలు నీతులు వల్లించినట్లుగా ఉంది. తమ ఆలోచనలు, అభిప్రాయాలు, భావజాలానికి భిన్నంగా ఆలోచించే, అభిప్రాయాలు వెలిబుచ్చే, ఆచరించే వారందరినీ జాతి వ్యతిరేకులని చిత్రిస్తూ వుంది. ఇదంతా హిందూ ఫాసిజంలో భాగమే. సంఘ్ పరివార్ శక్తులు రాజ్యాధికారాన్ని ఉపయోగించుకొని భారతదేశంలోని రైతుల, కార్మికుల, విద్యార్థుల, మేధావుల, ఉద్యోగుల, రచయితల, కళాకారుల మత మైనారిటీల, జాతుల, దళితుల, ఆదివాసుల, మహిళలపై చేస్తున్న దాడులు అసహనం పరిస్థితిని దాటి భారత రాజ్యాంగం, చట్టాలను తుంగలో తొక్కి ఫాసిజాన్ని అమలు చేస్తున్నాయి.

దేశవ్యాప్తంగా మత అసహనం విపరీతంగా పెరగడంతో దేశవ్యాప్తంగా సంఘ్ పరివార్ పై అన్ని సెక్షన్ల ప్రజల్లో వ్యతిరేకత పెరిగింది. ప్రజా ఉద్యమం పెల్లుబికింది. కవులు, కళాకారులు, రచయితలు, ప్రజాస్వామికవాదులు నిరసనలు తెలియజేస్తూ అవార్డులను వాపస్ ఇచ్చేసారు.

అసలు భారతదేశం ఒక జాతినా? భారతదేశమని పేరు ఎందుకు

వచ్చింది? కారణాలు ఏమిటో చూద్దాం.

ప్రపంచవ్యాప్తంగా మానవ జాతి పరిణామం మూడు యుగాలగుండా పయనించిందనీ 1871లో మోర్గాన్ రాసిన విషయాన్ని ఏంగెల్స్ తన ప్రఖ్యాత "కుటుంబం, వ్యక్తిగత ఆస్తి, రాజ్యాల పుట్టుక" అనే గ్రంథంలో ధృవీకరించాడు. అవి 1. ఆటవిక యుగం 2. అనాగరిక యుగం 3. నాగరిక యుగం

అనాగరిక యుగపు ప్రాథమిక దశ వరకూ ప్రపంచ వ్యాప్తంగా అన్ని సమాజాలు దాదాపు ఒకే విధంగా అభివృద్ధి చెందాయనీ అయితే తదనంతరం ఒక్కో ప్రాంతంలో వున్న భౌగోళిక ప్రత్యేకతలు, సహజ వనరులు, వాతావరణం, ఇతర ప్రకృతి వైవిధ్యాలు ఆయా ప్రాంతాల్లోని సమాజాభివృద్ధిని నిర్దేశించాయని ఎంగెల్స్ పేర్కొన్నాడు.

ప్రాచీన భారతాన్ని అర్థం చేసుకోవడానికి డి.డి. కోశాంబి చారిత్రక ఆధారాలతో అనేక రచనలు చేశాడు. అవే మనకు ఇప్పటివరకు ప్రామాణికంగా ఉపయోగపడుతున్నాయి. దాని ఆధారంగా మన దేశాన్ని మొదట్లో పర్షియన్‌లు భౌగోళిక దృష్టితో సింధూ నదిని ఆధారం చేసుకొని హిందూస్తాన్‌గా పిలిచేవారు. సింధును హిందూ అని అంటారు. అంటే స-ను హ అని, సి-ని హి అని అంటారు. అందువలన ఉచ్చారణలో హిందూస్తాన్ అని పిలిచేవారు. కోయ భాషలో బస్తర్ ప్రాంతంలో దారిని హర్రి అంటే ఆదిలాబాద్ కోయలో సర్రి అని అంటారు. పూర్వం వరంగల్‌ను ఒంది కల్లు, ఆ తర్వాత ఓరుగల్లు అని ఇప్పుడు వరంగల్ అంటున్నారు. కోయ భాషలో ఒంది అంటే ఒకటి, కల్లు అంటే రాయి. అంటే ఒక రాయి అని అర్థం. తెలుగులో ఏకశిలా అనీ అంటున్నాము. పంజాబ్‌లో ఐదు నదులు ప్రవహిస్తుండడంతో పంజాబ్ అని పేరు వచ్చింది. హిందూస్తాన్‌గా పిలవడం వెనుక ఎలాంటి మత భావం లేదు. అలాగే భరతులు అనే తెగ పాలనతోనే భారతదేశం అని పేరు వచ్చిందని అంటారు. 16వ శతాబ్దం నాటి వరకూ ఇండియా అన్న పదం కూడా మనకు పరాయిదే. భారతదేశంలో మౌర్యుల కాలంలో బౌద్ధం, జైనం, గుప్తుల కాలంలో హైందవం (బ్రాహ్మణమతం), ముస్లింల పాలనలో ముస్లిం మతం ఆధిపత్యం వహించాయి. భారతదేశంలో ఆర్యుల ప్రవేశానంతర కాలంలో బ్రాహ్మణ మత భావజాలమే ఈనాటి వరకు ఆధిపత్యంలో ఉంది. ఆర్యులకు పూర్వమే క్రీస్తు పూర్వం 2500 -1800 సంవత్సరాల కాలంలో మన దేశంలో కంచు యుగపు సింధూలోయ నాగరికత విలసిల్లింది. ఇది ప్రపంచ నాగరికతలలో ఆనాటికి అభివృద్ధి చెందిన నాగరికత. దాని మూల పురుషులు మూలవాసులే. వాళ్లను ద్రావిడులుగా వ్యవహరించారు. మొదట క్రీ.పూ. 1800 లోనూ, ఆ తదుపరి క్రీ.పూ 1200 - 1000 మధ్యకాలంలోనూ గుంపులు గుంపులుగా ఆర్యుల వలసలు సాగాయి. అప్పటికే బలహీనపడిన సింధూ నాగరికత ఆర్యుల దాడులతో శిథిలావస్తకు చేరింది.

ఆర్యుల రాకతో నీటి వనరుల కోసం, భూమి కోసం, బానిసల కోసం ఆర్య - ద్రావిడుల మధ్య దశాబ్దాల తరబడి జరిగిన యుద్ధాలతో సింధూ నాగరికత ధ్వంసమై పోయి తిరిగి మరో 1200 సంవత్సరాలు అనాగరిక యుగమే కొనసాగింది. పశుపాలకులైన ఆర్య తెగలు వ్యవసాయిక తెగలతోనూ వ్యవసాయేతర తెగలతోనూ ఘర్షిస్తుండినపుడు ఓడిపోయిన తెగలను బానిసలు గావించడం మొదలైంది. వాళ్లను దాసులు, దస్యులు అని పిలిచేవారు. వర్గాలుగా వర్ణాలు ఉనికిలోకి వచ్చాయి. ఆ తర్వాత క్రమంలో కులాలు వచ్చాయి. అతి హీన వర్ణం కట్టుబానిస శూద్ర వర్ణం ఏర్పడింది. ఉత్తర భారతదేశంలో ఆహార ఉత్పత్తిని సాధించిన ఆర్యులది స్వంత ఆస్తి సమాజం కాక, భూమి, పశువులను సమిష్టి ఆస్తిగా కలిగిన గణ సమాజం కావడం వలన వీళ్లకు లోబడిన దాసి తదితర ఆర్యేతరులు బానిసలు కాలేదు. మొత్తం ఆర్య గణాలకు సమిష్టి భృతులయ్యారు. శూద్రులయ్యారు. భారత సమాజంలో రోమ్ తరహా బానిస వ్యవస్థ ఏర్పడలేదు. దాని స్థానంలో పూర్తిగా పరిణతి చెందని బానిస సమాజం ఏర్పడింది.

భారతదేశంలో ఆటవిక తెగల్ని కలుపుకోవడానికి బలప్రయోగం చేస్తూనే మరో వైపు సాంస్కృతికంగా, మతం కర్మకాండల ద్వారా సాధ్యమైంది. తెగ నాయకులను పై వర్ణాలైన బ్రాహ్మణ, క్షత్రియ వర్ణాల్లో స్వర్ణగర్భం అనే కర్మకాండ ద్వారా కలుపుకొనేవారు. ఓడిపోయిన ఆటవికులతో ఎక్కువ మందిని శూద్ర, పంచమ కులాలుగా కూలీచేసే రైతాంగంగా మార్చివేశారు. శ్రమ విభజన అపరిమితంగా ఉన్నప్పుడు నాలుగు వర్ణాలే సరిపోయాయి. తరువాత స్థిర వ్యవసాయ గ్రామాల సాంద్రత పెరగడంతో కొత్త పరిణామాలు వచ్చాయి. స్వయం పోషక గ్రామీణ ఆర్థిక వ్యవస్థతో చాతుర్వర్ణం సరిపోదు. శూద్రుల సంఖ్య అపరిమితంగా వృద్ధి అయింది. చాతుర్వర్ణ వ్యవస్థ స్థానే కుల వ్యవస్థ ఏర్పడింది. వృత్తిని బట్టి కులం రూపొందింది. ఇలా ఈ వ్యవస్థలో కులం పుట్టుకతో మొదలై చావుతో అంతమవుతుంది. ఎన్ని మతాలు మారినా, ఎన్ని చదువులు చదివినా కులం పోవడం లేదు. ఈ వ్యవస్థ మార్పుతోనే దీన్ని రూపుమాపగలం.

అగ్రవర్ణాలకు, క్రింది వర్ణాలకు లేదా శూద్రుల మధ్య లేదా యజమానులకు, శ్రామికులకు మధ్య ఘర్షణలు తలెత్తాయి.

క్రీ.పూ. 3వ శతాబ్దంలో భారతదేశంలో పూర్తిగా రూపొందిన మొట్ట మొదటి ప్రధానమైన మౌర్య సామ్రాజ్యం మగధ ప్రాంతంలో ఏర్పడింది. ఈ నూతన తరహా రాజ్యం రైతులు చెల్లించే పన్నులపైన, శూద్రులు చేసే శ్రమపైన ఆధారపడినది. కౌటిల్యుడు రాసిన అర్థశాస్త్రం ప్రకారం రాజులు పరిపాలన కొనసాగించారు. క్రీ.శ. 2వ శతాబ్దంలో జాతులకు, కులాలకు విధులను, స్థానాలను కల్పించినటువంటి వర్ణ సంస్కార్ సిద్ధాంతం, మనుస్మృతి ఉనికిలోకి వచ్చాయి. భూస్వామ్యానికి, దోపిడీ వర్గాల ఆధిక్యతకు సమర్థవంతమైన సైద్ధాంతిక సమంజసత్యాన్ని సమకూర్చింది. అత్యధిక ప్రజల స్వేచ్ఛను హరించి హీనస్థితికి గురి చేయడానికి ఆమోదాన్ని తెలిపింది.

మౌర్యుల తర్వాత గుప్తుల రాజ్యం క్రీ.పూ. 4వ శతాబ్దంలో అవతరించింది. దక్షిణ భారతదేశంలో మొట్టమొదట రెండవ శతాబ్దంలో శాతవాహనుల రాజ్యం ఏర్పడింది. శాతవహనులనే ఆంధ్రులు అనేవాళ్లు. క్రీ.శ. 575 లో పల్లవుల సామ్రాజ్యం ముఖ్యమైన రాజ్యంగా

రూపుదిద్దుకొంది. సుమారు క్రీ.శ. 6వ శతాబ్దం నుండి కుల వ్యవస్థ భారతదేశంలోని చాలా ప్రాంతాలలో సంఘటితపడింది.

స్వయం పోషక గ్రామీణ వ్యవస్థ ఏర్పడడం ప్రారంభమైంది. చాతుర్వర్ణం ఎంత మాత్రం చాల లేదు. వ్యవసాయ విస్తరణ క్రమంలో నూతన గ్రామీణ సమాజం ఏర్పడే క్రమంలోనే వర్ణవ్యవస్థతో ప్రమేయం లేకుండా అనేక శూద్ర కులాలు ఏర్పడ్డాయి. వర్ణాలు కులాలుగా మారాయి. మలినమైన పనులు చేయడానికి నాలుగవ వర్ణానికి దిగువన నీచమైన పనులు చేయడానికి అంటరానివారు అనే అయిదవ వర్ణం సృష్టించబడింది.

ఇంకా భారతదేశాన్ని చోళులు, చాళుక్యులు, తెలంగాణలో కాకతీయులు, ఆంధ్రలో విజయనగర రాజులు, నైజాం రాజులు, ఇంకా తదితర రాజులు అనేక తెగ రాజ్యాలు పాలించాయి. 13వ శతాబ్దంలో మధ్య ఆసియా నుండి దండెత్తివచ్చిన తురుష్కులు ఉత్తర భారతదేశంలో బానిస వంశం ద్వారా అధికారంలోకి వచ్చారు. క్రీ.శ. 16వ శతాబ్దంలో మొఘలులు ఉత్తర, దక్షిణ భారతదేశాల్లో తాము జయించిన రాజ్యాలలోని పాలక గ్రూపుల, రాజ్‌పుతుల నాయకులు యితర వున్నత కులాల భూస్వామ్య దళారుల సహాయంతో తమ అధికారాన్ని సంఘటితపరచుకొన్నారు.

ఈ విధంగా విదేశీ, స్వదేశీ రాజులతో సహా భారత ఉపఖండాన్ని అనేక రాజ్యాలుగా, దేశాలుగా చేసుకొని పరిపాలించారు. అయితే కుల వ్యవస్థ లేని ముస్లిం రాజులతో సహా రాజులందరూ బ్రాహ్మణీయ హిందూ మత కులవ్యవస్థపై ఆధారపడే పరిపాలన కొనసాగించారు.

బ్రిటిష్ వలస వాదులు భారతదేశంలో తయారైన సరుకుల వర్తకంపై ఆధారపడి లాభాలు సంపాదించే లక్ష్యంతో ఈస్టిండియా కంపెనీగా ఏర్పడి ఎగుమతులు, దిగుమతులు చేస్తుండేవారు. ప్రత్యక్ష దోపిడీ కోసం తన సైన్యాలతో బలహీనమైన ఫ్యూడల్ రాజ్యాలు, వాళ్ల మధ్య వున్న ఘర్షణలు ఉపయోగించుకొని తన సైన్యంతో వలసవాదులు ముఖ్యంగా 1757లో ప్లాసీ యుద్ధం తర్వాత భారత ఉప ఖండంలోని రాజ్యాలను ఒక్కటొక్కటిగా మెజారిటీ రాజ్యాలను ఆక్రమించుకొని ఒకే దేశంగా ఏర్పాటుచేసి బలవంతంగా పరిపాలన చేస్తూ వచ్చారు. 1947 వరకు అంటే 200 సంవత్సరాలు భారతదేశాన్ని పాలించారు. ఫ్యూడల్ రాజ్యాల నుండి మొదలు బ్రిటిష్ వలసవాదులకు వ్యతిరేకంగా భారతదేశం అనే బందీఖానాలో బందించబడిన రాజ్యాలు, జాతులు, తెగలు, కులాలు, పీడిత ప్రజలు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కోసం అనేక పోరాటాలు కొనసాగించారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా మాత్రం అందరూ కలిసి ఒక తాటిపైకి వచ్చి పోరాటాలు కొనసాగించారు. కానీ సరియైన నాయకత్వం లేక పోరాటాలు ఓడింపబడ్డాయి. కానీ ప్రజల ప్రతిఘటనతో బ్రిటిష్‌వాడు తన ప్రత్యక్ష పాలనను గత్యంతరం లేని స్థితిలో తొత్తులైన సిబిసికి, భూస్వామ్య వర్గానికి 1947లో అధికారాన్ని అప్పగించి వెళ్లిపోయాడు. ఇలా మన దేశం భూస్వామ్య సమాజం నుండి (వలస – అర్ధ భూస్వామ్యంగా) 1947 తర్వాత నుండి అర్ధ వలస – అర్ధ భూస్వామ్య సమాజంగా ఇప్పుడు నయావలస రూపంలోని పరోక్ష పాలన, దోపిడీ అజమాయిషీల కింద ఉన్న అర్ధ వలస – అర్ధ భూస్వామ్య సమాజంగా కొనసాగుతుంది. అందువలన రష్యాలోలాగా భారతదేశంలో ఏదో ఒక ప్రత్యేక జాతి అణచివేతను కొనసాగించడం లేదు. భూస్వామ్య విధానం, సామ్రాజ్యవాదం, దళారీ బ్యూరాక్రటిక్ బూర్జువా వర్గం అనే ముగ్గురు భారత ప్రజలను, జాతులను దోసుకుంటున్నారు. కాశ్మీర్, ఈశాన్య జాతులను బ్రిటిష్‌వారు ఆక్రమించి భారతదేశంలో చేర్చినప్పటి నుండి ఎన్నడూ వాస్తవంగా తమను తాము భారతదేశంలో భాగంగా వారు భావించలేదు. అధికార మార్పిడి తర్వాత భారత పాలకవర్గాలు 1947కు ముందు చేసిన వాగ్దానాలను విస్మరించి ఆ జాతుల భూభాగాల ఆక్రమణను కొనసాగించాయి. సామ్రాజ్యవాదులకు ఊడిగం చేసే పాలకవర్గాలు దేశ ఐక్యత, సమగ్రత పేరుతో దేశాన్ని జాతుల బందీఖానగా మార్చివేశారు. ఇటువంటి నేపథ్యంలోనే దేశంలోని వివిధ ప్రాంతాల్లోని జాతులు సాయుధ పోరాటంతో సహా వివిధ పోరాట రూపాలను చేపట్టి పురోగమిస్తున్నాయి. కాశ్మీరులు, నాగాలు, మణిపురీలు, అస్సామీలు, ఈశాన్య ప్రాంతంలోని ఇతర జాతుల పోరాటాలు ఇప్పటికే సాయుధ పోరాటాన్ని కొనసాగిస్తున్నాయి. ఈ జాతుల పీడిత ప్రజలు కేవలం తమ స్వంత గుర్తింపు కోసమే కాక న్యాయమైన, గౌరవ ప్రదమైన విడిపోయే హక్కు కూడా వున్న స్వయం నిర్ణయాధికారం కోసం విడిపోతామని పోరాడుతున్నారు. ఈ జాతులు విడిపోవడం కోసం చేస్తున్న డిమాండ్ న్యాయమైంది. వాటికి పూర్తి మద్దతును తెలపాలి. ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదులు ఇప్పుడు ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదులు తమ సంక్షోభాలనుండి బయటపడటం కోసం వెనుకబడిన దేశాలపై, పీడిత జాతులపై దాడులు చేసి ఆ దేశాలను ఆక్రమించుకొని తొత్తు ప్రభుత్వాల ద్వారా అక్కడి సంపదను లూటీ చేస్తున్నారు. అమెరికా సామ్రాజ్యవాదులు తమ దేశంలో నివసిస్తున్న నల్ల జాతీయులపై దాడులు కొనసాగిస్తున్నారు. ఇజ్రాయిల్‌లో యూదులు పాలస్తీనా ప్రజలపై దాడులు చేస్తున్నారు. ఇంకా తదితర దేశాల్లో వివక్ష, దాడులు కొనసాగుతున్నాయి. ఒకప్పుడు హిట్లర్ జాత్యాహంకారంతో నాజీ జాతి గొప్పదని చెబుతూ యూదులను ఊచకోత కోశాడు. రష్యాలో జార్ చక్రవర్తి మైనారిటీ జాతులను అణచివేశాడు. రోమ్‌లాంటి బానిస సమాజాలు అనేక తెగలపై దాడులు చేసి బానిస సామ్రాజ్యాలుగా ఏర్పడ్డాయి. ఇవన్నీ కూడా బందీఖానాలే. అందుకే బందీఖానాలను బద్దలు కొడుతూ స్వేచ్ఛా సమానత్వాల కోసం పాత సమాజాలను ధ్వంసం చేస్తూ కొత్త సమాజాలను నిర్మిస్తూ వస్తున్నారు. ఆ వారసత్వాన్నే మనం కొనసాగిస్తున్నాం. దాన్ని నిజం చేయాలి. మన దేశంలో బ్రాహ్మణీయ హిందూ మతోన్మాదులు అగ్రవర్ణాలు, భూస్వామ్య వర్గం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు సామ్రాజ్యవాదుల అండతో భారతదేశమనే బందీఖానాలో బంధించి స్వేచ్ఛలేకుండా చేస్తూ భారతమాతాకు జై, భారతజాతికి జై అని అనమంటే ఎలా అంటారు? అందుకే తిరుగుబాట్లు కొనసాగిస్తున్నారు. ఉత్పత్తి శక్తులకు, ఉత్పత్తి

సంబంధాలు ఆటంకం కావడంతో సంఘర్షణకు దారితీస్తుంది. ఈ వర్గ సంఘర్షణ వల్లనే సమాజం ఒక దశనుండి మరో ఉన్నత దశకు చేరుతుంది. ప్రపంచంలో మానవ సమాజం ఆదిమ సమాజం నుండి బానిస సమాజం, బానిస సమాజం నుండి ఫ్యూడల్ సమాజం, ఫ్యూడల్ సమాజం నుండి పెట్టుబడిదారీ సమాజం, పెట్టుబడిదారీ సమాజం నుండి కమ్యూనిస్టు సమాజం వైపుకు పురోగమిస్తున్నది. మన దేశంలో కూడా అదే కొనసాగుతుంది. మన దేశ నిర్దిష్ట పరిస్థితులకు తగిన విధంగా వర్గపోరాటాన్ని కొనసాగిద్దాం. అంటే ఆచరణలో తగిన చొరవతో పనిచేస్తే సృజనాత్మకత వస్తుంది. సృజనాత్మకతతో పనిచేస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తాం.

**సంఘ్ పరివార్ పుట్టుక బ్రాహ్మణీయ హిందూ ఫాసిజం**

ఫ్యూడల్ పెత్తనాన్ని, సంప్రదాయాలను బలోపేతం చేసే లక్ష్యంతో ఇలాంటి శక్తులు మన దేశంలో స్వయం సేవక్ సంఘ్‌ను (ఆర్.ఎస్.ఎస్.) 1925లో స్థాపించారు. ఇది వేయి పడగల విషపునాగు. ఇది సమాజంపై విషాన్ని విరజిమ్ముతూ దాన్ని అమృతంగా భ్రమింపజేస్తుంది. ఇది కొత్త హంగులతో పాత సమాజాన్ని సింగారిస్తుంది. ఇది అన్ని రకాల కుల, మత, ప్రాంతీయ, జాతి విద్వేశాలను రెచ్చగొడుతున్నది. దానికి అనుబంధంగా 1951 లో భారతీయ జన్‌సంఘ్ పార్టీని స్థాపించారు. 1980లో అదే బీ.జే.పీ.గా అవతారం ఎత్తింది. 1952 నుండి సరస్వతి శిశుమందిర్‌ల పేరుతో నర్సరీ పాఠశాలలను నడుపుతున్నారు. వీటిని సమన్వయం చేయడానికి విద్యా భారతి అనే సంస్థను నెలకొల్పారు. చిన్న తనం నుండే హిందూ చాందస భావాలను నూరిపోయడం వారి పని. కార్మిక రంగంలో వర్గ పోరాటాన్ని దెబ్బగొట్టడమే ప్రధాన లక్ష్యంగా 1955లో బి.ఎం.ఎస్.ను స్థాపించారు. 1964లో సాధువులు, సన్యాసులు, మఠాధిపతులు కేంద్రంగా విశ్వహిందూ పరిషత్‌ను నెలకొల్పారు. ఇంకా సహకార రంగం పేరుతో సహకార భారతి, పరిశ్రమల్లో పని చేయడానికి ఉద్యోగ భారతి, కళా రంగంలో సంస్కార భారతి వంటి సంస్థల్ని నిర్మించారు. ప్రస్తుతం ఆర్.ఎస్.ఎస్.కు దేశవ్యాప్తంగా 45 లక్షల మంది సభ్యులున్నారు. 50 వేల శాఖలున్నాయి. ఆర్.ఎస్.ఎస్. రాజకీయంగా బీ.జే.పీ.పై ఆధిపత్యం చెలాయిస్తున్నప్పటికీ భావజాలం రీత్యా అనేక ఇతర పార్టీల్లోని నాయకులపై ప్రభావం చూపుతుంది. భక్తి, మతం, ఆధ్యాత్మికత వంటి అంశాలను మాత్రమే కాకుండా జాతీయంగా భావాలను కూడా అడ్డుపెట్టుకొని ఆ పేరుతో చాందస వాదాన్ని రుద్దుతుంది. చరిత్ర, సైన్సు, హెూం, డిఫెన్స్ వంటి అనేక శాఖలలోకి తన వారిని చొప్పించింది. సమయం వచ్చినప్పుడు మత ఉద్రిక్తతలు చెలరేగినప్పుడు మైనారిటీలకు వ్యతిరేకంగా అందరినీ ఏకం చేయడానికి ఇలాంటి సందర్భం వారికి ఉపయోగపడుతుంది. గుజరాత్ మోడీ ప్రయోగాన్ని దేశమంతా అమలు చేసేందుకు దేశవ్యాప్తంగా దాడులు కొనసాగిస్తున్నారు. అణచివేతకు గురౌతున్న అన్ని సెక్షన్ల ప్రజలు నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగమై సాయుధ పోరాటం ద్వారానే బ్రాహ్మణీయ హిందూ మతోన్మాదులను నిర్మూలించగలరు.

**కాశ్మీర్ సమస్య చారిత్రక పూర్వ రంగం**

జమ్ము కాశ్మీర్ భౌగోళిక స్వరూపం చూస్తే భారతదేశానికి తలమానికంగా ఉత్తరాది మణి శిఖరంగా వెలుగొందుతున్న రాష్ట్రం. దీనికి పాకిస్తాన్, చైనాలు సరిహద్దులుగా ఉన్నాయి. ఈ రాష్ట్రంలో మూడు మతాల ప్రజలున్నారు. కాశ్మీర్ లోయలో 95 శాతం ముస్లింలుండగా, జమ్ము ప్రాంతంలో మెజారిటీ హిందూవులు, లడక్‌లో అత్యధికులు బౌద్ధులున్నారు. మొఘులుల కాలంలో అక్బర్ ఈ ప్రాంతాన్ని టర్కీలు నుండి గెలుచుకొని రామచంద్రన్ అనే సైన్యాధిపతిని గవర్నర్‌గా నియమించాడు. మొఘులులు బలహీనపడిన తర్వాత సిక్కు రాజ్యం చేతుల్లోకి పోయింది. ఆ తర్వాత దీన్ని బ్రిటిష్‌వారు ఆక్రమించుకొని 1846లో రాజా హరిసింగ్ (డోగ్రా) వంశస్తులకు 75 లక్షలకు అమ్మేశారు. అప్పటినుండి స్వాతంత్ర్యం వచ్చే వరకు వారు బ్రిటిష్ వారికి లొంగిఉంటూ పాలించారు. ఈ కాలంలోనే జమ్ము, కాశ్మీర్, లడక్ ప్రాంతాలు కలిసి ఒక రాజ్యంగా ఆవిర్భవించాయి. భారత్, పాకిస్తాన్‌ల చీలికల అనంతరం స్వదేశీ సంస్థానాలు ఎటువైపునైనా చేరవచ్చునని ప్రకటించారు. కానీ కాశ్మీర్ రాజు ఎటు చేరకుండా స్వాతంత్రాన్ని ప్రకటించుకున్నాడు.

1947 అక్టోబర్‌లో వాయువ్య సరిహద్దుల నుండి కొన్ని తెగలు పాకిస్తాన్ ప్రోత్సాహంతో కాశ్మీర్‌పై దాడి చేశాయి. వారి నుండి రక్షణ కోరుతూ రాజా హరిసింగ్ భారత ప్రభుత్వ సహాయం అర్థించాడు. దాని కోసం కాశ్మీర్‌ను భారత్‌లో కొన్ని షరతులతో కలపడానికి అంగీకరించాడు. అప్పటికీ రాజ్యాంగం రూపొందలేదు. ఆ తర్వాత రాజ్యాంగంలో మొదట 306 ప్ర. గాను, తుది రూపంలో 370 వ ఆర్టికల్‌గాను రూపం తీసుకుంది. కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఈ ఆర్టికల్‌ను హిందూ రాజైన హరిసింగ్ అధికారంలో ఉన్నంతవరకు నేటి బీ.జే.పీ.కి మూల విరాట్టులైన శ్యాంప్రసాద్ ముఖర్జీ వగైరా నాయకులతో పాటు, ఆర్.ఎస్.ఎస్., హిందూ మహాసభ వగైరా సంస్థలు పూర్తిగా బలపరిచాయి. సర్దార్ వల్లబాయ్ పటేల్ కూడా ఈ ఒప్పందానికి అనుకూలం. అయితే కాశ్మీర్ ప్రజలు రాజుపై తిరుగుబాటు చేసి ఓడించారు. ఐక్యరాజ్యసమితిలో ఇదొక ఎజెండాగా మారింది. కాశ్మీర్‌ను పాకిస్తాన్‌లో కలపడానికి షేక్ అబ్దుల్లా నాయకత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్ వ్యతిరేకం. భారతదేశంలో భాగంగా ఉండాలని అది పోరాడింది. రెండు జాతుల సిద్ధాంతాన్ని అది తిరస్కరించింది. చేసుకున్న ఒప్పందాలను కేంద్రం అమలు చేయకపోవడంతో మళ్లీ తిరుగబడ్డారు. 1951 ఎన్నికల్లో అన్ని స్థానాలు నేసనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) పార్టీ గెలుచుకొంది. దాంతో కాశ్మీర్ సింహంగా పేరు గాంచిన షేక్ అబ్దుల్లాను జైల్లో పెట్టారు. 1974లో ఇందిరాగాంధీ – అబ్దుల్లా ఒప్పందం జరిగేవరకు అంటే 22 సంవత్సరాలు ఆయన జైల్లోనే ఉన్నారు. మళ్లీ జరిగిన ఎన్నికల్లో కూడా నేషనల్ కాన్ఫరెన్స్ గెలిచింది. కాశ్మీర్ ప్రజల ప్రతినిధిగా నేషనల్ కాన్ఫరెన్స్ రూపుదిద్దుకుంది.

**(మిగతాది 28వ పేజీలో)**

# పార్టీలో తప్పుడు అభిప్రాయాలను సరిదిద్దుట

మావో, డిసెంబరు 1929

నాల్గవ ఎర్రసైన్యంలోని పార్టీ నిర్మాణంలో కార్మికవర్గేతర ధోరణులు చాలా బలంగా వున్నాయి. పార్టీ సరైన పంథాను అమలు పరుచుటకు ఇవి అడ్డు వస్తున్నాయి. ఈ ధోరణులను సంపూర్తిగా సరిదిద్దలేకపోతే, చైనా విప్లవ పోరాటంలో 4వ ఎర్రసైన్యానికి ఇవ్వబడిన కర్తవ్యాలను, అది నిర్వహించజాలదు. పార్టీ ఎర్రసైన్యంలోని 4వ సైన్యం 9వ కాంగ్రెసుకు, కామ్రేడ్ మావో-సే-టుంగు సమర్పించిన తీర్మానమే ఈ వ్యాసం. చైనా ప్రజా సైన్యాన్ని నిర్మించడం చాలా కష్టమయిన మార్గంలో నడిచింది, చైనా ఎర్రసైన్యంలో (జపాన్ వ్యతిరేక పోరాటంలో 8వ రూట్ సైన్యంగానూ, కొత్త 4వ సైన్యంగాను మారింది. ఇపుడు ప్రజావిముక్తి సైన్యంగా పిలువబడుతూ వుంది.) నాంచాంగు తిరుగుబాటులో ఆగస్టు 1,1927లో స్థాపించబడింది. డిసెంబరు 1929 నాటికి ఎర్రసైన్యానికి రెండు సంవత్సరాల వయస్సు నిండింది. ఈ కాలంలో ఎర్ర సైన్యంలోని కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం తప్పుడు అభిప్రాయాలు ఎదుర్కొనడంలో చాలా అనుభవం సంపాదించింది. ఈ అనుభవాన్ని తీర్మానం సమీక్షించింది. ఇది ఎర్ర సైన్యం మార్క్సిస్టు-లెనినిస్టు ప్రాతిపదికపై నిర్మాణం కావటానికి తోడ్పడింది. పాత సైన్యాల ధోరణులను ఎర్ర సైన్యం నుండి తొలగించుటకు తోడ్పడింది. 4వ సైన్యంలోనే కాకుండా, ఇతర ఎర్ర సైన్యం విభాగాల్లో కూడా దీనిని విజయవంతంగా అమలు జరిపారు. ఈ పద్ధతి ద్వారా ఎర్రసైన్యం అన్ని విధాలా నిజమయిన ప్రజాసైన్యంగా రూపొందింది. గత 30 సంవత్సరాల కాలంలో చైనా ప్రజాసైన్యం పార్టీ కార్యక్రమాల్లో, రాజకీయ కార్యక్రమాల్లో బ్రహ్మాండంగా అభివృద్ధి చెందింది. నూతన పద్ధతులను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం మరొక నూతన దశకు చేరుతుంది. కానీ ఈ తీర్మానంలోని పంథా ఈ నాటికి చైనా ప్రజా సైన్యంలో పునాదిగా వుంది.

నిర్మాణంలోని ఈ తప్పుడు అభిప్రాయాలకు మూలం, దీని యొక్క పునాది యూనిట్లలో, రైతులు, పెటీ బూర్జువా స్వభావం కలిగిన వారితో నిండి వుండటమే. పార్టీ నాయకత్వ సంస్థలు తప్పుడు ధోరణులకు వ్యతిరేకంగా నిశ్చయాత్మక పోరాటం తగినంతమేరకు జరుపకపోవటం, సరైన పార్టీ పంథా గురించి సభ్యులకు గట్టి రాజకీయ శిక్షణ ఇవ్వలేకపోవటం కూడా, ఈ తప్పుడు ధోరణులు వుండడానికి దోహదం చేస్తున్నది. కేంద్ర కమిటీ సెప్టెంబరు లేఖ సూచనల ప్రాతిపదికపై నాల్గవ సైన్యంలోని తప్పుడు ధోరణులను, వాటి మూలకారణములను, వాటిని సరిదిద్దే పద్ధతులను, ఈ కాంగ్రెసు సూచిస్తుంది. వీటిని తొలగించుటకు ప్రతి పార్టీ సభ్యుడు పట్టుదలతో కృషి చెయ్యాలని కోరుతూ వుంది.

### శుద్ధ మిలటరీ దృక్పథం

ఎర్రసైన్యంలో, కొంతమంది పార్టీ సభ్యుల్లో శుద్ధ మిలిటరీ దృక్పథం బలంగా పాతుకుని వుంది. అది ఈ కింది విధంగా ప్రతిబింబించుతూ వుంది.

1. వీరి దృష్టిలో మిలిటరీ వ్యవహారాలు, రాజకీయాలు, పరస్పర వ్యతిరేకమయినవి. రాజకీయ లక్ష్యాలు సాధించడానికి మిలిటరి చర్యలు ఒక సాధనం మాత్రమేనన్న వాస్తవాన్ని వీరు గుర్తించరు. కొంతమంది ఇలా వాదించుతూ వుంటారు కూడా: "మిలిటరీ వ్యవహారల్లో నీవు సిద్ధహస్తుడవయితే; రాజకీయాల్లో కూడా నీవు సిద్ధహస్తుడవయినట్లే; మిలిటరీ వ్యవహారాల్లో నీవు సిద్ధహస్తుడవు కాకపోతే, రాజకీయాల్లో కూడా నీవు సిద్ధహస్తుడవు కానట్లే". దీనితో వీరు ఒకడుగు ముందుకువేసి, రాజకీయాలపైన మిలిటరీ వ్యవహారాలకు నాయకత్వం ఇస్తున్నారన్నమాట.

2. దోపిడి వర్గ ప్రభుత్వ సైన్యంలాగే, ఎర్రసైన్యం కర్తవ్యం కూడా కేవలం యుద్ధం చేయడమేనని వారి అభిప్రాయం. చైనా ఎర్ర సైన్యం విప్లవం యొక్క రాజకీయ కర్తవ్యాలను సాధించడానికేర్పడిన సాయిధ సంస్థ అని వారు అర్థం చేసుకోరు. ప్రత్యేకంగా, ప్రస్తుత పరిస్థితుల్లో ఎర్రసైన్యం కేవలం యుద్ధానికి పరిమితమై వుండడానికి వీలులేదు. శత్రువు యొక్క మిలిటరీ శక్తిని ధ్వంసం చేయడానికి, ఒకవైపు యుద్ధం కొనసాగిస్తూనే, మరొకవైపు రాజకీయ కర్తవ్యాలను నిర్వహించవలసి వుంది. ప్రజల్లో ప్రచారం, ప్రజలను ఆర్గనైజ్ చేయడం, ప్రజలను సాయుధం చేయడం, విప్లవ రాజకీయాధికారం స్థాపించుటకు ప్రజలకు సహాయం చేయడం, పార్టీ నిర్మాణ సంస్థల నేర్పరచడం - ఇలాంటి ముఖ్యమయిన రాజకీయ కర్తవ్యాలు నిర్వహించవలసి వుంది. ఎర్రసైన్యం కేవలం పోరాటం కొరకు పోరాటం సాగించటం లేదు. ప్రజలో ప్రచారం, ప్రజలను ఆర్గనైజు చేయడం, ప్రజలను సాయుధం చేయడం, రాజకీయాధికారాన్ని స్థాపించుటకు ప్రజలకు సహాయం చేయటం - ఇలాంటి కర్తవ్యాలు నిర్వహించుటకు పోరాటం చేస్తుంది. ఈ లక్ష్యాలు లేకుండా, పోరాటానికి అర్థం లేదు. ఎర్రసైన్యం యొక్క అస్థిత్వానికి అర్థం లేదు.

3. తత్ఫలితంగా, నిర్మాణంలో, ఎర్రసైన్యంలో రాజకీయ కర్తవ్యాలు నిర్వహించే విభాగాల కంటే మిలిటరీ కర్తవ్యాలు నిర్వహించే విభాగాలకు వీరు ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తారు. "సైన్య కేంద్ర కార్యాలయం బయటి విషయాలు నిర్ణయించనివ్వండి" అని వారు వాదించుతూ వుంటారు. ఈ ధోరణి పెరిగితే ప్రజల నుండి దూరం కావడం ప్రభుత్వాన్ని సైన్యం కంట్రోలు చేయడం, కార్మికవర్గ నాయకత్వ పంథాకు దూరం కావడం లాంటి ప్రమాదాలున్నా కొమింటాంగు సైన్యంలాగే, సైనిక ప్రభువుల పంథా చేపట్టే ప్రమాదముంది.

4. అదే సమయంలో ప్రచార కార్యక్రమంలో, ప్రచారక దళాల ప్రాముఖ్యతను వీరు నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రజాసంస్థల నిర్మాణ విషయంలో సైన్యంలో సైనిక కమిటీల నిర్మాణం, స్థానిక రైతులను; కార్మికులను సంఘాల్లో సమీకరించడం లాంటి పనులు వీరు నిర్లక్ష్యం చేస్తున్నారు. తత్ఫలితంగా ప్రచార కార్యక్రమం, నిర్మాణ కార్యక్రమం వదిలి వేయబడ్డాయి.

5. ఒక యుద్ధంలో గెలిస్తే వీరు గర్వంతో వుప్పొంగిపోతారు. ఒక్క యుద్ధంలో దెబ్బతింటే నిరుత్సాహపడుతారు.

6. స్వార్థపూరితమైన ఆలోచనలకు లొంగుతారు. వీరు 4వ ఎర్ర సైన్యాన్ని గురించి మాత్రమే ఆలోచించుకుంటారు. ప్రజలను సాయుధం చేయటం ఎర్రసైన్యం యొక్క ప్రధాన కర్తవ్యమని వీరు గుర్తించరు. ఇది అతి స్పష్టంగా కనపడే సంకుచిత గ్రూపు మనస్తత్వం.

7. 4వ ఎర్రసైన్యంలోనున్న పరిమితమైన సరిహద్దులను దాటి చూడనందువల్ల, కొంతమంది కామ్రేడ్స్, తాముగాక ఇతర విప్లవ సైన్యం వున్నదని గుర్తించడంలేదు. అందువల్లే వీరు పోరాటాలు తప్పించుకుని, బలాన్ని కాపాడుకోవాలనే ధోరణి వ్యక్తం చేస్తుంటారు. ఇది అవకాశవాదం యొక్క అవశేషం మాత్రమే.

8. కొంతమంది కామ్రేడ్స్ భౌతిక పరిస్థితులు, స్వీయాత్మక పరిస్థితులు దృష్టిలో వుంచుకోకుండా, విప్లవ అసహనాన్ని ప్రదర్శించుతూ వుంటారు. ప్రజల్లోనికి లోతుగా వెళ్లి, చిన్న చిన్న పనులు చేయడానికి నిరాకరిస్తూ, లేనిపోని భ్రమలు పెట్టుకుని, పెద్ద చర్యలు మాత్రమే చేయాలని కోరతారు. ఇది దుందుడుకు పద్ధతుల అవశేషం.

**శుద్ధ మిలటరీ దృక్పథానికి ఈ కిందివి మూలకారణములు:**

1. చాలా తక్కువ రాజకీయ స్థాయి: దీనివల్ల సైన్యంలో రాజకీయ నాయకత్వం యొక్క పాత్రను గుర్తించుటలో విఫలులవుతారు. ఎర్రసైన్యం, దోపిడీవర్గ ప్రభుత్వ సైన్యం ఈ రెండు సైన్యాలకు ప్రాథమికమైన భేదాలున్నవని గుర్తించలేరు.

2. జీత, భత్యం కొరకు పనిచేసే మనస్తత్వం: గత యుద్ధాల్లో మన చేతికి చిక్కిన చాలా మంది శత్రు సైనికులు ఎర్ర సైన్యంలో చేరారు. వీరు తమతోపాటు జీతభత్యాల కొరకు పని చేసే మనస్తత్వాన్ని ఎర్ర సైన్యంలోనికి మోసుకొని వచ్చారు. ఆ విధంగా ఎర్ర సైన్యంలో కిందస్థాయిలో కేవలం మిలిటరీ దృక్పథానికి పునాది ఏర్పడింది.

3. పై రెండు కారణాలు, మూడవ కారణానికి దారి తీసింది. మిలిటరీ బలంపై అతి విశ్వాసం వుంచి, ప్రజాస్వామ్యం యొక్క శక్తిపై విశ్వాసం పోగొట్టుకుంటారు.

4. మిలిటరీ కార్యక్రమాన్ని గురించి పార్టీ తగు శ్రద్ధ తీసుకోకపోవటం, చర్చించకపోవడం వల్ల కూడా, చాలా మంది సభ్యుల్లో శుద్ధ మిలిటరీ దృక్పథం ఏర్పడటానికి ఒక కారణం.

**ఈ కింది పద్ధతుల ద్వారా ఈ తప్పును సరిదిద్దవలసి వుంది:**

1. రాజకీయ శిక్షణ ద్వారా పార్టీలో రాజకీయ స్థాయి పెంచాలి. తద్వారా శుద్ధ మిలిటరీ దృక్పథానికి సిద్ధాంత పునాది లేకుండా చేయాలి. ఎర్ర సైన్యానికి-తెల్ల సైన్యానికి (దోపిడీవర్గ ప్రభుత్వ సైన్యం-అనువాదకుడు) మధ్య వున్న ప్రాథమిక విభేదాన్ని స్పష్టంగా గుర్తించాలి. అదే సమయంలో, అవకాశవాదం, దుందుడుకువాదం యొక్క అవశేషాలను తొలగించాలి. నాల్గవ సైన్యంలోని స్వార్థపూరిత ఆలోచనను నిర్మూలించాలి.

2. ఆఫీసర్ల యొక్క, సైనికుల యొక్క ముఖ్యంగా శత్రువు నుండి ఖైదీలుగా పట్టుకున్న సైనికుల యొక్క, రాజకీయ శిక్షణను తీవ్రపరచాలి. అదే సమయంలో పోరాటాల్లో అనుభవం పొందిన కార్మికులను, రైతులను ఏరుకొనుటకు స్థానిక ప్రభుత్వాలకు స్వేచ్ఛనివ్వాలి. ఆవిధంగా, శుద్ధ మిలిటరీ దృక్పథాన్ని నిర్మాణరీత్యా బలహీనపర్చాలి. సంపూర్తిగా రద్దు చేయాలి.

3. ఎర్రసైన్యంలో పార్టీ సంస్థలను విమర్శించుటకు, పార్టీ సంస్థలను ప్రోత్సహించాలి. ప్రజా రాజకీయాధికార సంస్థలు ఎర్ర సైన్యాన్ని కూడా విమర్శించుటకు ప్రోత్సహించాలి. తద్వారా ఎర్రసైన్యంలోని పార్టీ సంస్థలను, ఆఫీసర్లను, సైనికులను, ప్రజలచేత ప్రభావితులను చెయ్యాలి.

4. పార్టీ మిలిటరీ కార్యక్రమంపై శ్రద్ధ వహించి తీవ్రంగా చర్చించాలి. పార్టీ కార్యక్రమం సాధారణ సభ్యులచేత అమలు జరుపబడేముందు, పార్టీలో చర్చించబడి, నిర్ణయించబడాలి.

5. ఎర్రసైన్యం యొక్క కర్తవ్యాలను నిర్దేశించుతూ స్పష్టమయిన రూల్సు, రెగ్యులేషన్సు తయారు చేయాలి, మిలిటరీ, రాజకీయ విభాగాల, సంబంధాలను స్పష్టపరచాలి. ఎర్రసైన్యానికి, ప్రజలకు మధ్య వుండవలసిన సంబంధాలను, సైనిక కమిటీల యొక్క అధికారాలను, విధులను, సైనిక కమిటీలకు మిలిటరీ, రాజకీయ విభాగాలతో వుండవలసిన సంబంధాలను స్పష్టపరచాలి.

**అతి ప్రజాస్వామికం**

కేంద్ర కమిటీ సూచనను ఎర్ర సైన్యంలోని 4వ సైన్యం అంగీకరించినప్పటి నుండి, అతి ప్రజాస్వామికం యొక్క చిహ్నాలు చాలావరకు తగ్గాయి. ఉదాహరణకు ప్రస్తుతం పార్టీ నిర్ణయాలు దాదాపు పూర్తిగా అమలు జరుపబడుతున్నాయి. ఎర్ర సైన్యం "కేంద్రీకృత ప్రజాస్వామికాన్ని కింది నుండి పైకి అమలు జరపాలనే. కింది యూనిట్లు అన్ని సమస్యలు చర్చించిన తర్వాతనే పై యూనిట్లు నిర్ణయాలు చెయ్యాలి" అనే తప్పుడు కోర్కెలు ప్రస్తుతం ఎవరూ కోరటంలేదు. అయితే, వాస్తవంలో, అతి ప్రజాస్వామిక ధోరణులు తగ్గటం అనేది ఇప్పటికీ నామమాత్రంగానే వుంది. అది కూడా చాలా తాత్కాలికం. అతి ప్రజాస్వామిక ధోరణులు ఇప్పటికే, పూర్తిగా నిర్మూలించబడ్డాయని దీనర్థం ఎంతమాత్రం కాదు. మరొకమాట చెప్పాలంటే అతి ప్రజాస్వామిక ధోరణులు చాలా మంది పార్టీ సభ్యుల్లో చాలా బలంగా నాటుకొని వున్నాయి. పార్టీ నిర్ణయాలను అమలుపరచడానికి అనేక సందర్భాలలో కానవస్తున్న విముఖత దీనినే రుజువు పరుస్తూ వుంది.

**ఈ తప్పుడు ధోరణిని ఈ కింది పద్ధతుల ద్వారా సరిదిద్దాలి:**

1. సిద్ధాంత రంగంలో, అతి ప్రజాస్వామికం యొక్క పునాదులు నిర్మూలించాలి. మొట్ట మొదట అతి ప్రజాస్వామికం పార్టీ సంస్థలను బలహీనపరుస్తుందని లేక పూర్తిగా ధ్వంసం చేస్తుందని, పోరాట కర్తవ్యాలను నిర్వహించటంలో పార్టీ తన శక్తిని కోల్పోయేలాగు చేస్తుందని, తద్వారా విప్లవమే విఫలమవుతుందని స్పష్టపరచాలి. రెండవది- క్రమశిక్షణను ధిక్కరించే పెటీ బూర్జువా అహంకారమే, అతి ప్రజాస్వామికానికి పునాది అన్న విషయాన్ని స్పష్టపరచాలి. ఈ స్వభావం పార్టీలో ప్రవేశించినపుడు రాజకీయంగా, నిర్మాణరీత్యా, పార్టీలో అతి ప్రజాస్వామిక ధోరణులు తలయెత్తుటకు దోహదం చేస్తుంది. కార్మికవర్గ పోరాట కర్తవ్యాలకు, ఈ అతి ప్రజాస్వామిక ధోరణులకు ఎలాంటి పొత్తు పొసగదు.

2. నిర్మాణ రంగంలో కేంద్రీకృత నాయకత్వం కింద ప్రజాస్వామికాన్ని ఖచ్చితంగా అమలుపర్చాలి. కింది పద్ధతుల ద్వారా ఈ బాధ్యతలు నిర్వహించాలి.

1) సమస్యలు తలెత్తినపుడు వాటికి సరైన పరిష్కార మార్గాలు చూపించి, సరైన పంథా అమలు జరిపించడానికి పార్టీ నాయకత్వ సంస్థలు బాధ్యత వహించాలి. ఆ విధంగా అవి నాయకత్వ కేంద్రాలుగా పని చేయాలి.

2) ప్రజా జీవితాన్ని గురించి, కింది సంస్థల పరిస్థితిని గురించి, పై కమిటీలు సంపూర్తిగా తెలుసుకుని వుండాలి. పై కమిటీలు సరైన

సూచనలివ్వడానికి కావలసిన చక్కటి భౌతిక పునాది అపుడే లభించగలదు.

3) సమస్యలను పరిష్కరించటంలో, ఏ స్థాయిలో కూడా పార్టీ కమిటీలు యధాలాప నిర్ణయాలు చెయ్యకూడదు. ఒక సమస్యపై నిర్ణయం చేయబడిన తర్వాత దానిని ఖచ్చితంగా అమలుపరచాలి.

4) పార్టీ నాయకత్వ సంస్థలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్న వెంటనే సాధారణ పార్టీ సభ్యులకు, కింది సంస్థలకు తెలియజేయాలి. పార్టీ కర్తవ్యాల సమావేశాల ద్వారా, లేక జనరల్ బాడీ సమావేశాల ద్వారాగాని లేక ఒక కాలమ్ సైనిక విభాగాలకు చెందిన ముఖ్య కార్యకర్తల లేక పార్టీ సభ్యుల జనరల్ బాడీ మీటింగ్‌లు జరిపి (పరిస్థితులు అనుకూలించినపుడు) పై కమిటీల నిర్ణయాలు తెలియజేయాలి. అటువంటి సమావేశాలకు ఎవరు రిపోర్టు చేయాలో ముందుగానే నిర్ణయించుకుని వుండాలి.

5) సాధారణ పార్టీ సభ్యులు, పార్టీ కింద సంస్థలు, పైకమిటీల సూచనలు వివరంగా చర్చించి వాటిని అమలుజరిపే పద్ధతులు నిర్ణయించుకోవాలి.

### నిర్మాణ క్రమశిక్షణ యెడల నిర్లక్ష్యం

నాల్గవ సైన్యంలో పార్టీ నిర్మాణంలో క్రమశిక్షణారాహిత్యం ఈ కింది విధంగా ప్రతిబింబించుతూ వుంది.

మెజారిటీ నిర్ణయాలకు, మైనారిటీ కట్టుబడి వుండకపోవటం. ఉదాహరణకు మైనారిటీ తన తీర్మానం ఓడిపోయినపుడు, మెజారిటీ నిర్ణయాన్ని మన స్ఫూర్తిగా అమలు జరుపుటకు పూనుకోరు.

**ఈ తప్పుడు ధోరణిని ఈ కింది విధముగా సరిదిద్దాలి:**

1. మీటింగుల సందర్భంలో ప్రతి ఒక్కరూ తన అభిప్రాయాన్ని పూర్తిగా చెప్పుటకు ప్రోత్సహించాలి. ఏ తగాదాంశాలలోనైనా భిన్నాభిప్రాయాలను రాజీపడకుండా, స్పష్టంగా వివరించాలి. పార్టీ పనికి నష్టం రాకుండా వుంటే, ఒక సమావేశంలో సరైన నిర్ణయానికి రాలేకపోతే, తిరిగి మీటింగులు జరుపుకుని సరైన నిర్ణయాలకు రావాలి.

2. మైనారిటీ, మెజారిటీ నిర్ణయానికి కట్టుబడి వుండడమనేది క్రమశిక్షణలో ముఖ్యాంశం. మైనారిటీ అభిప్రాయం నిరాకరించబడిన తర్వాత, వారు మెజారిటీ నిర్ణయాన్ని బలపర్చాలి. అవసరమైతే, తర్వాత సమావేశంలో దీనిని చర్చకు తీసుకురావచ్చుగాని, ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా ఎలాంటి చర్య తీసుకోగూడదు.

**నిర్మాణ క్రమశిక్షణను దృష్టిలో వుంచుకోకుండా విమర్శించే పద్ధతి;**

1. ఆంతరంగిక విమర్శ పార్టీ నిర్మాణాన్ని, పార్టీ పోరాట శక్తిని పెంచుకోవడానికి ఉపయోగించాలి. ఎర్ర సైన్యానికి చెందిన పార్టీ సంస్థలలో ఆంతరంగిక విమర్శ ఎల్లప్పుడూ ఈ పద్ధతిన వుండటంలేదు. కొన్ని సందర్భాలలో వ్యక్తులపై దాడి రూపం తీసుకుంటూ వుంది. తత్ఫలితంగా ఇలాంటి విమర్శ పార్టీ నిర్మాణానికి, వ్యక్తులకు నష్టకరంగా తయారవుతుంది. పెటీబూర్జువా వ్యక్తిగత విధానానికి అది చిహ్నం. ఈ తప్పుడు పద్ధతిని సరిదిద్దాలంటే, వర్గ పోరాటంలో విజయం సాధించడానికి పార్టీ పోరాట పటిమను పెంచుకోవడమే, విమర్శ యొక్క ప్రధానోదేశ్యమని, వ్యక్తిగత దాడికి విమర్శను ఒక సాధనంగా తీసుకోకూడదని, పార్టీ సభ్యులందరూ గుర్తించేటట్లు చేయాలి.

2. చాలా మంది పార్టీ సభ్యులు తమ విమర్శను పార్టీ లోపలగాక, వెలుపల చేస్తుంటారు. వారు పార్టీ నిర్మాణం యొక్క (పార్టీ మీటింగులు మొదలగునవి) ప్రాముఖ్యతను గ్రహించకపోవడమూ, పార్టీ లోపల చేసే విమర్శకూ, బయటచేసే విమర్శకూ గల భేదాన్ని చూడకపోవటం దీనికి కారణాలు. ఈ తప్పుడు పద్ధతిని సరిదిద్దాలంటే, పార్టీ సభ్యులందరూ, పార్టీ నిర్మాణం యొక్క ప్రాముఖ్యతను అర్థం చేసుకునేటట్లు, పార్టీ కమిటీలపైగాని, సభ్యులపైగాని పార్టీ మీటింగులలోనే విమర్శ కొనసాగించాలని పార్టీ సభ్యులకు రాజకీయ శిక్షణ ఇవ్వాలి.

### సంపూర్ణమైన సమానత్వం

ఒక దశలో ఎర్ర సైన్యంలో సంపూర్ణమైన సమానత్వం తీవ్రమయిన సమస్యగా తయారైంది. కింది ఉదాహరణలు చూడండి. గాయపడిన సైనికులకు అలవెన్సులు ఇవ్వటంలో తీవ్రంగా గాయపడినవారికి ఎక్కువ అలవెన్సు, తక్కువ గాయపడిన వారికి తక్కువ అలవెన్సు ఇవ్వాలనే పద్ధతిని తీవ్రంగా వ్యతిరేకించారు. అందరికి సమాన అలవెన్సు ఇవ్వాలని కోరారు. అధికారులు గుర్రాలపై ప్రయాణం చేసినపుడు, వారు బాధ్యతలు నిర్వహించడానికి, అలా చేయవలసి వుందని గుర్తించడం కాకుండా, పై అధికారులకు ఎక్కువ సదుపాయాలు కల్గించుకున్నట్లుగా భావించారు. అందరికి వస్తువులు సమానంగా సప్లయి చేయాలని డిమాండు చేశారు. ప్రత్యేక పరిస్థితుల్లో, కొంత ఎక్కువ సప్లయిలు ఇవ్వడాన్ని వ్యతిరేకించారు. ఆహార ధాన్యాలు మోసుకుపోవడంలో, వయసుబట్టిగానీ, శారీరక శక్తినిబట్టిగాని తేడా చూడకుండా అందరూ సమానంగా మోయాలని కోరడం జరిగింది. గృహ వసతి అందరికీ సమానంగా వుండాలని కోరారు. కేంద్ర కార్యాలయం పెద్ద గదులను ఆక్రమించుకున్నదని విమర్శించారు. అలసట వచ్చే పనులు అందరికి సమానంగా పంచాలని డిమాండు చేశారు. పక్కవారికంటే కొంచెం ఎక్కువ పని చేయడానికి కూడా ఇష్టపడేవారు కాదు. పరిస్థితి ఎంత దూరం వెళ్లిందంటే, ఇద్దరు గాయపడిన సైనికులకు, ఒకరినే మోసుకుపోయే వాహనం వున్నపుడు, ఒకరిని ముందు మోసుకుపోవటానికి రెండవ వారు అంగీకరించకపోవటంతో, ఇద్దరినీ మోసుకుపోకూడదని వాదించేవారు. పై ఉదాహరణలనుబట్టి అధికారులు, సైనికుల్లో సంపూర్ణ సమానత్వం ధోరణులు ఇంకా బలంగా వున్నాయని స్పష్టమగుతూ వుంది.

రాజకీయ వ్యవహారాల్లో అతి ప్రజాస్వామికంలాగనే, సంపూర్ణ సమానత్వ ధోరణి కూడా, చేతి వృత్తుల, చిన్న రైతుల ఆర్థిక విధానం నుండి ఉత్పన్నమయిందే. తేడా అంతా, ఒకటి రాజకీయాల్లో ప్రతిబింబించితే, మరొకటి వస్తువుల, సౌకర్యాల విషయంలో ప్రతిబింబించుతూవుంది.

దీనిని ఈ కింది విధంగా సరిదిద్దుకోవాలి. పెట్టుబడిదారీ విధానం రద్దుగాకుండా, సంపూర్ణమైన సమానత్వం సాధించుతామని భావించటం, చిన్న ఉత్పత్తిదారులయిన రైతుల భ్రమలు మాత్రమే. సోషలిస్టు వ్యవస్థలో కూడా సంపూర్ణమయిన సమానత్వం అసాధ్యం ఎందుకంటే సోషలిస్టు వ్యవస్థలో కూడా "శక్తికొద్ది శ్రమ, శ్రమకు తగ్గ ప్రతిఫలం" అనే సూత్రాలపై ఆధారపడి మాత్రమే భౌతిక వస్తువుల పంపిణీ జరుగుతుంది. ఎర్ర సైన్యంలో ఆఫీసర్లకు, సైనికులకు సమాన జీతంలాగే, భౌతిక వస్తువులు దాదాపు సమానంగా పంచాలి. ప్రస్తుత పోరాట పరిస్థితిని బట్టి ఇది తప్పదు. హేతుబద్ధంకాని సంపూర్ణ సమానత్వాన్ని వ్యతిరేకించాలి. మన పోరాటానికి తోడ్పడదు. పైగా

పోరాటానికి నష్టం కూడా తెస్తుంది.

### స్వీయమానసికతత్వం

కొంతమంది పార్టీ సభ్యులలో వ్యక్తిగత పని విధానం తీవ్రంగానే వుంది. రాజకీయ పరిస్థితి పరిశీలనకుగానీ, సరైన సూచన లివ్వడానికిగాని ఈ ధోరణి నష్టకరంగా పరిణమించుతూ వుంది. రాజకీయ పరిస్తితినిగూర్చి స్వీయ మానసిక పరిశీలన చేయడం, కార్యక్రమాన్ని స్వీయమానసిక ధోరణిలో నడపడం, అవకాశ వాదానికిగానీ, లేక దుస్సాహసిక విధానానికి తప్పకుండా దారి తీస్తుంది. వ్యక్తిగత విమర్శ, ఆధారరహితమయిన విచ్చలవిడి విమర్శ, అనుమానాలు ఇలాంటి పద్ధతులు పార్టీలో సూత్రరహిత తగాదాలకు దారి తీసి పార్టీ నిర్మాణాన్ని బలహీనపరుస్తాయి.

పార్టీ ఆంతరంగిక విమర్శ సందర్భంలో, మరొక విషయం కూడా చెప్పవలసి వుంది. కొంతమంది కామ్రేడ్స్ విమర్శ చేసే సందర్భంలో ముఖ్యమైన సమస్యలు వదలివేసి, చిన్న విషయాలకు ఎక్కువ ప్రాముఖ్యతయిస్తూ వుంటారు. విమర్శ యొక్క ప్రధానోద్దేశ్యం, రాజకీయ నిర్మాణ తప్పులు ఎత్తిచూపాలనే విషయాన్ని వీరు మరచిపోతూ వుంటారు. వ్యక్తిగత బలహీనతల గురించి, రాజకీయ నిర్మాణ తప్పులతో వాటికి సంబంధం వుంటే తప్ప, అలాంటి తప్పు చేసినవారి యెడల అతి విమర్శ చేయటంగాని, ఆ కామ్రేడ్ బాధపడేలాగు ప్రవర్తించడం గాని తప్పవుతుంది. అలాంటి విమర్శ ఒకసారి ప్రారంభమయిన తర్వాత పార్టీ సభ్యులు పూర్తిగా చిన్న చిన్న తప్పులపైననే కేంద్రీకరించే ప్రమాదముంది. అపుడు ప్రతి పార్టీ సభ్యుడు భయానికిలోనై, తప్పులు జరుగుతాయనే భయంకొద్దీ, పార్టీ రాజకీయ కర్తవ్యాలు మరచిపోయే ప్రమాదముంది.

దీనిని సరిదిద్దడానికి, పార్టీ సభ్యుల ఆలోచనలలో, పార్టీ జీవితంలో, రాజకీయ శాస్త్రీయ దృక్పథం అభివృద్ధి చెందేటట్లు, పార్టీ సభ్యులకు రాజకీయ శిక్షణ ఇవ్వాలి. దీనిని సాధించడానికి 1) రాజకీయ పరిస్థితిని పరిశీలించటంలో, వర్గ శక్తుల బలా బలాలను అంచనావేసుకోవడంలో, వ్యక్తిగత వూహాగానంపై ఆధారపడకుండా, మార్క్సిస్టు–లెనినిస్టు పద్ధతిని అమలు పరచుటకు పార్టీ సభ్యులకు శిక్షణ ఇవ్వాలి. 2) సాంఘిక, ఆర్థిక పరిస్థితులను పరిశీలించడం, అధ్యయనం చేయడం నేర్పాలి. తద్వారానే, సరైన పోరాట ఎత్తుగడలను పోరాట విధానాన్ని నిర్ణయించగల్గుతాం. వాస్తవ పరిస్థితులను గురించి సరైన పరిశీలన లేకపోతే, ఊహాగానంపై ఆధారపడి బురదగుంటలోకి లేక దుందుడుకు వాదానికి వెళ్లే ప్రమాదముందని, పార్టీ సభ్యులు గుర్తించేలాగు చెయ్యాలి. 3) పార్టీ ఆంతరంగిక విమర్శ విషయంలో, స్వీయాత్మక మానసిక ధోరణి, నిరంకుశత్వం, విమర్శనా అవకాశాన్ని దుర్వినియోగపర్చటం లాంటి తప్పులు దొర్లకుండా చూడాలి. వాస్తవ విషయాలపై స్టేట్‌మెంట్లు ఆధారపడి వుండాలి. విమర్శ రాజకీయాలపై కేంద్రీకరించి వుండాలి.

### వ్యక్తితత్వవాదం

ఎర్రసైన్యలోని, పార్టీ నిర్మాణంలోని వ్యక్తిగత పని విధానం ఈ కింది విధంగా ప్రతిబింబించుతూ వుంది.

1. కక్ష సాధింపు: కొంత మంది కామ్రేడ్లు పార్టీ మీటింగులలో తమను విమర్శించిన పార్టీ సభ్యులపై మీటింగు వెలుపల కక్ష సాధించుటకు పూనుకోవడం, అతనిని దూషించడమో, కొట్టడమో జరుగుతుంది. పార్టీ లోపల కూడా కక్ష సాధించుటకు ప్రయత్నిస్తారు. "ఈ మీటింగులో నన్ను విమర్శించావు– తర్వాత మీటింగులో నీ పని నేను పడతాను" అనే ధోరణితో వ్యవహరిస్తారు. కేవలం వ్యక్తి గత ఆలోచనా ధోరణుల వల్లనే, ఇలాంటి పగ సాధింపు ధోరణి వస్తుంది. మొత్తం పార్టీ యొక్క, వర్గం యొక్క ప్రయోజనాలకు ఇది నష్టకరం. వీరి దాడికి గురయ్యేది శత్రువు కాదు, మన పార్టీలోని వ్యక్తులు మాత్రమే. ఈ ధోరణి మన నిర్మాణాన్ని బలహీనపరుస్తుంది. మన పోరాట శక్తిని క్షీణింప చేస్తుంది.

2. చిన్న గ్రూపు మనస్తత్వం: మొత్తం పార్టీ ప్రయోజనాలను దృష్టిలో వుంచుకోకుండా తమ చిన్న గ్రూపు ప్రయోజనాలు మాత్రమే దృష్టిలో వుంచుకుని, కొందరు కామ్రేడ్స్ వ్యవహరిస్తూ వుంటారు. పైకి చూస్తే, ఇక్కడ వ్యక్తిగత ప్రయోజనాలకు పాటుపడుతున్నట్లుగా మన కగుపడదు. కాని ఇది చాలా సంకుచితమయిన వ్యక్తిగత ఆలోచన. పార్టీలో విచ్ఛిన్నకర ధోరణులు తల ఎత్తుటకు ఇది దారి తీస్తుంది. ఎర్ర సైన్యంలో "చిన్న గ్రూపు" మనస్తత్వం బలంగానే వుండేది. విమర్శ ద్వారా కొంత అభివృద్ధి వచ్చిన మాట వాస్తవమే. కాని దాని అవశేషాలు ఇంకా వున్నాయి. దానిని పూర్తిగా నిర్మూలించుటకు ఇంకా కృషి చేయవలసి వుంది.

3. గుమస్తా మనస్తతత్వం: కొంత మంది కామ్రేడ్లు, తాము సభ్యులుగా వున్న ఎర్రసైన్యం, కమ్యూనిస్టు పార్టీ, విప్లవ కర్తవ్యాలు సాధించే సాధనాలని అర్థం చేసుకోరు. తాము కూడా విప్లవాన్ని సాధించే నిర్మాతలమని గుర్తించరు. విప్లవం యెడల తమకు బాధ్యతవుందని గుర్తించకుండా, కేవలం తమ పై ఆఫీసర్లకు మాత్రమే బాధ్యులమని భావించుతు వుంటారు. విప్లవం యెడల ఇలాంటి "గుమస్తా" "స్తబ్ధ" మనస్తత్వం వ్యక్తిగత ఆలోచనా విధానానికి చిహ్నం మాత్రమే. విప్లవం కొరకు ఎలాంటి షరతులు లేకుండా, సంపూర్తిగా పనిచేసే కార్యకర్తలు లేకపోవడానికి ఇదే కారణం. దీనిని నిర్మూలించకుండా, కార్యకర్తల సంఖ్య పెరగదు. తత్ఫలితంగా విప్లవం యొక్క బరువు బాధ్యతలంతా కొద్ది మంది కార్యకర్తల భుజస్కందాలపై మాత్రమే వుంటుంది. ఇది పోరాటానికి చాలా నష్టం.

4. సుఖాన్వేషణ: ఎర్ర సైన్యంలో సుఖాన్వేషణకు పాటుబడేవారు. తగిన సంఖ్యలో వున్నారు. వ్యక్తితత్వ ఆలోచనకు ఇది చిహ్నం మాత్రమే. తమ యూనిట్ పెద్ద పట్టణాలకు ఎప్పుడు ప్రయాణం చేస్తుందని ఎదురుచూస్తూంటారు. పని చేయడానికి కాకుండా సౌఖ్యం అనుభవించడానికి, అక్కడకు పోవాలని వాంఛిస్తూ వుంటారు. జీవితం కష్టంగా వున్న విముక్తి ప్రాంతంలో పని చేయటం వీరికి గిట్టదు.

5. స్తబ్ధత: తమ కోర్కెలకు వ్యతిరేకంగా ఏదయినా జరిగిందంటే, కొంత మంది కామ్రేడ్స్ వెంటనే పనిలో చురుగ్గా పాల్గొనరు. స్తబ్ధుగా వుంటారు. ప్రధానంగా సరైన రాజకీయ శిక్షణ లేకపోవడమే అందుకు కారణం. కొన్ని సందర్భాలలో పార్టీ నాయకత్వం పని చేస్తున్న తీరు, పని పంపకం తీరు, క్రమశిక్షణను అమలుజరిపే పద్ధతుల వల్ల కూడా ఇది సంభవించుతూ వుంటుంది.

6. సైన్యం విడిచిపోవాలనే కోరిక: ఎర్రసైన్యం వదిలి, స్థానికంగా పని చేయాలనే వారి సంఖ్య పెరుగుతూ వుంది. వ్యక్తుల బలహీనతవల్లే ఇది రావటం లేదు.

అ) ఎర్రసైన్యం జీవితంలో కష్టాలు, ఆ) దీర్ఘకాలం పోరాటం తర్వాత అలసట 3) నాయకత్వం పనితీరు, పని పంపక విధానం, క్రమశిక్షణ

అమలుజరిపే విధానం, వీటివల్ల కూడా ఈ పరిస్థితి ఏర్పడుతూ వుంది.

వ్యక్తిగత ఆలోచనా విధానాన్ని సిద్ధాంతరీత్యా సరి చేయుటకు రాజకీయ శిక్షణ తీవ్రపరచడమే ప్రధానమైన పద్ధతి. పని తీరు, పని పంపకం, క్రమశిక్షణ అమలుజరిపే తీరును అభివృద్ధి చెయ్యాలి. ఎర్రసైన్యం యొక్క భౌతిక జీవన పరిస్థితులను అభివృద్ధిపరచడానికీ, తగినంత విశ్రాంతి, అవకాశాలు సృష్టించుకోవాలి. వ్యక్తిగత ఆలోచన యొక్క సాంఘిక పునాది పార్టీలోని పెటీబూర్జువా ధోరణి అన్న విషయాన్ని బోధించాలి.

### దేశదిమ్మరి, తిరుగుబోతు దళాల సిద్ధాంతం

విప్లవ కేంద్రాన్ని నిర్మించుకోకుండా, ఎప్పుడూ ఒక చోట నుండి మరొక చోటికి పరిగెత్తే తిరుగుబోతు దేశ దిమ్మరి దళాల రాజకీయ సిద్ధాంతం మన ఎర్ర సైన్యంలో తలెత్తింది. ఎర్ర సైన్యంలో దేశ దిమ్మరి అలవాటుగల వారి సంఖ్య పెద్దగానే వుంది. చైనాలో ఇలాంటి వారు ముఖ్యంగా దక్షిణ చైనాలో ఎక్కువగానే వున్నారు. ఈ సిద్ధాంతం ఈ కింది విధంగా ప్రతిబింబించుతూ వుంటుంది.

1. కొందరు ఒక చోటి నుండి మరొక చోటికి పరిగెత్తే తిరుగుబోతు గెరిల్లా చర్యల ద్వారా మన రాజకీయ పలుకుబడిని విస్తృత పరచుకోవాలని సూచిస్తారు. విప్లవ కేంద్రాన్ని స్థాపించటం, ప్రజా రాజకీయాధికారాన్ని స్థాపించుకోవటం లాంటి కష్టమైన పనులు వీరికి గిట్టవు.

2. ఎర్రసైన్యాన్ని విస్తృతం చేసుకోవటంలో “మనుష్యులను, గుర్రాలను” కొనాలనీ, “పారిపోయినవారిని, తిరుగుబాటు దారులను” చేర్చుకోవాలనే పద్ధతిని అనుసరిస్తూ వుంటారు. స్థానిక రెడ్‌గార్డ్సు దళాలను, స్థానిక సైన్యాలను పెంచుకొని, వాటి ద్వారా ఎర్ర సైన్యాన్ని పెంచుకోవాలనే పంథా వీరికంతగా గిట్టదు.

3. ప్రజలతో కలిసి క్లిష్టమయిన పోరాటాల్లో పాల్గొనటం కొంత మందికి గిట్టదు. పెద్ద పట్టణాలకు వెళ్లి, తృప్తిగా తిని, తాగాలని కోరుకుంటారు. తిరుగుబోతుదార్ల సిద్ధాంతం తన సక్రమ కర్తవ్య నిర్వహణలో ఎర్ర సైన్యానికి అడ్డుపడుతూ వుంటుంది. ఎర్ర సైన్యం యొక్క పార్టీ నిర్మాణంలో ఈ సిద్ధాంతానికి వ్యతిరేకంగా తీవ్రమయిన సిద్ధాంత పోరాటాన్ని జరుపవలసి వుంటుంది. హుయాంగ్-చావ్ లేక లీ చు-యాంగ్ ల నాయకత్వం కింద వుండిన దేశదిమ్మరి తిరుగుబోతుదార్ల పద్ధతులు ఈనాటి పరిస్థితుల కేమాత్రం సరిపడవని స్పష్టంగా గ్రహించాలి.

**ఈ తప్పుడు ధోరణిని ఈ కింది పద్ధతుల ద్వారా సరిదిద్దాలి**

1. రాజకీయ శిక్షణ తీవ్రపరచాలి. తప్పుడు ఆలోచనలను విమర్శించాలి. ఎపుడూ తిరుగాడుతుండాలనే దేశదిమ్మరి తిరుగుబోతుదార్ల సిద్ధాంతాన్ని నిర్మూలించాలి.

2. నిష్ఫలమైన దేశదిమ్మరి ఆలోచనా విధానాన్ని ప్రతిఘటించడానికి ఎర్రసైన్యంలోని ప్రాథమిక శాఖల్లోనూ, కొత్తగా చేర్చుకున్న ఖైదీలలోనూ, రాజకీయ శిక్షణ తీవ్రపరచాలి.

3. పోరాటంలో అనుభవం కల్గిన రైతులను, కార్మికులను ఎర్ర సైన్యం లోనికి చేర్చుకుని ఎర్ర సైన్యం యొక్క స్వభావాన్ని మార్చాలి.

4. కార్మిక, రైతు, మిలిటెంట్ల నుండి ఎర్రసైన్యం కొత్త యూనిట్లు ఆర్గనైజు చేయాలి.

### దుందుడుకుతత్వం అవశేషాలు

సైన్యంలోని పార్టీ నిర్మాణం దుందుడుకువాదంకు వ్యతిరేకంగా పోరాడింది. కాని ఈ పోరాటం ఇంకా చాలలేదు. తత్ఫలితంగా ఎర్ర సైన్యంలో దీని అవశేషాలు ఇంకా మిగిలి వున్నాయి. ఇది ఈ కింది విధంగా ప్రతిబింబించుతూ వుంది.

1. భౌతిక పరిస్థితులను, మన సొంత నిర్మాణ శక్తిని, శత్రు బలాన్ని దృష్టిలో వుంచుకోకుండా, గుడ్డిగా పోరాటం జరపాలని కోరుట 2. పట్టణాలలో పార్టీ పంథాను సంపూర్తిగా, నిశ్చయాత్మకంగా అమలుజరపక పోవటం 3. మిలిటరీ క్రమశిక్షణను సవ్యంగా ఆచరించకపోవటం, ముఖ్యంగా ఓటమి సంభవించిన సందర్భంలో 4. కొన్ని యూనిట్లు గృహదహన కార్యక్రమంలో పాల్గొనటం 5. ఎర్ర సైన్యం నుండి పారిపోయే వారిని కాల్చి వేసే విధానం, కొరడాలతో కొట్టి శిక్షించే విధానం దుందుడుకువాదం నుండి వచ్చేవే. దుందుడుకువాదానికి సాంఘిక పునాది అలగా శ్రామిక సిద్ధాంతం, పెటీబూర్జువా సిద్ధాంతం యొక్క కలయికయే.

**దీనిని ఈ కింది పద్ధతుల ద్వారా తొలగించాలి:**

1. దుందుడుకువాదాన్ని సిద్ధాంతం ద్వారా నిర్మూలించాలి.

2. సక్రమ రూల్సు, రెగ్యులేషన్స్ విధానాల ద్వారా దుందుడుకుతత్వ ప్రవర్తనను సరిదిద్దాలి. ★

---

**(23వ పేజీ తరువాయి)**

**కాశ్మీరుకు విముక్తి ఎలా?**

కాశ్మీర్‌ను భారతదేశంలో కలపడానికి ముందు చేసుకున్న ఒప్పందాలను కేంద్రం గౌరవించి చిత్తశుద్ధితో అమలు చేయకపోవడమే నేడు కాశ్మీర్ ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు మూలం. పాలకవర్గాల విధానాల వల్ల వారి ఆశలు అడియాశలయ్యాయి. వారిలో అసహనం పెరిగింది. కాశ్మీర్ జాతి విముక్తి కోసం కాశ్మీరీలు జె.కె.ఎల్.ఎఫ్. సంస్థను, ఇతర సంస్థలను స్థాపించి సాయుధ పోరాటం కొనసాగిస్తున్నారు. యువత రాళ్లు రువ్వుతూ వీధి పోరాటాలకు దిగుతున్నారు. ఎన్‌కౌంటర్ హత్యలు, అత్యాచారాలు అనునిత్యం కొనసాగుతున్నాయి. వేలాది మంది పోరాట యోధులు, ప్రజలు ప్రాణాలర్పించారు. వీళ్లు చేస్తున్న పోరాటం న్యాయమైంది. ఈ పోరాటానికి పూర్తి మద్దతు తెలియజేద్దాం. అంతిమంగా కాశ్మీర్ జాతి సమస్య ఈ రోజు కొనసాగుతున్న వర్గ పోరాటం ద్వారానే అంటే నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగానే పరిష్కారమవుతుంది. అంతిమంగా భారతదేశంలో జాతుల సమస్య, కుల సమస్య సారంశంలో వర్గ సమస్యనే. అందుకనే దేశంలోని సమస్త పీడిత ప్రజానీకం బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని ప్రతిఘటించాలి. భూస్వామ్యం, సామ్రాజ్యవాదం, సీ.బీ.బీ.కి వ్యతిరేకంగా పోరాడాలి. జాతులకు స్వేచ్ఛ కావాలన్నా, బ్రాహ్మణీయ హిందూ మతం నిర్మించిన నిచ్చెనమెట్ల కులవ్యవస్థ నాశనం కావాలన్నా నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యంతో పోరాడాలి. అప్పుడు మాత్రమే స్వేచ్ఛా భారతవనిని సాధించుకుంటాం.

★

# నల్ల కుబేరుల గుట్టు రట్టు చేసిన పనామా పత్రాలు

## నల్లధనానికి, కుంభకోణాలకు వ్యతిరేకంగా పోరాడండి

సెంట్రల్ అమెరికా ద్వారా అట్లాంటిక్ సముద్రాన్ని, పసిఫిక్ మహాసముద్రంతో కలపటానికి 1913వ సంవత్సరంలో తవ్వించిన కాలువ ద్వారా ప్రపంచ నౌకాయానానికి విశిష్ట సేవలను అందిస్తూ మానవ నాగరికతకు గీటురాయిగా నిలిచిన పనామా దేశం నేడు ప్రపంచవ్యాప్త పన్నుల ఎగవేతదార్లకు, కుంభకోణాల పెద్దలకు నిలయంగా మారి తాజాగా పనామా పత్రాల పేరున ప్రపంచ ప్రజల ముందు దోషిగా వచ్చి నాగరికతకు కళంకితం తెచ్చింది. అక్రమ మార్గాల్లో ఆర్జించిన లేదా ప్రభుత్వాలకు లెక్కచూపక పన్ను చెల్లించనిది నల్లధనం. ప్రపంచంలో ఇప్పటివరకు జర్నలిజం చరిత్రలో ఇంతటి పరిమాణంలో సమాచారం బహిర్గతం కాలేదని అమెరికాకు చెందిన ప్రజావేగు (విజిల్ బ్లోయర్) ఎడ్వర్డ్ స్నోడెన్ అన్నారు. ప్రపంచ దేశాల్లో ప్రభుత్వాలకు కట్టవలసిన ఆదాయపు పన్నులను, పరోక్ష పన్నులను ఎగ్గొట్టి, దేశాభివృద్ధికి, సమాజాభివృద్ధికి తోడ్పడకుండా అక్రమంగా నల్లధనాన్ని పోగుచేసుకుని, హవాలా వ్యవస్థల ద్వారా గడిచిన 40 సంవత్సరాలుగా లక్షలాది కోట్ల డాలర్లను దాచుకోవడానికి సహకరించిన పనామా దేశంలోని మొస్సాక్ ఫోన్సెకా పేరిట ఏర్పడిన న్యాయ కంపెనీ వివరాలను ఒక అజ్ఞాత వ్యక్తి జర్మనీలోని దక్షిణ జర్మనీ పత్రిక సధ్యూషే జైటాంగ్‌కు అందజేశాడు. ఈ పత్రిక కోటి పదహారు లక్షల రహస్య పత్రాలను బయటపెట్టింది.




మొస్సాక్ ఫోన్సెకా సమాచారం 1977 నుంచి 2015 డిసెంబరు మధ్యకాలానికి చెందినది. ఈ సమాచారం పరిమాణం ఎంతో విస్తృతంగా ఉండడంవల్ల ఆ జర్మన్ వార్తాపత్రిక తన వద్దగల సమాచారాన్ని విశ్లేషించటానికి ఇంటర్నేషనల్ కన్సార్టియం ఆఫ్ ఇన్వెస్టిగేషన్ జర్నలిస్ట్స్ (ఐసిఐజె) సహకారం తీసుకున్నది. ఈ రహస్య పత్రాలను బయట పెట్టటంతో బిబిసి, ది గార్డియన్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వంటి 107 ప్రపంచ వార్తాపత్రికల యాజమాన్యాలు 76 దేశాలకు చెందిన 370 మంది జర్నలిస్టులు 8 మాసాలు శ్రమించి ప్రపంచ దేశాల నల్లకుబేరుల బండారాన్ని వెలుగులోకి తెచ్చాయి. ఈ జర్నలిస్టులచే విశ్లేషించబడిన సమాచారం ప్రకారం ప్రపంచంలోని అనేకమంది రాజ్యాధినేతలు, రాజకీయ నాయకులు, వారి స్నేహితులు, బంధువులు, వ్యాపారవేత్తలు, సినిమా రంగానికి చెందిన సెలబ్రిటీలు తమతమ దేశాలలోని చట్టాలను అతిక్రమించి, కట్టవలసిన పన్నులు కట్టకుండా కూడబెట్టిన అక్రమ సంపాదనను మొస్సాక్ ఫోన్సెకా ద్వారా రహస్య ఆఫ్‌షోర్ కంపెనీలలో దాచారు.

లీక్ అయిన కోటి పదహారు లక్షల పత్రాలలో భారతదేశానికి సంబంధించి 36 వేల పత్రాలు ఉన్నాయి. దాదాపు 50 దేశాలకు చెందిన 140 మంది రాజకీయ నేతల భవితను ప్రశ్నార్థకంగా మార్చేసింది. 1977–2015 మధ్య కాలంలో మొస్సాక్ ఫోన్సెకా సంస్థ తన ఖాతాదారుల కోసం సృష్టించిన విదేశీ ధార్మిక, సేవాసంస్థల సంఖ్య దాదాపు రెండు లక్షల 15 వేలు. అవన్నీ అక్రమమైనవేనని తీర్మానించే వీల్లేకపోయినా, అవినీతి మోతుబరుల నల్లధన ప్రవాహాలను క్రమబద్ధీకరించేందుకు, ఆయుధ బేహారులు, మాదక ద్రవ్యాల మాఫియా నిధుల నిక్షిప్తానికి, స్వదేశంలో పన్నుల ఎగవేతకు వీలుగా మెజారిటీ సంస్థలను సృష్టించారనడంలో మరోమాట లేదు. 2010లో వికీలీక్స్ ద్వారా వెల్లడైన రహస్య సమాచార పరిమాణం 1.7 గిగాబైట్లు. అదే నేడు పనామా పత్రాల రాశి, 2,600 గిగాబైట్లు (2.6 టెరాబైట్లు)!

చరిత్రలో కని విని ఎరుగని స్థాయిలో నల్లకుబేరుల భారీ కుంభకోణం బద్దలైంది. సరిహద్దులను చెరిపేసిన గుప్తధనం గుట్టు రట్టయింది. నల్లధనమే తెల్లబోయే లెక్కలివి. ప్రపంచానికి దిమ్మదిరిగే గుణాంకాలివి. కాలిక్యులేటర్లు, కంప్యూటర్లు సైతం కూడలేనంత! కొన్ని దేశాల బడ్జెట్లనే మించిపోయినంత!! ఒక అంచనా ప్రకారం మొత్తం నల్లధనం రూ. 1550 లక్షల కోట్ల పైమాటే. టాక్స్ జస్టిస్ నెట్‌వర్క్ అనే ఓ అంతర్జాతీయ సంస్థ అంచనా ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా పన్నులు కట్టకుండా దాచిన అక్రమ సంపద సుమారు 30 లక్షల కోట్ల (30 ట్రిలియన్ డాలర్లు) డాలర్లు. దానిలో పావు వంతు ప్రభుత్వ ఖజానాకు జమ అయితే ప్రతి కుటుంబానికి 2 వేల డాలర్లు (రూ. 1,32,000) ఇవ్వవచ్చునని ఆ సంస్థ తెలిపింది. ప్రభుత్వాలు సంక్షేమ పథకాలకు డబ్బులు లేవన్నది పచ్చి అబద్ధం. మన దేశం నుండి బయటికి తరలిపోయిన నల్లధనం 80 లక్షల కోట్లు. చట్టపరంగా రావల్సిన పన్ను 30 శాతం రాబట్టగలిగితే 25 లక్షలు వస్తాయి. మన కేంద్ర బడ్జెట్‌కు ఒకటిన్నర రేట్లు. వీటితో ప్రతి ఒక్కరికి కూడు, గూడు, బట్ట, విద్య, వైద్యం ఉచితంగా అందించవచ్చు.

40 లక్షల జనాభా కలిగిన అతి చిన్న దేశం పనామా. ఇంత భారీ ఎత్తున అక్రమ ధనరవాణా వ్యాపారానికి కేంద్రం కావటం ఆశ్చర్యకరం. అయితే "పన్ను రహిత స్వర్గధామాలుగా ఉన్న ఇతర కేంద్రాలు – బ్రిటిష్ వర్జిన్ ఐలాండ్స్, కేమాన్ ఐలాండ్స్, బెర్ముడ, మారిషస్, సింగపూర్, హాంగ్‌కాంగ్, సైప్రస్, లక్జెంబర్గ్, ఐర్లాండ్, బహమాస్

తదితరాలు చిన్న ప్రదేశాలే. ఒకప్పుడు నల్లధనం అనగానే స్విట్జర్లాండ్, స్విస్ బ్యాంకులు గుర్తుకొచ్చేవి. గత మూడు నాలుగు దశాబ్దాల్లో దాన్ని తలదన్నే కేంద్రాలు అనేకం వెలిశాయి. అవి ఓ 100 దాకా ఉంటాయని అంచనా. పనామా పత్రాలు బహిర్గతం చేసిన సమాచారం సముద్రంలో కాకిరెట్ట అంత మాత్రమే. పనామా పత్రాలు బయట పెట్టిన నల్లకుబేరుల్లో 500 మంది భారతీయులున్నారు.

### ఎవరీ మొస్సాక్ ఫోన్సెకా?

రామన్ ఫోన్సెకా, జుర్గెన్ మొస్సాక్ ఇద్దరూ కలిసి విడివిడిగా ఉన్న తమ న్యాయ సహకార (లా ఫర్మ్) సంస్థలను విలీనం చేసి 1986లో మొస్సాక్ సంస్థను స్థాపించారు. ఇద్దరికీ ఆర్థిక, అధికార వ్యవహారాలు, రహస్య వ్యవహారాల్లో ప్రపంచస్థాయి అనుభవం ఉంది. ఫోన్సెకా పనామా వాసి కాగా, మొస్సాకా పనామాలో నివసిస్తున్న జర్మన్ జాతీయుడు. ఇద్దరూ గతంలో ఆయా ప్రభుత్వ సంస్థల్లో సలహాదారులుగా పనిచేశారు. విదేశీ వ్యవహారాల్లో వీరిది అందెవేసిన చెయ్యి. బ్రిటిష్ వర్జిన్ ఐల్యాండ్స్‌లో బ్రాంచి ఏర్పాటు చేశాక వీరి కంపెనీ అంచెలంచెలుగా ఎదిగింది. పనామా కేంద్రంగా పనిచేస్తూ ప్రపంచ వ్యాప్తంగా రహస్య కంపెనీలను సృష్టించి వాటిని నల్లకుబేరులకు కారు చౌకగా అమ్ముతుంది. వెయ్యి డాలర్లు (రూ.66,290) చెల్లిస్తే మొస్సాక్ ఫోన్సెకా నుంచి కంపెనీలకు కొనెయ్యొచ్చు. పెట్టుబడులు పెట్టిన ప్రమోటర్లు వ్యాపార లావాదేవీలను సదరు కంపెనీలు రహస్యంగా ఉంచుతాయి. ప్రపంచ వ్యాప్తంగా మొస్సాక్ ఫోన్సెకాకి డజన్ల కొద్ది కార్యాలయాలున్నాయి. వేలాది కంపెనీలను స్థాపించడం, అమ్మడం, నిర్వహించడం దీని నిరంతర ప్రక్రియ.

పనామాలో 1948లో స్వేచ్ఛా వాణిజ్య క్షేత్రాలను సంపన్న దేశాల కొరకు సృష్టించింది. పనామా లాగే మరికొన్ని దేశాలు కూడా నల్లధనాన్ని దాచుకోవడానికి విదేశీయుల్ని అనుమతించాయి. పనామా విషయానికొస్తే, వందేండ్ల క్రితమే విదేశీ ఓడలను రిజిస్టర్ చేసుకోవడం కోసం విదేశీ కంపెనీలకు అనుమతులు ఇచ్చింది. ఈ పరిణామం అమెరికా చమురు కంపెనీ స్టాండర్డ్ ఆయిల్ (జాన్ డి. రాక్‌ఫెల్లర్ దీని యజమాని) వంటి సంస్థలకు ఉపయోగపడింది. అత్యంత విస్తారంగా దీన్ని ఉపయోగించుకున్నదెవరైనా ఉన్నారంటే వారు అమెరికన్లే. చట్టం దృష్టిలో పడని, పన్నులు కట్టకుండా పొందిన అనేక వస్తువుల్ని ఈ స్వేచ్ఛా వాణిజ్య క్షేత్రంలో అమ్మడం లేదా కొనడం చేయొచ్చు. 1970 వచ్చేసరికి, విదేశీ క్లయింట్లకు మరింత రక్షణాత్మక విధానాల్ని పనామా ప్రకటించింది. పనామా సృష్టించిన అనేక కార్పొరేషన్ల ద్వారా విదేశీ క్లయింట్లకు ఎనలేని లాభం చేకూరింది. 1990 ప్రపంచీకరణ ఆర్థిక విధానాలు అమలులోకి వచ్చిన నాటి నుంచి ఇందులో అనేకమంది ప్రపంచ నాయకులు, పెద్ద పెట్టుబడిదారులు ప్రవేశించారు. ఇవ్వాళ అనేకమంది నల్లకుబేరులకు పనామా ఆవాసంగా మారింది.

### గుట్టంత షెల్ కంపెనీల్లోనే

మాయల ఫకీరు ప్రాణం చిలకలో ఉన్నట్లు విదేశీ ఖాతాల్లో నల్లధనం దాచుకున్న వారి గుట్టు షెల్ కంపెనీల్లో ఉంటుంది. ఇవన్నీ ఉత్తుత్తి (సూట్‌కేస్) కంపెనీలే. మనీలాండరింగ్‌కు తప్ప మరి దేనికి పనికిరావు. ఇలాంటి కంపెనీల ఏర్పాటు పనామా లాంటి దేశాల్లోనే సాధ్యమవుతుంది. ఈ బూటకపు కంపెనీల యజమానులు ఎవరు, ఎవరెవరి పేరిట డబ్బుంది అనే సంగతి రహస్యంగా ఉంచుతారు. భర్తతో విడిపోయిన భార్యకు అతని ఖాతాల గురించి, అందులో ఉన్న సొమ్ము గురించి తెలియకపోతే ఏంచేస్తుంది? అలాగే రుణాలు ఎగ్గొట్టిన కంపెనీల యజమానులకు విదేశాల్లో బోలెడు ఆస్తులున్నట్లు తెలియకుండా అప్పిచ్చిన కంపెనీలు ఎలా దావాలు వేయగలుగుతాయి? తెలియని సంపదపై ప్రభుత్వాలు పన్ను ఎలా వేస్తాయి? ఇలా అన్ని రకాల జవాబుదారీ నుండి విముక్తి కల్పించేవే షెల్ కంపెనీలు. అలాంటి కంపెనీల పేరిట లావాదేవీలు జరిపేందుకు పుట్టుకు వచ్చిందే మొస్సాక్ ఫోన్సెకా అనే కంపెనీ. ఈ తరహా సేవలందించే కంపెనీలు చాలానే ఉన్నప్పటికీ కంపెనీగా దీనికి గుర్తింపు ఉంది. మొస్సాక్ ఫోన్సెకా వ్యవహారాలన్నీ అత్యంత రహస్యం. పనామాలోని వాణిజ్య ప్రాంతంలో ఓ సాదాసీదా భవనం దీని కేంద్ర కార్యాలయం. రహస్య ఖాతాలకు నేలవైన దేశాల్లో దీని కార్యకలాపాలు సాగుతాయి. అన్నిటిపైనా ముసుగు వేయడం ఈ కంపెనీ ప్రత్యేకత. ఇప్పుడా ముసుగు పటాపంచలైపోయింది. తమతమ దేశాల నుంచి డబ్బు ఎగరవేసుకుపోయిన పెద్దల బండారం బయటపడటం సంచలనం కలిగిస్తున్నది.

పన్ను ఎగవేతగాళ్లు, అవినీతి సామ్రాట్టుల ఆర్థిక అక్రమాలకు తమ దేశం భూతల స్వర్గమన్న 'గుర్తింపును' పనామా ప్రజలు ఘనకార్యంగా భావించేవాళ్లు. తమ దేశం గొప్పదంటూ భుజాలు ఎగరేసేవాళ్లు. తాము దొంగలం అయితే దొంగతనాన్ని తాము ప్రపంచంలోని సంపన్న దేశాల నుంచే నేర్చుకున్నామని ఎద్దేవా చేసేవాళ్లు. భూగోళమంత కుంభకోణానికి సంబంధించి కోటికిపైగా డాక్యుమెంట్లు బయటపడిన తర్వాత కూడా వాళ్లు అదే రక్షణాత్మక దోరణిని ప్రదర్శిస్తున్నారు. ప్రపంచ ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో ఆఫ్‌షోర్ బ్యాంకింగ్‌లో పోటీ పెరిగిందని, సంపన్న దేశాలు పనామాను చూసి ఈర్ష్య పడుతున్నాయని, ఈ లీకులు సరికాదని, ఇది సమ ఉజ్జీల పోరాటం కాదని రామన్ ఫోన్సెకా ఆవేదన వ్యక్తం చేశారు. పనామా చిన్న దేశం కనుక పత్రికలు మొదటి పేజీల్లో వార్తలు పరిచేశాయని, అదే అమెరికాలో డెలావరో మరొక నగరానికి చెందిన కంపెనీ అయితే ఇలా చేసేవాళ్లా అని ఎదురు ప్రశ్నించారు. పనామా కాబట్టి పత్రికల పతాక శీర్షికలకు ఎక్కింది. ఇలా ఎన్ని లేవు? అంటూ మొస్సాక్ ఫోన్సెకా అధినేత ప్రశ్నించడంలో తప్పేమి లేదు.

నిజానికి, నాలుగున్నర దశాబ్దాలుగా మనీలాండరింగ్ కేంద్రంగా పనామా తన స్థానాన్ని పదిలపరుచుకుంది. అప్పటి నుంచీ అవినీతి సొమ్ముకు అది కేంద్ర స్థానంగానే ఉంటూ వస్తుంది. ఆయా దేశాల రిజర్వ్ బ్యాంకు కండ్లు గప్పి, చట్టాలను పక్కన పెట్టి, మందీ మార్బలం, అనేక నిఘా సంస్థల దన్ను ఉన్న ప్రభుత్వాలను అపహాస్యం చేస్తూ

దశాబ్దాలుగా ఈ దొంగ పనులన్నిటినీ సమర్థవంతంగా నిర్వహిస్తున్న ఫోన్సెకా ఫర్మ్‌లో నిండా 500 మంది సిబ్బంది కూడా లేరంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఎన్నో దేశాల్లో ఈ సంస్థకు శాఖలున్నా, దీని కార్యకలాపాలపై కన్నేసి ఉంచుతున్నామని ఆయా దేశాల్లోని ప్రభుత్వాలు చెబుతున్నా, పాత్రికేయుల పరిశోధన బృందం వెలికి తీసే వరకూ ఈ చాటుమాటు వ్యవహారాలన్నీ గవ్‌చుప్‌గా సాగిపోయాయి. దేశాధినేతలుగా ప్రభుత్వాల విధానాలను నిర్దేశిస్తూనే, కఠినమైన నిబంధనలు పెట్టినట్టు కనిపిస్తూనే ఆ నేతలే చాటు మాటుగా ఇలాంటి అక్రమార్కులతో కుమ్మక్కవడంతో ప్రజలు అవాక్కవుతున్నారు.

**బయటపడ్డ నల్ల కుబేరుల బండారం**

మొస్సాక్ ఫోన్సెకా ద్వారా డబ్బులు దాచుకున్న వారిలో దాదాపు అన్ని ఖండాల వాళ్లూ ఉన్నారు. ఇందులో అదానీ లాంటి భారత జాతి రత్నాలున్నారు. పాకిస్తాన్ ప్రధాని నవాజ్ షరీఫ్ కొడుకుల లాంటి పాకిస్తాన్ అణిముత్యాలు ఉన్నారు. చైనా అధ్యక్షుడి బామ్మర్ది మొదలుకొని పొలిట్‌బ్యూరో సభ్యుల వరకూ అనేకమంది ఈ రొంపిలో ఉన్నారు. కమ్యూనిస్టు అని పేరు తగిలించుకోగానే బూర్జువా జాడ్యాలన్నీ మటుమాయమైపోతాయని నమ్మే అమాయకులకు ఇదొక మంచి పాఠం. స్వయంగా సౌదీ అరేబియా రాజే (సాల్మన్) ఈ ధనయాగంలో ఉన్నాడు. రష్యా అధ్యక్షుడు పుతిన్ సన్నిహితుడొకరు రెండు బిలియన్ డాలర్లను బయటికి తరలించాడని దస్త్రాలు చెబుతున్నాయి. రష్యాకు బద్ధవ్యతిరేకి ఉక్రేనియా అధ్యక్షుడు షరోషెంకో కూడా ఈ జాబితాలో ఉన్నాడు. బ్రిటీష్ ప్రధాని కేమెరాన్‌తో పాటు కన్సర్వేటివ్ పార్టీ ప్రముఖులు చాలామంది ఈ దందాలో ఉన్నారు. ఉత్తర కొరియా నాయకులూ ఈ వ్యవహారంలో ఉన్నారు. సిరియా అధ్యక్షుడు అస్సాద్ ఉన్నాడు. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జాకబ్ జుమా కూడా ఇందులో పీకల్లోతుల్లో దిగబడ్డారు. బ్రెజిల్ అధినేత్రి జిరుమా రుసేపుతో పాటు ఆమె పార్టీలో అనేకమంది నాయకులు ఇందులో దొరికిపోయారు. ఆరు ప్రతిపక్ష పార్టీలు కూడా ఇందులో ఇరుక్కున్నారు.

ఈ కుంభకోణంలో అందరికంటే ముందు బలైనవాడు ఐస్‌లాండ్ ప్రధానమంత్రి ఐస్‌లాండ్ మొత్తం జనాభా మూడు లక్షల ముప్ఫైవేలు. వార్త తెలిసిన 24 గంటలలోపే ఆ చిన్న దేశంలో 30 వేల మంది ప్రజలు రోడ్లపైకి వచ్చి ప్రధాని రాజీనామా చెయ్యాలని డిమాండ్ చేశారు. అంతవేగంగా ప్రజలు ప్రతిస్పందించగలగాలే గానీ ఏ దేశంలోనైనా ఈ ఘరానా దొంగల అక్రమాలు అడ్డుకోలేమా? అవినీతిపరులని మనకి బాగా తెలిసిని వ్యక్తులు కొందరు మన కళ్లెదుటే అవినీతి వ్యతిరేక సభలు, సెమినార్లు వగైరా నిర్వహిస్తారు. కానీ అదే తరహా డ్రామాలు చాలా పెద్ద స్థాయిలో కూడా జరుగుతాయని పనామా పత్రికలు రుజువుచేశాయి. బ్రెజిల్‌లో 'అవినీతి పరురాలైన' జిరుమా రుసేపు రాజీనామా చెయ్యాల్సిందేనని ఎప్పటినుంచో పట్టు పడుతున్న ఓ నాయకమన్యుడు కూడా ఈ కుంభకోణంలో అడ్డంగా దొరికిపోయాడు. అలాగే ట్రాన్స్‌రెన్సీ ఇంటర్నేషనల్ అనే సంస్థ అంతర్జాతీయంగా కార్పొరేట్ అవినీతికి వ్యతిరేకంగా పోరాడడానికే పుట్టానంటుంది. కాని చిలీలో దాని అధ్యక్షుడు కూడా ఈ దందాలో దొరికిపోయాడు. అలాగే బ్రిటిష్ ప్రధాని డేవిడ్ కామెరాన్ కూడా అవినీతిని అంతం చేస్తానని దేశం బయటకు కోట్లాది పౌండులు పంపించి పన్నులు ఎగ్గొడుతున్నవాళ్ల భరతం పడతానని బీరాలు పలికాడు. ఆయన ఆర్థికమంత్రి జార్జ్ ఆస్‌బోర్న్ పన్నులు ఎగవేయడాన్ని చట్టరహితమే కాక అనైతికత కూడా అని నీతి బోధించాడు. ఇప్పుడు ఆ పార్టీ మొత్తంగా ప్రజల ఆగ్రహాన్ని రుచి చూస్తుంది. లండన్‌లో కేమెరాన్ పదవినుంచి తప్పుకోవాలని డిమాండ్ చేస్తూ పెద్ద ప్రదర్శన జరిపింది.

**వెలుగులోకి వచ్చిన దేశీయ చీకటి సామ్రాట్‌లు**

ఐసిఐజెతో కలిసి 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' నిర్వహించిన పనామా పేపర్స్ ఆపరేషన్‌లో భాగంగా ఏప్రిల్ 4న వెలుగులోకి వచ్చిన జాబితాలోని కొందరు భారతీయ కుబేరులు – సూపర్‌స్టార్ అమితాబ్ బచ్చన్, కోడలు ఐశ్వర్యరాయ్, రియల్ ఎస్టేట్ టైకూన్ కేపి సింగ్, పారిశ్రామికవేత్త వినోద్ ఆదానీ, ఇండియా బుల్స్ ఓనర్ సమీర్ గెహలోత్, లోక్‌సత్తా పార్టీ మాజీనేత అనురాగ్ కేజ్రీవాల్, మెహ్రాసన్స్ జువెలర్స్ అధినేత అశ్వినికుమార్, ఆయన కుమారులు దీపక్, నవీన్‌లు, క్రాంప్లన్ గ్రీవ్స్ అధినేత బ్రిజ్ మోహన్ థాపర్ కుమారులు గౌతమ్, కరణ్‌లు, అపోలో టైర్స్ చైర్మన్ ఓంకార్ కన్వర్ పేర్లు తొలి జాబితాలో వెల్లడయ్యాయి. ఏప్రిల్ 6న మరికొందరి పేర్లను వెల్లడి చేసారు. వీరిలో ప్రముఖ పారిశ్రామికవేత్తలున్నారు. మోడీ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ సతీష్ మోడీ, జూపిటర్ నిర్మాణ్ ప్రైవేట్ లిమిటేడ్ డైరెక్టర్లు ప్రీతమ్ బోథ్రా, శ్వేత గుప్తా, అహ్మదాబాద్‌కు చెందిన భండారీ అశోక్ రామదయాల్‌చంద్, కోల్‌కతాకు చెందిన అశోక్ మల్హోత్రా, డెహ్రాడూన్‌కు చెందిన సంజయ్ పోద్రియాల్, బెంగుళూరులోని పీవీజీ గ్రూపుకు చెందిన ప్రసన్న విఘోటేజ్, వామన్ కుమార్, వడోదరాకు చెందిన ప్రదీప్ కౌశిక్ రే బుచ్, అహ్మదాబాద్‌లోని సింటెక్స్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ రాహుల్ పటేల్, తిరువనంతపురానికి చెందిన జార్జ్ మాథ్యూల పేర్లు వెల్లడయ్యాయి. వీరిలో ముగ్గురు తెలుగు కుబేరులు మోటూరు శ్రీనివాస్ ప్రసాద్, బావనాసి జయకుమార్, వోలం భాస్కర్‌లు ఉన్నారు.

ఐసిఐజె ఏప్రిల్ 7న విడుదల చేసిన మరో జాబితాలో చార్టర్డ్ అకౌంటెంట్, మెన్స్ ఫ్యాషన్ రిటైలర్, ఢిల్లీకి చెందిన వినయ్ కృష్ణన్ చౌదరి అనే వ్యాపారవేత్త, కింగ్ ఫిషర్ అధినేత, పారిశ్రామికవేత్త విజయ్ మాల్యా, చెన్నైకి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి చిన్నమరత్తు షణ్ముగ సుందర పాండియన్, కోల్‌కత్తాకు చెందిన ఉదయ్‌ప్రతాప్ సింగ్, ఆస్ట్రేలియాన్ మైనింగ్ బిలియనీర్ క్రిస్ వాలిన్ కుమార్తె సిల్వియా ఫే బాటియా, ఆవిడ భర్త అలోక్ భాటియా, హీరో సైఫ్ అలీ ఖాన్, ఆయన భార్య బాలీవుడ్ హీరోయిన్ కరీనాకపూర్ పేర్లు ఇందులో ఉండడం మరో సంచలనానికి దారితీసింది. వీరితోపాటు కరీనా సోదరి కరిష్మా కపూర్, పారిశ్రామికవేత్త వీడియో కాన్ ఎండీ వేణుగోపాల్ ధూత్, పుణేకు చెందిన రియల్టర్ చోర్డియా కుటుంబం పేర్లు వెల్లడయ్యాయి.

### ప్రభుత్వ ఉదాసీనత మనీలాండరింగ్

ప్రత్యక్ష పన్నుల రూపంలో ప్రభుత్వాలకు రావల్సిన ఆదాయపన్నును పారిశ్రామికవేత్తలు ఎగ్గొట్టి నల్లధనం రూపంలో ఉంచి, పనామా వంటి టాక్స్ హెవెన్ దేశాల్లో ఉంచి అక్కడి కంపెనీల్లో, షేర్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా స్వదేశాల్లో దేశద్రోహానికి పూనుకుంటున్నారు. ఇటువంటి దేశద్రోహులను చూసీ చూడనట్లు ఊరుకొని ప్రభుత్వాధినేతలు సహాయపడుతున్నారు. దీనికితోడు కొందరు ప్రభుత్వ అధికారులు అవినీతికి పూనుకొని తద్వారా కూడగట్టిన నల్లధనాన్ని హవాలా రూపంలో విదేశీ కంపెనీల్లోనూ, విదేశీ స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెడుతూ, విదేశీ బ్యాంకుల్లో దాచుకుంటూ దేశద్రోహులుగా వీళ్లు తయారవుతున్నారు. పైగా వీళ్లంతా దేశభక్తులుగా చలామణి అవుతూ, అత్యున్నత జాతీయ అవార్డులు పొందుతూ ఆదర్శ జాతీయవాదులుగా ఈ కుహానా నాయకులు సిగ్గువిడిచి తిరుగుతున్నారు. వీళ్ల అక్రమ నల్లధనం ఆర్థిక సంపదతో దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలవుతుంది. అభివృద్ధి, జిడిపి వృద్ధిరేట్ల గురించి పదేపదే వల్లిస్తూ పెరుగుతున్న జిడిపి వృద్ధిరేటును విదేశాల్లో దాస్తూ ఆర్థిక అసమానతలకు వీళ్లు కారకులవుతున్నారు. మన దేశ ఆర్థికాభివృద్ధిలో అత్యధికభాగం హావాలా రూపంలో విదేశాలకు తరలిపోతుంది. తిరిగి అదే డబ్బు ప్రత్యక్ష పెట్టుబడులుగా మన దేశానికి తెల్లధనంగా వస్తుంది.

భారతదేశంలోని కంపెనీలు టాక్స్‌హెవెన్ దేశాలకు ఎగుమతులు చేస్తున్నప్పుడు వస్తువుల విలువను తక్కువ చూపించి, దిగుమతులు చేసుకుంటున్నప్పుడు వస్తు విలువను ఎక్కువ చూపించి నల్లధనాన్ని సమకూర్చుకుంటున్నాయి. ఈ నల్లధనాన్ని స్వర్గధామ దేశాల్లోని కంపెనీల్లోనూ, బ్యాంకుల్లోనూ దాచుకుంటున్నారు. తద్వారా స్వదేశాలలో పన్నులు ఎగ్గొట్టి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి దేశద్రోహానికి పాల్పడుతున్నారు. అక్రమార్జన నిలయ దేశాలు వీరికి స్వర్గధామాలుగా కాగా, భారతదేశం మాత్రం నరకంగా కనబడుతుంది. 2012లో పార్లమెంటులో సిబిఐ 50 వేల కోట్ల డాలర్లను టాక్స్ హెవెన్ దేశాల్లో దాచుకున్నట్లుగా ప్రకటించి దర్యాప్తు ప్రారంభించింది. నల్లధనాన్ని స్వయంగా బిందెలో అందరూ నీళ్లు పోసినట్లు, ప్రధాని మోడీ ప్రవేశపెట్టిన బ్లాక్‌మనీ డిక్లరేషన్‌కు 644 మంది దరఖాస్తులు పెట్టుకొని, కేవలం 4,615 కోట్ల రూపాయలు మాత్రమే చెల్లించారు. కఠినచర్యల ద్వారా మాత్రమే నల్లధనాన్ని రాబట్టగలమనే విషయం కేంద్ర ప్రభుత్వానికి తెలిసినా వీరిపై ఉదాసీనత ప్రదర్శిస్తుంది.

### సామ్రాజ్యవాద ప్రపంచీకరణ పర్యావసానాలు

సమకాలీన ద్రవ్య పెట్టుబడిదారీ వ్యవస్థ పనితీరును పనామా పత్రాలు మన దృష్టిని మూడు కోణాలనుంచి ఆకర్షిస్తున్నాయి. మొదటిది, అత్యంత స్పష్టంగా కనిపించేదేమంటే ధనవంతులు, అధికారాన్ని చెలాయించేవారు తమతమ దేశాలలో పన్నులను కట్టకుండా ఎగ్గొట్టి 'పన్ను ఆశ్రయాలు (టాక్స్ హెవెన్స్)'గా ఉన్న దేశాలలోని ఆఫ్‌షోర్ కంపెనీలలో పెట్టుబడులు పెట్టడం. రెండవ పేర్లతో గానీ పెద్ద ఎత్తున సంపద ఆఫ్ షోర్ కంపెనీలలో దాస్తున్నారో వారే తమ దేశ 'జాతీయ ప్రయోజనం' కోసం చట్టసభలలో నిర్ణయాలు చేస్తారు. ఈ పరిస్థితి విరుద్ధ ప్రయోజనాల ఘర్షణకు దారితీస్తుంది. అంతేకాకుండా ఈ నిర్ణయాలు తమ నాయకుల సంపద పరిమాణాన్ని ప్రభావితం చేస్తాయని ప్రజలకు తెలియదు.

మూడవ కోణం ధనవంతుల, అధికార వర్గాల, డ్రగ్ కార్టెల్స్, టెర్రరిస్టు గ్రూపులు, ఇతరులకు (వీటిని అధికార వర్గాలు నిత్యం విమర్శిస్తుంటాయి) చెందిన పరస్పరం పెనవేసుకున్న ప్రయోజనాలకు సంబంధించినది. క్లుప్తంగా చెప్పాలంటే 'నైతికత'కు 'అనైతికత'కు, 'చట్టబద్దత'కు 'చట్టవిరుద్ధత'కు, 'ఉచితానుచితాల'కు మధ్యగల తేడాల గురించి బయటకు ఏమీ మాట్లాడుతున్నప్పటికీ వాస్తవంలో ఆ తేడాలు దినదినానికి చెరిపి వేయబడుతున్నాయి. బహిర్గతమైన పనామా పత్రాల వ్యవస్థ 'ప్రక్షాళన' చేయటానికి ప్రభుత్వానికి ఒక అవకాశం దొరికిందని చాలామంది భావిస్తున్నారు. పన్ను ఎగవేతదారులనూ, దేశ సంపదను విదేశాలకు తరలించిన చీకటి సామ్రాట్‌లను శిక్షించటం ద్వారా ఈ పని చేయొచ్చని ప్రజలు భావిస్తున్నారు. వ్యవస్థను 'ప్రక్షాళన' చెయ్యాలనీ, 'నేరస్థుల'ను శిక్షించాలనీ ప్రజలు చేసే డిమాండ్లను తప్పకుండా బుద్ధిజీవులు సమర్థించాలి. పార్లమెంట్‌లో చేసే చట్టాలు చాల వరకు సంపన్న వ్యాపార పారిశ్రామిక వర్గాల ప్రయోజనాలకు అనుకూలంగా ఉంటాయని మధ్యతరగతి బుద్ధిజీవులు గ్రహించ లేకపోవడం శోచనీయం.

### అగ్రరాజ్యాల ద్వంద్వ విధానాలు

పనామా పత్రాలు వెలుగులోకి తేవడంలో అమెరికా హస్తం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ ఆపరేషన్ అమెరికా రాజధాని వాషింగ్టన్ డిసి కేంద్రంగా, ఫోర్డ్, కెల్లాగ్, కార్నెగీ, రాక్ ఫెల్లర్ వంటి కార్పొరేట్ సంస్థల ఆర్థిక సహకారంతో జరిగింది. అమెరికా ఇంటలిజెన్సీ వ్యవస్థ అయిన సిఐఎతో సన్నిహితంగా పనిచేసే యుఎస్ ఏజన్సీ ఫర్ ఇంటర్‌నేషనల్ డెవలప్‌మెంట్ (యూఎస్ ఎఐడి) తమకు సహకారం అందించినట్లు స్వయంగా ఐసిఐజె తెలిపింది. ఐసిఐజెకు ఆర్థిక సహకారం అందించిన జార్జి సోరోస్ అమెరికా అధ్యక్ష స్థానానికి పోటీ పడుతున్న హిల్లరీ క్లింటన్‌కు ప్రధాన ఆర్థిక వనరుగా ఉండటం గమనార్హం. అమెరికా, దాని మిత్ర దేశాలకు చెందిన ఒక్క రాజకీయ వేత్త ప్రస్తావన పనామా పత్రాల్లో లేదు. గతంలో నల్లధనానికి సంబంధించి అనేక రహస్యాలు బయట పెట్టిన వికీలీక్స్ కూడ అమెరికన్ల వివరాలను ఎందుకు బయట పెట్టలేదని విమర్శించింది. రష్యా ప్రభుత్వం ఇది పుతిన్‌కు వ్యతిరేకంగా సాగిన కుట్ర అని ఖండిస్తే, చైనా ప్రభుత్వం ఈ కథనాలను పరిగణలోకి తీసుకోవడం లేదని ప్రకటించింది.

ప్రపంచీకరణ నేపథ్యంలో సరళీకృత ఆర్థిక విధానాల కింద పన్ను స్వర్గాలు (టాక్స్‌హెవెన్స్) ఎలాంటి జవాబుదారీతనం లేకుండా సంపదలు దాచుకునే అవకాశం కల్పిస్తున్నాయి. మరికొన్ని ఆర్థిక గోప్యత అంటూ వివరాలు అడగవు. ఇందుకోసం వాటికి కొంత వడ్డీ ఎదురిస్తే చాలు. అమెరికా ఖండంలోని పనామా, బ్రిటిష్ వర్జిన్ ఐలాండ్స్,

బెర్ముడా వంటివి ప్రధానంగా బ్రిటిష్ సార్వభౌమత్వానికి లోబడి ఉండే నామకర్థపు పాలక వ్యవస్థలు మాత్రమే. అంతేగాక కెనడా, దక్షిణాఫ్రికా, ఇజ్రాయిల్, నార్వే, డెన్మార్క్ స్విడ్జర్లాండ్, జర్మనీ వంటి మొత్తం 83 దేశాలు కూడా ఈ రెండు తరహాల్లో ఏదో ఒక విధమైన సదుపాయం కలిగిస్తున్నాయి. ఏ ఏ కంపెనీలు లేదా వ్యక్తులు ఎక్కడినుంచి ఎలాంటి దొంగ సొమ్ము తెచ్చి దాచి పెట్టుకుంటున్నారనేది వాటికి అవసరం. షెల్ కంపెనీలు లేదా సూట్‌కేసు కంపెనీలు సృష్టించుకుని వాటిని కోటానుకోట్ల నిధులు తెచ్చుకోవడానికి వినియోగిస్తున్నాయి. అలాంటి కంపెనీలను సృష్టించే ఒక కిరాయి దళారీ సంస్థ మొస్సాక్ ఫోన్సెకా. దాని దగ్గరున్న సమాచారం కూడా అంతా రాలేదనేది ఒకటైతే, తక్కిన పన్ను ఎగవేత స్వర్గధామ దేశాల దగ్గర మరెంత గుప్త సంపద ఉండొచ్చనేది ఊహాకు అందని విషయమే.

**ముగింపు**

గత పెట్టుబడిదారీ వ్యవస్థ శకంలో ద్రవ్య పెట్టుబడిదారులకు, బడా పారిశ్రామికవేత్తలకు, ప్రభుత్వాధికారులకు మధ్య ఎలా 'అన్యోన్య సంబంధం' ఏర్పడుతుందో లెనిన్ తన 'సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ అత్యున్నత దశ' అనే పుస్తకంలో విశ్లేషించాడు. వాస్తవంలో ఈ 'అన్యోన్య సంబంధం' 'జాతీయ స్థాయిలో ఎలా ఉపయోగపడుతుందో లెనిన్ గమనించాడు. 20వ శతాబ్ది ఆరంభంలో జర్మన్ ద్రవ్య పెట్టుబడిదారీ వర్గం జర్మన్ రాజ్యంతో ఎలా మిలాఖత్ అయిందో, బ్రిటిష్ ద్రవ్య పెట్టుబడిదారీ వర్గం బ్రిటిష్ రాజ్యంతో ఎలా మిలాఖత్ అయిందో ఆయన విశ్లేషించాడు. ప్రపంచీకరింపబడిన ద్రవ్యపెట్టుబడిదారీ విధానం 21వ శతాబ్దంలో ప్రభుత్వ అధికారులకూ, ద్రవ్య పెట్టుబడిదారులకూ మధ్య ఏర్పడే 'పరస్పర సంబంధం' ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ప్రపంచ వాణిజ్య సంస్థలతో పాటు బడా కార్పొరేట్‌లతో ప్రపంచ స్థాయిలో ఉంటుంది. ఈ శతాబ్దంలో ప్రభుత్వాధినేతలు కూడా అక్రమంగా ఆర్జించిన తమ అక్రమ సంపదను తమ జాతీయ సరిహద్దులకు బయటనున్న విదేశీ భూభాగాలలో దాస్తారు. వీరు 'ప్రపంచ స్థాయిలో అందుబాటులోకి వచ్చిన అన్ని వక్ర మార్గాలను' ఉపయోగించుకొని తమ 'జాతీయ' ఆదాయానికి రావలసిన పన్నులను ఎగ్గొట్టి పోగుచేసిన అక్రమార్జనలను మరింతగా పెంచుకుంటారు.

అగ్రరాజ్యమైన అమెరికా ఇప్పుడు పన్ను ఎగవేతదార్లను, నల్లడబ్బు యజమానులను డెల్‌వేర్ రాష్ట్రానికి ఆహ్వానిస్తుంది. నెవెడా, టెక్సాస్, ఫ్లోరిడాలు కూడా క్యూలో ఉన్నాయి. కనీసం 10 లక్షల మంది పన్ను ఎగవేతదారులు ఈ రాష్ట్రాల్లో ఇప్పటికే నల్లధనాన్ని దాచుకుంటున్నారు. ఫోర్బ్స్ సర్వే ఆధారంగా ప్రపంచ మొట్టమొదటి 500 అత్యధిక ధనవంతుల్లో 64 శాతం మంది డెల్‌వేర్ పెట్టుబడులు పెడుతున్నారు. 50 శాతం పబ్లిక్ ట్రేడింగ్ కంపెనీలకు డెల్‌వేర్ రాష్ట్రం స్థావరంగా ఉంది. పనామా పత్రాల లీకుల దృష్ట్యా అమెరికాకు షేర్ కంపెనీలు మరిన్ని వస్తాయని అమెరికా భావిస్తుంది. కనుకనే అమెరికాలోని ఫోర్డ్‌ట్రస్ట్ కంపెనీలవంటివి ఇంటర్నేషనల్ జర్నలిస్టుల కన్సార్టియంకు సహాయ సహకారాన్ని అందించి పనామా పేపర్స్‌లో అమెరికా పాలకులు, కార్పొరేట్లు, సెలబ్రిటీల పేర్లు బయటపడకుండా పకడ్బందీగా వ్యవహరించారు. మరో వైపు మనకు అందుతున్న సమాచారం ఉన్నది ఉన్నట్లుగా లేదన్న అనుమానాలున్నాయి.

భారత పార్లమెంటరీ వ్యవస్థలో ప్రజాస్వామ్యం మేడిపండు చందమే. అవినీతికి, అక్రమాలకు ప్రధానంగా ఎన్నికల అక్రమాలే పునాది వేస్తున్నాయని సర్వోన్నత న్యాయస్థానం 2012లోనే వ్యాఖ్యానించింది. ప్రజాస్వామ్యానికి చోదక శక్తులం తామే అంటున్న పాలక పార్టీలు ప్రజాతంత్ర స్ఫూర్తికి ఏనాడో తలకొరివి పెట్టాయి. సిద్ధాంతాలకు తిలోదకాలు ఇచ్చాయి. గెలుపుకోసం నానా గడ్డి కరుస్తున్నాయి. ఫలితంగా రాజ్యాంగ వ్యవస్థలు భ్రష్టుపట్టాయి. విలువలు అంతరించిపోయాయి. ఇవ్వాళ రాజకీయమంటేనే సంపాదనగా మారింది. ప్రతి ఎన్నికల సందర్భంలో తరతమ భేదాలతో పార్టీలన్నీ ఓటర్లను డబ్బుతో ప్రలోభ పెట్టేందుకు కార్పొరేట్ల డొనేషన్ల కొరకు అర్రులు చాస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అంబానీ, అదానీ వంటి వారిచ్చే నిధులను ఎన్నికల్లో పారించీ, వారు సమకూర్చిన ప్రత్యేక విమానాల్లో విహరించిన నరేంద్ర మోడీ, అమిత్‌షాలు బ్లాక్‌మనీని వెలికి తీస్తారనుకోవడం భ్రమే. అపర కుబేరులను కాపాడటానికి అన్ని వ్యవస్థలూ సమిష్టిగా ఎలా శ్రమిస్తాయో 'పనామా పేపర్స్' ఉదంతం తెలియచెబుతున్నది.

2014 ఎన్నికల్లో బిజెపికి నిర్ణయాత్మక మెజారిటీ వచ్చి మోడీ ప్రధాని అయ్యాక దేశంలో డాలర్ బిలియనీర్లు, డాలర్ మిలినీయర్లు పెరుగుతున్నారని ప్రపంచ బ్యాంకు పేర్కొంది. అధికారంలోకి వస్తే 100 రోజుల్లో నల్లధనాన్ని వెనక్కి తెప్పించి కుటుంబానికి 15 లక్షలు జమ చేస్తామని చేసిన వాగ్దానం గంగలో కలిసింది. మరోవైపు నల్లధనం దేశం దాటి పోతుందని ప్రపంచ బ్యాంకు లెక్కలు, వాణిజ్య అధ్యయనం సంస్థల నివేదికలు చెబుతున్నాయి. ఈ వ్యవహారంలో భారతదేశానికి చెందిన అనేకమంది జాతకాలు బైటపడటంతో అరుణ్‌జైట్లీ కఠినమైన చర్యలు తీసుకుంటామంటున్నారు. ఇంతకాలమూ హామీలు, హెచ్చరికలకే తప్ప చర్యలకు సంకల్పించలేదు. పనామా పేపర్స్ విషయంలో సంయుక్త బృందాలను ఏర్పాటు చేసినట్టు, దర్యాప్తు సాగిస్తున్నట్టు ఆయన చేసిన ప్రకటనలో కూడా సంకల్పం కంటే మినహాయింపులే అధికంగా ధ్వనించాయి. ఆర్‌బిఐ గవర్నర్ రఘురామ్ రాజన్ ఆస్తుల సంపాదనను తప్పు పట్టవద్దని ఇవన్నీ హేతు బద్ధమైన వ్యాపారాలు కావచ్చునని హితవు పలకడం గమనార్హం. గతంలో విదేశీ ఖాతాలన్నీ అక్రమం కాదంటూనే విచారణ ఆరంభించి అంతిమంగా ఎంతటి నల్లధనాన్ని వెలుగులోకి తెచ్చారో ప్రజలకు తెలుసు. ఇప్పుడు కూడా అదే నాటకాన్ని కొనసాగించకుండా, అక్రమ లావాదేవీలకు పాల్పడిన వారిని నిజాయితీగా నిగ్గుతేల్చాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఏది ఏమైనా నల్లధనం మహమ్మారిని తుదముట్టించాలంటే ప్రపంచీకరణ

**(మిగతాది 44వ పేజీలో)**

# ఇరోం షర్మిలకు సంఘీభావం తెలుపుదాం!

# సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం రద్దుకు పోరాడుదాం!

మణిపూర్ మహిళ ఇరోం షర్మిల చేస్తున్న నిరాహార దీక్షకు పదిహేనేళ్లు నిండాయి. ఇంత సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న దీక్ష ఈ ప్రపంచంలో మరొకటి లేదేమో. ఇదొక ప్రపంచ రికార్డు అనుకోవచ్చు. ఇంత సుదీర్ఘ కాలంగా నిరాహార దీక్ష చేస్తున్నందుకు గాను ఆమె మణిపూర్ ఉక్కు మహిళగా గుర్తింపు పొందింది. ఠాగూర్ శాంతి బహుమతినీ పొందింది. మరెన్నో అవార్డులను పొందింది. ఆమెకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని పలు సంఘాలు, సంస్థలు కోరుతున్నాయి. కానీ ఆమె రికార్డుల కోసమో, అవార్డుల కోసమో, గుర్తింపు కోసమో ఈ పని చేయడం లేదు. ఈ నిరాహార దీక్ష ద్వారా ఆమె కోరుతున్నదేమిటి? గాంధీలా దేశ స్వాతంత్ర్యాన్ని కోరడం లేదు. ఇంకొకరిలా ప్రత్యేక రాష్ట్రాన్నీ కోరడం లేదు. మరొకరిలా రిజర్వేషన్లనూ కోరడం లేదు. లేనివేవో కావాలని అడగడం లేదు. కొత్తవి కల్పించాలనీ అడగడం లేదు.

ప్రపంచంలో అతి పెద్ద రాజ్యాంగంగా గొప్పలు పోయే భారత రాజ్యాంగం దేశ పౌరులందరికీ ప్రాథమిక హక్కులను కల్పిస్తున్నానని చాటింపు వేసుకుంటుంది. ఆ ప్రాథమిక హక్కుల్లోని ఒకానొక హక్కు, అతి ముఖ్యమైన జీవించే హక్కును కాపాడడం కోసం ఇరోం షర్మిల తన ప్రాణాలను ఫణంగా పెట్టి నిరాహార దీక్ష చేస్తున్నది.

నిజానికి మన దేశంలో, ఆ మాటకొస్తే ఏ దేశంలోనైనా హక్కులనేవి పాలకులు వల్లెవేయడానికీ, గొప్పలు చెప్పుకోవడానికి తప్ప సాధారణ ప్రజలకు అందుబాటులో వుండవు. పాలకుల చేతిలో అవి అపహాస్యం పాలవుతుంటాయి. హత్య చేయబడుతుంటాయి. జీవించే హక్కు అందుకు మినహాయింపేమీ కాదు. పాలకుల విధానాల వల్ల పోతున్న ప్రాణాల గురించి కాదిక్కడ మాట్లాడుకుంటున్నది. మనుషులను పట్టుకొని హత్య చేయడం గురించి. సాధారణంగా ఈ హత్యలకు పాలకులు పెట్టే పేరు ఎన్‌కౌంటర్. కొన్ని సార్లు ఈ హత్యలు లాకప్ హత్యలు, ఉరిశిక్షల రూపంలో కూడా వుంటాయి. అయితే ఈ హత్యలకు పాల్పడిన సందర్భాల్లో సాయుధ బలగాలు, లేదా పాలకులు ఆ మరణం పరస్పర కాల్పుల వల్లనో, లాకప్‌లో జరిగిన ఆత్మహత్య వల్లనో సంభవించినట్టుగా చిత్రీకరిస్తారు. ప్రజలు నమ్మరని తెల్సికూడా అబద్ధాలే చెబుతారు తప్ప 'మేమే చంపాం' అని చెప్పరు. ఎందుకంటే అట్లా చంపడానికి వాళ్లకు చట్ట ప్రకారం అనుమతి లేదు. డబ్బుకూ, అధికారానికీ ఎంత ఊడిగం చేసే చట్టాలైనా నేరం అందులోనూ హత్యా నేరం చేశామని ఒప్పుకునే వాళ్లను కనీసంగానైనా శిక్షించకమానవు. ఇట్లా చిత్రీకరించే, నమ్మించే ప్రయత్నం చేసే 'కష్టం' కూడా సాయుధ బలగాలకు కలగకుండా, సాయుధ బలగాలు చేసే హత్యలకూ, అత్యాచారాలకూ, చిత్రహింసలకూ, అరెస్టులకూ, గృహ దహనాలకూ ఒక్క మాటలో చెప్పాలంటే సమస్త విధ్వంసానికీ లైసెన్సునిచ్చే చట్టం ఒకటుంది. అదే సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం (ఏఎఫ్ఎస్‌పీఏ)–1958.

1958లో తయారైన ఈ చట్టం మొదట అసోం, మణిపూర్, నాగాలాండ్‌లోని పర్వత ప్రాంతాల్లో అమలయ్యేది. 1972లో దీన్ని ఈశాన్య ప్రాంతమంతటికీ (అరుణాచల ప్రదేశ్, అసోం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, త్రిపుర, మిజోరాంలకు) విస్తరించారు. బ్రిటిష్ ఆక్రమణకు ముందు ఈశాన్య ప్రాంతం విడి విడి స్వతంత్ర జాతుల, తెగల పాలనలో వుండేది. బ్రిటిష్ వాళ్లు ఈ ప్రాంతాన్ని బలవంతంగా తమ వలస సామ్రాజ్యంలో ఒకటైన భారత దేశంలో కలుపుకున్నారు. బ్రిటిష్ వాళ్లు వెళ్లి పోయిన తర్వాత భారత్‌లో వలస పాలన ప్రత్యక్షంగా అంతమైంది. కానీ ఈశాన్య ప్రాంతంలో మాత్రం కొనసాగింది. ఇప్పుడది భారత్‌కు వలసగా మారింది. తనతో అట్టిపెట్టుకోవడానికి ఆనాటి పాలకులు చేసిన వాగ్దానాలు నీటి మూటలుగా తేలిపోయిన తర్వాత వెనుక ముందులుగా ఈశాన్య ప్రాంతంలోని అన్ని జాతులూ స్వాతంత్ర్యం కోసం పోరాటం ప్రారంభించాయి. ఈ న్యాయమైన పోరాటాలను అణచడానికి అర్థ సైనిక బలగాలనూ, సైన్యాన్ని దించిన పాలకులు ఆ బలగాలకు విచ్చలవిడి అధికారాలను కట్టబెట్టడం కోసం ఈ చట్టాన్ని చేసింది. ఇదే చట్టాన్ని సిక్కు జాతి ప్రజల పోరాటాన్ని అణచివేయడానికి పంజాబు, చండీగర్‌లకు వర్తించేలా సాయుధ బలగాల (పంజాబు, చండీగర్) ప్రత్యేక అధికారాల చట్టం పేరుతో 1983లో చేశారు. కశ్మీరీ ప్రజల ఆజాదీ ఆకాంక్షను కాలరాయడానికి కూడా ఇదే చట్టాన్ని 1990లో సాయుధ బలగాల (జమ్మూ-కశ్మీర్) ప్రత్యేక అధికారాల చట్టం పేరుతో తీసుకొచ్చారు.

ఈ చట్టంలోని సెక్షన్ 4 సాయుధ బలగాలకు దారుణమైన అధికారాలను కట్టబెట్టింది. దీని ప్రకారం ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, నిషేధాజ్ఞలు అమల్లో వున్నప్పుడు అయిదు లేక అంతకంటే ఎక్కువ మంది గుమికూడినా, ఆయుధాలు కలిగి వున్నా, ఏ పరికరాన్నైనా ఆయుధంగా ఉపయోగించినా కాల్పులు జరిపి చంపవచ్చు.

సాయుధ గ్రూపులు దాగి వుండే ప్రదేశాలపై దాడులు చేసి ధ్వంసం చేయవచ్చు. నేరం చేస్తారని అనుమానం వున్నా చాలు ఎవరినైనా వారెంట్ లేకుండా అరెస్టు చేయవచ్చు. అరెస్టు చేసేప్పుడు బలప్రయోగం చేయవచ్చు. వారెంటు లేకుండా సోదాలు చేయవచ్చు. సోదా చేసే క్రమంలో బలప్రయోగం చేయవచ్చు. ఇక్కడ సాయుధ బలగాలు అంటే వైమానిక బలగాలు కూడా కనుక వైమానిక దాడులు కూడా చేయవచ్చు.

అంటే ఈ చట్టం ప్రకారం ఎవర్నీ ఎప్పుడైనా చంపొచ్చు, అరెస్టు చేయొచ్చు, చిత్రహింసలు పెట్టొచ్చు, ఇండ్లు, ఆస్తులు ధ్వంసం చేయొచ్చు. ఎందుకు చంపావంటే శాంతి భద్రతలకు విఘాతం కల్గించారనొచ్చు. ఎందుకు అరెస్టు చేశావంటే నేరం చేస్తారనే అనుమానం వుందనొచ్చు. ఎందుకు ధ్వంసం చేశావంటే మిలిటెంట్లు దాక్కున్నారని అనవచ్చు.

అసలు ఎందుకు చేశావని అడిగేది ఎవరని? అట్లా అడగడమంటే గురి పెట్టిన తుపాకీకి ఎదురుగా నిలబడడమే. అంత ధైర్యం చేసే అవకాశం కూడా ఇవ్వడంలేదీ చట్టం. ఈ చట్టంలోని సెక్షన్ 6 సాయుధ బలగాలకు నేర విచారణ నుండి రక్షణ కల్పిస్తుంది. ఈ సెక్షన్ ప్రకారం సాయుధ బలగాలకు చెందిన ఎవరి మీదనైనా దావా గానీ, కేసుగానీ వేయడానికి వీలు లేదు. కేసు వేయడానికి ముందుగా కేంద్ర ప్రభుత్వం అనుమతి పొందాలి. ఈ కేసులను సాధారణ కోర్టుల్లో కాకుండా,

ఆర్మీ కోర్టుల్లో విచారిస్తారు. ఈ కోర్టుల్లో జరిగే విచారణలు, శిక్షల గురించి ఎవరూ భ్రమలు పెట్టుకోవాల్సిన అవసరం లేదు. శిక్షించే ఉద్దేశమే వుంటే అటువంటి విచ్చలవిడి అధికారాలు ఎందుకు కల్పిస్తారు?

సాధారణంగా పోలీసులకు అరెస్టు, సోదా, ఇంటరాగేషన్ చేసే అధికారం చట్ట ప్రకారం వుంటుంది. అయితే అరెస్టు, సోదాలకు వారెంటు అవసరం వంటి ఆంక్షలు కూడా వుంటాయి. వాటిని పోలీసులు లెక్క చేయరనేది వేరే విషయం. అదే విధంగా అమలు కాకపోయినప్పటికీ ముద్దాయికి కూడా కొన్ని హక్కులున్నాయి. కానీ ఈ చట్టం ప్రకారం సాయుధ బలగాలకు చంపే అధికారం కూడా వుండగా, 'ముద్దాయిల'కు ఎటువంటి కనీస హక్కులు లేవు.

చట్టం ఒప్పుకోని సందర్భాల్లోనే చట్టాన్ని తుంగలో తొక్కి తమ ఇష్టారాజ్యంగా వ్యవహరించే పోలీసులూ, సాయుధ బలగాలు చట్టమే గ్రీన్ సిగ్నల్ ఇస్తుంటే ఇక చెప్పాల్సిందేముంటుంది? ఏఎఫ్ఎస్‌పీఏ 1958 ఇస్తున్న లైసెన్స్‌తో ఈ ప్రాంతాల్లో సాయుధ బలగాలు పాల్పడని దారుణం లేదు. అడుగడుగునా పొంచి వున్న మృత్యువు, అత్యాచారం, హింస, విధ్వంసం నడుమ ఇక్కడి జన జీవనం దుర్భరం అయిపోయింది. బతుక్కీ, చావుకీ నడుమ గీతలు చెరిగిపోయాయి. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత వేల ప్రాణాలు పోయాయి. మరెంతో మంది కనిపించకుండా పోయారు. మహిళలపై అత్యాచారాలకు లెక్కే లేదు. అనాథ పిల్లలు, విధవల సంఖ్య విపరీతంగా పెరుగుతున్నది. అసలిక్కడ జీవితమన్నదే లేకుండా పోయింది. అయితే శవాలుగా మారడం లేకుంటే జీవచ్ఛవాలుగా మిగలడం.

ఈ చట్టం అండగా చేసిన ఘోరాలు కొన్నింటిని మచ్చుకు చెప్పుకుంటే, జమ్మూ-కశ్మీర్‌లోని కుప్వారా జిల్లా, కునన్ పోష్పొరా గ్రామంలో 1991లో సోదా పేరుతో గ్రామస్తులందరినీ కుప్ప వేసి, అందరి ముందూ వంద మంది మహిళలపై లైంగికాత్యాచారం చేశారు. దీనిపై ప్రభుత్వం ఎటువంటి విచారణా జరపలేదు.

జమ్మూ-కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా బిజ్ బెహారా గ్రామంలో ఒక శాంతియుత ప్రదర్శనపై 1993లో బీఎస్ఎఫ్ జరిపిన కాల్పుల్లో దాదాపు 35 మంది పౌరులు చనిపోయారు. ఈ కాల్పులు జరిపిన బీఎస్ఎఫ్ మీద విచారణ జరిపేందుకు ప్రభుత్వం అనుమతించలేదు.

మణిపూర్‌లో రాజధాని ఇంఫాల్ సమీపంలోని మాలం బస్‌స్టాండ్‌లో బస్ కోసం వేచి చూస్తున్న ప్రయాణికులపై 2000 నవంబర్ 1న అసోం రైఫిల్స్ బలగాలు జరిపిన విచ్చలవిడి కాల్పుల్లో పది మంది చనిపోయారు. మృతులలో 62 సంవత్సరాల ఒక వృద్ధురాలు, జాతీయ సాహస బాలుడి అవార్డు పొందిన 18 సంవత్సరాల ఒక బాలుడూ వున్నారు. ఈ దారుణ ఘటనకు కదిలిపోయిన ఇరోం షర్మిల ఇటువంటి దారుణాలకు ఊతం ఇస్తున్న క్రూర చట్టాన్ని రద్దు చేయాలనే డిమాండ్‌తో ఆ తర్వాతి రోజు నుండే నిరాహార దీక్ష మొదలు పెట్టింది. దీక్ష ప్రారంభించిన నాలుగో రోజునే పోలీసులు ఆత్మహత్య ప్రయత్నం కింద ఆమెను అరెస్టు చేశారు. బలవంతంగా ఆహారం తినిపించాలని ప్రయత్నించిన పోలీసులను ఆమె తీవ్రంగా ప్రతిఘటించింది. దానితో బలవంతంగా సెలైన్ ఎక్కించారు. ఆ తర్వాత నుండీ ఆమెను అరెస్టు చేయడం విడుదల చేయడం కొనసాగుతూనే వుండింది. 2006, అక్టోబర్ 2న ఆమెను విడుదల చేయగానే, ఢిల్లీ చేరుకొని గాంధీ సమాధి రాజ్‌ఘాట్ వద్ద తన ఆమరణ నిరాహార దీక్ష కొనసాగించింది. అక్కడి నుండే రాష్ట్రపతికీ, ప్రధాన మంత్రికీ, హోం మంత్రికీ ఏఎఫ్ఎస్‌పీఏ 1958 రద్దును కోరుతూ లేఖలు రాసింది. పోలీసులు ఆ రోజే ఆమెను అరెస్టు చేసి ఢిల్లీ ఎయిమ్స్‌లో చేర్పించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో తిరిగి ఆమెను మణిపూర్ పోలీసులకు అప్పగించారు. ఇప్పటికీ ఆమె ఆసుపత్రిలోనే వుంది. బలవంతంగా సెలైన్ ద్వారా ఇస్తున్న ఆహారం కారణంగా ఆమె ప్రాణాలు నిలిచి వున్నాయి. కానీ ఆమె ఆరోగ్యం తీవ్రంగా క్షీణించింది. పాలిపోయి, పీలగా తయారయింది. ఆమెకు అవయవాలపై పట్టు లేకుండా పోయింది. అవయవాలు ఏవీ సరిగా పనిచేయడం లేదు. ఆమెను పరీక్షిస్తున్న డాక్టర్లు ఏ క్షణానైనా ఆమెకు ఏమైనా జరగవచ్చు అని చెబుతున్నారు. తన మీద మోపిన ఆత్మహత్య కేసు విచారణ కోసం ఆమె ఇటీవల ఢిల్లీ కోర్టులో హాజరైనపుడు తనకి అన్నం తినాలని వుందనీ అయితే ఈ క్రూర చట్టం రద్దుకు హామీని పొందిన తర్వాతనే అని చెప్పింది. నిరాహార దీక్ష మొదలు పెట్టేనాటికి ఆమె 28 సంవత్సరాల నవ యువతి. ఇప్పుడామెకు 43 ఏళ్లు.

ఏళ్ల తరబడి ఇలా ఆస్పత్రిలో వుంటున్న షర్మిలను చూసేందుకు ఆమె తల్లి ఎప్పుడూ వెళ్లదట. కృషించిపోయి పీనుగలాగా మారిన బిడ్డను చూడలేక, చూసి తను బాధపడి బిడ్డను మరింత బాధపెట్టడం ఇష్టం లేక ఆమె వెళ్లడం లేదు. 'నా బిడ్డ ఏ ఆశయం కోసం ఈ పని చేస్తూ వుందో అది నెరవేరే దాకా నేను నా బిడ్డను చూడను' అంటున్నదామె. ఈ తల్లీ బిడ్డలకు సంఘీభావంగా ఒక తల్లుల సంఘమే ఏర్పడింది.

ఏఎఫ్ఎస్‌పీఏ 1958కు వ్యతిరేకంగా ఒక్క షర్మిల మాత్రమే పోరాడ్డం లేదు. దీనికి వ్యతిరేకంగా మణిపూర్‌లో నిరంతరాయంగా మిలిటెంట్ ఆందోళన జరుగుతున్నది. 2004 జూలై 10న తన ఇంట్లో నిద్రిస్తూ వుండిన తంగజం మనోరమ అనే 32 ఏళ్ల యువతిని అసోం రైఫిల్స్ జవాన్లు తీసుకెళ్లి చంపేశారు. ఈ దారుణానికి ప్రతిస్పందనగా 12 మంది మహిళా సామాజిక కార్యకర్తలు ఇంఫాల్‌లోని అసోం రైఫిల్స్ హెడ్‌క్వార్టర్స్ ముందు నగ్న ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శనకు సభ్య సమాజం సిగ్గుతో తలదించుకుంది. కానీ పాలకులకు మాత్రం కొంచెం కూడా సిగ్గనిపించలేదు. ఈ ప్రదర్శన చేసిన వాళ్లలో ఒకరు, మణిపూర్ తల్లుల సంఘం నాయకురాలు న్గాంబీ 'మా మీద సాయుధ బలగాలు నిరంతరం జరిపిన అత్యాచారాలే మమ్మల్ని ఈ పనికి పురికొల్పాయి' అన్నారు. ఆమె మరో సందర్భంలో 'ఈ దుర్మార్గ చట్టం ఎత్తివేయడానికి, తమ జీవితాల్లో కొంచెమైనా శాంతి రావడానికి మణిపూర్ మహిళలు ఎన్నిసార్లు బట్టలు విప్పెయ్యాలో' అన్నారు.

నిజానికి ఈ ప్రాంతాల్లో జరుగుతున్న ఘోరాలు వెలుగులోకి వస్తున్నది కూడా తక్కువే. ఎందుకంటే మీడియా మీద ఆంక్షలు విధించబడుతాయి. మొత్తంగా ఒక అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతున్నదిక్కడ.

ఈ చట్టం ప్రాథమిక హక్కులకు భంగం కల్గిస్తున్నది కనుక రాజ్యాంగ వ్యతిరేకమైనదనీ, అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు కూడా వ్యతిరేకమైనదనీ పలు హక్కుల సంఘాలు, ప్రజాస్వామిక వాదులు చేస్తున్న వాదనలు పాలకులు వినిపించుకోవడం లేదు. దీన్ని సవాల్ చేస్తూ నాగా పీపుల్స్ మూవ్‌మెంట్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా వేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీం కోర్టు ఈ

**(మిగతాది 11వ పేజీలో)**

# 'బాకీ' బతుకుల వెతలు - కాల్‌మనీ దందా వడ్డీ వ్యాపారుల రాజ్యం

కాల్‌మనీ, జీరో వడ్డీ, డైలీ ఫైనాన్స్, ఎస్టీడీ, బారా కటింగ్, గిరి గిరి బ్యాంకు ఇవి కొన్ని పేర్లు మాత్రమే. ఆంధ్ర, తెలంగాణ అన్ని జిల్లాల్లోనూ ఈ వడ్డీ దందా వుంది. దందా ఎందుకంటున్నారంటే ఇది రౌడీయిజంతో కూడి వున్నది కనుక. అందరూ అలాగే అంటున్నారు. ఇది ఒక తెలంగాణకే పరిమితం కాదు. ఆంధ్రప్రదేశ్ కూడ ఈ విషయంలో తక్కువేమి కాదు. అధిక వడ్డీలకు అప్పులిస్తారు. అప్పులు ఇచ్చినందుకు పూచికత్తుగా స్థిర, చరాస్థులు ఏవైనా గాని ఇచ్చిన అప్పుకు అనేక రెట్లు విలువైనవాటిని తాకట్టుగా పెట్టుకుంటారు. ప్రామీసరి నోట్లు రాయించుకోవడం, రిజిస్ట్రేషన్లు వారి పేరుతో చేయించుకోవడం, ఆ ఖర్చులన్నీ అప్పు తీసుకున్న వాళ్లే భరించడంతో పాటు ఇంకా ఆ ఖర్చులు, వడ్డీ అన్నింటిని మినహాయించుకొని అప్పు ఇవ్వడమనే ప్రక్రియ జరుగుతుంది.

సాధారణంగా ఒక మనిషి రెక్కల కష్టంతో బతుకుతాడు. అతనికి అనుకోని ఖర్చు వచ్చి పడుతుంది. డబ్బులు కావాలి. ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు ఆ మనిషికి అందుబాటులో ఉండవు. తన బంధు వర్గంలో అందరికి అటువంటి పరిస్థితే, కనుక తప్పనిసరిగా వడ్డీకి అప్పు యిచ్చే ఎవరో ఒక వడ్డీ వ్యాపారిని ఆశ్రయిస్తాడు. ఇక అక్కడి నుండి ఈ 'బాకీ' బతుకు అనేక మలుపులు తిరుగుతుంది.

తాకట్టు తప్పదు. అడిగినంత వడ్డీకి ఒప్పుకోవాలి. అది మనిషి అమాయకత్వం, అవసరాన్ని బట్టి ఎంతైనా కావచ్చు. సగానికి సగం వడ్డీగా చెల్లించవలసి వచ్చినా ఆశ్చర్యపోనక్కరలేదు. ఎన్ని సంవత్సరాలు వడ్డీ కట్టినా ఇంకా అసలు తీరకపోవడం, తాకట్టు పెట్టినది పూర్తిగా వదులుకోవడంగా కూడ మారిపోవచ్చు. అప్పటికీ ఈ 'బాకీ' బతుకు పూర్తిగా చితికి వడ్డీ వ్యాపారికి ఇంకా పీల్చుకోవడానికి నెత్తురు చుక్క దొరకకపోతే అదే ఈ మనిషికి విముక్తి తప్ప వడ్డీల సూడి గుండం నుండి బయట పడేందుకు మరో మార్గం లేదు.

దినపత్రికల్లో వచ్చిన కొన్ని వార్తలు చూస్తే, అంటే వాస్తవ ఘటనలు చూస్తే ఈ వడ్డీల దందా ఎంత విస్తృతంగా సాగుతుందో, ఈ సమస్య ఎంత లోతుగా ఉందో సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో ఎంత ఘోరంగా, అరాచకంగా మారుతున్నాయో అర్థమవుతుంది. నాగరికత విలువలు, ఉన్నత సంస్కృతి అని గొప్పలు చెప్పుకునే చోట వాటిని 'డబ్బు' పెట్టుబడి ఎలా భ్రష్టు పట్టించిందో చూస్తాము.

తెలంగాణలో అదో నగరం. అక్కడి ఒక ఫుట్ ఫాత్ వ్యాపారి అనారోగ్యానికి గురైన కూతురి వైద్యం కోసం 5 వేల రూపాయలు అప్పు తీసుకున్నారు. రోజు వంద రూపాయలు జమ చేస్తున్నాడు. ఆ చిరు వ్యాపారం సాగక పోవడంతో మధ్యలో డబ్బులు కట్టలేకపోయాడు. అప్పుడు ఏం జరిగిందంటే అప్పు ఇచ్చిన వడ్డీ వ్యాపారి బాకీ పడ్డ వాని ఇంట్లోకి అర్థ రాత్రి చొరబడి, వయస్సులో వున్న కూతురిని ఎత్తుకపోయాడు. ఈ అవమానానికి ఆ ఫుట్ ఫాత్ వ్యాపారి 'బాకీ' బతుకు ఆత్మహత్యతో ముగించుకున్నాడు. ఇక్కడ ఏ నాగరికత, విలువలు, ఏ సంస్కృతి రాజ్యమేలినట్లు? వడ్డీ వ్యాపారి దందా కొనసాగుతూనే ఉంది. మన నాగరికత, విలువలు, సంస్కృతి 'వెలుగొందుతూనే' ఉన్నాయి.

కాంట్రాక్టు కార్మికుల నుండి ప్రభుత్వ ఉద్యోగుల వరకు, చిరు వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, తోపుడు బండ్లు, పాన్ షాపులు, హోటళ్లు కుల వృత్తులు చేసుకునే వాళ్లు ఒక్క మాటగా చెప్పాలంటే రోజు గడవడం కోసం రెక్కలు ముక్కలు చేసుకొని బతికే బడుగు బతుకుల వాళ్లు వీరే ఈ వడ్డీ వ్యాపారుల దందాకు బలవుతున్న వాళ్లు. 3 నుండి 15 రూపాయల వరకు వడ్డీ కట్టడానికి సిద్ధపడి, అన్ని రకాల ఆంక్షలకు కట్టుబడి ఉన్నదంతా తాకట్టు రాసి అవమానాల్ని భరిస్తూ రోజు వారి భయాలతో తమ కోసం కాకుండా వడ్డీలు కట్టడం కోసం బతుకుతున్న 'జ్ఞానాన్ని' పొందుతూ తమకు ఇక విముక్తి లేదనే నిరాశలో బతుకుతున్నారు. ఇదీ సామాజిక ప్రగతి. మన పార్లమెంటరీ రాజకీయ నాయకులు, ప్రజాస్వామిక ప్రభుత్వాలు సంపన్న భారత దేశాన్ని తాకట్టు పెట్టి కులుకుతుంటే–దేశంలోనే వడ్డీ వ్యాపారులు 'బాకీ' బతుకులతో ఎలా ఆడుకుంటున్నారో ఆంధ్రాలో విజయవాడ కథనాల్ని చూస్తే కళ్లకు కట్టినట్లుంటుంది.

అది డిశంబర్ పదో తారీకు. ఒక మహిళ విజయవాడ నగర పోలీసు కమీషనర్‌ను కలిసి ఎలమంచిలి శ్రీరామ మూర్తి (రాము) అనే వ్యక్తి పది లక్షల రూపాయలు అప్పు ఇస్తానని హామీ ఇచ్చి ప్రామీసరి నోట్లు, స్టాంపు పేపర్లు రాయించుకొని తనపై అత్యాచారం చేసాడని సహచరుల లైంగిక వాంఛలు తీర్చాలని ఒత్తిడి చేశాడని చెప్పింది. ఆ తరువాత అటువంటి వడ్డీ వ్యాపారుల వేదింపుల గురించి 227 కేసులు నమోదయ్యాయి. నమోదు కానివి వేల సంఖ్యలో ఉన్నాయని మనం అర్థం చేసుకోవచ్చు. ఈ విషయాన్ని స్వయంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అసెంబ్లీలో డిశంబర్ 18న ప్రకటించాడు.

'కాల్‌మనీ' వ్యాపారులు అప్పు కోసం వెళ్లిన మహిళలను లైంగిక వేదింపులకు గురి చేస్తున్నారని, లోబరుచుకుంటున్నారని (సెక్స్ వ్యాపారం లోకి నెట్టి వేస్తున్నారని, వందల వీడియో క్యాసెట్లు దొరికాయి) మహిళల భద్రత సమస్యగా మారిందని బాధిత కుటుంబాలు చెబుతున్నాయి. అంటే 'కాల్‌మనీ' వ్యాపారం – సెక్స్ రాకెట్ వ్యవహారం జంటగానే సాగుతున్నాయని అర్థమవుతుంది.

ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలను కుదిపి వేస్తున్న ఈ వడ్డీల సమస్యకు మూల కారణం ఏమిటి? ఈ సమస్యకు పరిష్కారం లేదా! చట్టాన్ని కాపాడే పోలీసు అధికారులే 5 వందల కోట్లు రూపాయలు పెట్టుబడులు పెట్టి అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ, వడ్డీ వ్యాపారాలు చేస్తున్నట్లు స్వయంగా ఏఎస్ మోహన్‌రెడ్డి తెలిపాడు.

డ్వాక్రా మహిళలకు రుణాలు, కౌలు రైతులకు రుణాలు, స్వయం సేవక సంస్థలకు రుణాలు అంటూ ప్రభుత్వాలు చేసిన ఎన్నికల వాగ్దానాలన్నీ బూటకమని తేలిపోయాయి బ్యాంకులు పేదలకు అప్పులు ఇవ్వవు. గతంలో తీసుకున్న అప్పులు తీర్చలేదని వున్నదంతా జప్తు చేస్తాయి. ప్రభుత్వాలు మోసం చేస్తాయి. వ్యాపార వర్గాలకు లక్షల కోట్ల రూపాయలు బ్యాంకుల నుండి రుణాలు ఇస్తాయి. వాళ్లు వడ్డీ కట్టకపోతే రద్దు చేస్తాయి. ఇంకా రాయితీలు ఇస్తాయి. ఇంకా ప్రజల డబ్బులు వాటాలు వేసుకొని పంచుకునే పన్నాగాలు పన్నుతారు. ప్రైవేట్, పబ్లిక్ సెక్టారులు కలుపుతారు. వారికి వడ్డీ లేని అప్పులు ఇస్తారు. లాభాలు వారికి-నష్టాలు ప్రజలకు పంచుతారు.

నిరుద్యోగం, కరువు పరిస్థితులు, అధిక ధరలు, ద్రవ్యోల్బణం, నిజ వేతనాలు తగ్గడం, అతివృష్టి, అనావృష్టి, ఆకలి చావులు, ఆత్మహత్యలు, అనారోగ్య మరణాలు వీటన్నింటికి కారణం ఈ పాలక వర్గాలే. వడ్డీ వ్యాపారుల క్రూర దోపిడీ పీడనలకు రాజకీయ నాయకుల ప్రత్యక్ష, పరోక్ష మద్దతున్నదనేది జగమెరిగిన సత్యం.

నైతిక పతనం, మానసిక వేదన, సభ్య సమాజపు విలువల హననం జరిగిపోతున్నవి. అరాచకపు పరిస్థితులు నెలకొంటున్నాయి. అవి నగ్నంగా, బహిరంగంగా, యధేచ్ఛగా, వికృత రూపాల్లో మనుసుల్ని వేంటాడి, వేటాడి భయపెడుతున్నాయి. హత్యలు చేస్తున్నాయి. ఆత్మ హత్యలకు పురికొల్పుతున్నాయి.

పసితనం, మాతృత్వం, కుటుంబ సంబంధం, సామాజిక బాధ్యత, సాంప్రదాయం, కట్టుబాట్లు, నీతి-నియమాలు, నాగరికత, అభివృద్ధి, ప్రగతి, ప్రజాస్వామ్యం, విజ్ఞానం, విశాల దృక్పథం ఇవేవి ఈ వ్యాపార సంస్కృతి, వడ్డీ లాభాల వేట ముందు కానరావడం లేదు. అందుకే పసి పిల్లల్ని అమ్ముతారు. వాళ్లు పనిచేసి డబ్బులు సంపాదించి తెస్తే వడ్డీ కింద జమ కడతారు. పసి పిల్లల తల్లులని కూడా చూడకుండా అత్యాచారాలు చేస్తారు. కుటుంబంలోని తల్లి-పిల్లలను, భార్య-భర్తలను, విడదీసి వలస కూలీలుగా అమ్ముకుంటారు. ఏ విలువలు లేకుండా బతకడమే వారు తెస్తున్న నూతన విలువ. వారు చెప్పే అన్ని విలువల పరమార్థం వడ్డీ కట్టడమే. అది మాత్రమే వారికి తెలిసిన ఏకైక ప్రజాస్వామిక విలువ. ఈ రాజ్యం వడ్డీ వ్యాపారుల రాజ్యం. వడ్డీల విలువే మనిషి విలువ. సమాజానికి ఒక నీతి, ఒక నియమం, ఒక విలువ ఉన్నాయని అవి ఇంకా కొనసాగుతున్నాయని మనమింకా భ్రమలోనే ఉంటే గనుక ఆంధ్రా, తెలంగాణ పాలకుల చేతుల్లో ఉన్న మహత్తు మత్తు మనమీద బలంగా పని చేస్తున్నట్లే.

ఆదివాసీ సమాజంలో వడ్డీ వ్యాపారం లేదు. వడ్డీకి డబ్బులివ్వడం అక్కడక్కడా వున్నా అది వ్యాపార ధోరణిగా లేదు. అలా వడ్డీకి విత్తనాలు ఇచ్చినా పంట పండితేనే వడ్డీ వసూలు చేయడం వుంటుంది. హాస్పిటల్ ఖర్చుల కోసం డబ్బులిచ్చినా, శుభ కార్యాల కోసం డబ్బులిచ్చినా వడ్డీ తీసుకోరు. అప్పు కూడ తీర్చమని ఒత్తిడి చేయరు. చాల వరకు అటువంటి అవసరాలకు సహకార ధోరణితో తలో చేయి వేసి ఆదుకోవడమే ఉంటుంది. అటువంటి చోట నేడు జనతన సర్కార్లు ఏర్పర్చుకుంటున్న ఆదివాసీ ప్రజలు విత్తనాలు, తిండి అవసరాలు (కరువు పరిస్థితులు), వైద్య అవసరాల కోసం జనతన సర్కారే బాధ్యత పడి సంక్షేమ పథకాలు, సహకార సంఘాల ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్నది. ఇది బాగా వెనకబడిన ఆదివాసీ సమాజాల్లోని అభివృద్ధి. ప్రజల నియంత్రణలో ఉన్న అభివృద్ధి. లాభాపేక్ష దోపిడీ రాజకీయాలు అక్కడ లేవు.

నాగరిక సమాజం అభివృద్ధి చెందిన సమాజమంటూ గొప్పలు చెప్పుకుంటున్న చోట మనిషిని మనిషి దోచుకోవడం, అవమానించడం, అత్యాచారాలు చేయడం, మనుషుల్ని ముఖ్యంగా మహిళల్ని అమ్ముకోవడం జరుగుతుంది. సహకారం, సహానుభూతి, పరస్పర గౌరవ విశ్వాసాలు ఎక్కడా కానరావడం లేదు. ఇది సమాజమైతే సమిష్టి సహజీవన, సహకార ధోరణి వ్యక్తం కావాలి. అవేవి కానరానంతగా ఈ సామాజిక వ్యవస్థ డబ్బు సంబంధాలలోకి దిగజారిపోయిందా? బతుకుకు గ్యారంటీ లేదు. మహిళలకు భద్రత లేదు. రేపటికి గ్యారంటీ లేదు. విలువలు లేవు. అరాచకం రాజ్యమేలుతుంది. ఇక్కడ ప్రభుత్వాలు, పాలకులు ఈ కుళ్లిన వ్యవస్థకు కాపాల కాసే పోలీసు అధికారులు అందరూ కలిసి కూడబలుక్కోని వాటాలు వేసుకొని పంచుక తింటున్నారు. వాళ్లు సామాజిక ప్రగతిని దేశ భవిష్యత్‌ను నాశనం చేస్తున్నారు. వీరు మానవ విశ్వాసాలను, మానవ మనుగడను ధ్వంసం చేస్తున్నారు. ఇది సామాజిక సమస్య. మనందరి ఉమ్మడి సమస్య.

మీ ఆశ, ఆకాంక్ష మానవ విలువలు కాపాడడమే అయితే కనుక అక్కడ కూడ జనతన సర్కార్లు ఏర్పర్చండి. అందుకు ముందు విముక్తి బాటలో ప్రజల్ని సిద్ధం చేయండి. కాల్ మనీ పోయి కాలం మన చేతుల్లోకి వస్తుంది. ప్రజారాజ్యాధికారం కోసం పోరాడడం ఒక్కటే పరిష్కారం. ★

**"విద్యలేని సైనికులుంటే చాలా యిబ్బందే. వారు కూడా తమ తీరిక వేళల్లో అధ్యయనం చేయాలి. మనం ఇప్పుడు మరో సమరంలో ఉన్నాం. జనరల్‌లు, కల్నల్‌లు, కెప్టెన్‌లు, లెఫ్టినెంట్‌లు, సాధారణ సైనికులు సరికొత్త సన్నాహాలు చేసుకోవాలి. అన్ని స్థాయిల కేడర్లు సాంఘికశాస్త్రం, సాహిత్యం, విజ్ఞాన శాస్త్రాలను కరతాలమలకం చేసుకోవాలి. అలా కాకపోతే ఒక కమాండర్ యుద్ధ రంగంలోకి దూసుకొనిపోయిన తర్వాత, అక్కడ అతడికి ఉపాయాలు తట్టకపోతే తుపాకులు మూగపోతాయి."**

**-కా. మావో**

## జులై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరవీరుల సంస్మరణ వారాన్ని పల్లె పల్లెన జరుపండి!

నక్సల్బరీ పోరాటం నుండి నేటి వరకు నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయటానికి వేలాది మంది కామ్రేడ్స్ తమ ప్రాణాలు అర్పించారు. భారత విప్లవ మార్గదర్శకులు, మన పార్టీ వ్యవస్థాపకులు కామ్రేడ్ చారుమజుందార్ 1972 జులై 28న, కామ్రేడ్ కన్హయ్ ఛటర్జీ 1982 జులై 18న అమరులయ్యారు. ఈ ఇద్దరు నాయకులు సాయుధ పోరాటాన్ని, ప్రజాయుద్ధాన్ని దేశ రాజకీయ ఎజెండా మీదికి తెచ్చారు. సాయుధ పోరాటం మన దేశంలో ఎజెండా మీదికి వచ్చినప్పటి నుండి దేశ రాజకీయ రంగంలో పెను మార్పులు జరిగాయి. విప్లవోద్యమ పురోగమన క్రమంలో కేంద్రకమిటీ పొలిట్‌బ్యూరో నుండి సాధారణ ప్రజల వరకు అనేక మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. ప్రజలను, ప్రజా యుద్ధాన్ని అణచటానికి చేపట్టిన ఆపరేషన్ గ్రీన్‌హంట్ మొదలైన తర్వాత అమరుల త్యాగాలు పెరుగుతూనే ఉన్నాయి. వీరందరిని సంస్మరించుకోవడానికి కామ్రేడ్ చారుమజుందార్ అమరుడయిన జులై 28ని అమరవీరుల దినంగా ప్రతి సంవత్సరం జరుపుకోవాలని నిర్ణయించుకోవడమైనది. శత్రువు కల్పించుతున్న ఆటంకాలను దృష్టిలో ఉంచుకొని జులై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరవీరుల సంస్మరణ వారంగా ప్రతి సంవత్సరం నిర్వహించుకుంటున్నాం. ప్రజల కొరకు ప్రాణాలర్పించిన అమరుల మహోన్నత త్యాగాలను స్మరిస్తూ, వారికి హృదయ పూర్వక శ్రద్ధాంజలి ఘటించి, వారి ఆశయ సాధనకు అంకితమవుతామని ప్రతిజ్ఞ చేద్దాం.

తెలంగాణలో గత సంవత్సర కాలంలో ఎన్‌కౌంటర్లు, బూటకపు ఎన్‌కౌంటర్లలో విలువైన కామ్రేడ్లను కోల్పోయాం. తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని లంకపల్లి వద్ద జూన్ 12, 2015న జరిగిన ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్స్ కమల, సోని, వివేక్‌లు అమరులయ్యారు. సెప్టెంబర్ 15, 2015న వరంగల్ జిల్లా తాడ్వాయి మండలంలోని మొద్దుగుట్ట అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్స్ మహిత, సాగర్‌లను పట్టుకొని తీవ్రమైన చిత్రహింసలు పెట్టి (కా. మహితపై అత్యాచారం జరిపి) హత్యచేశారు. డిసెంబర్ 28, 2015న సుక్మా జిల్లా పూసుగూడెం గ్రామ సమీపంలో జరిగిన బూటకపు ఎన్‌కౌంటరులో కామ్రేడ్ నగేశ్; మార్చి 1,2016న బీజాపూర్ జిల్లా బొట్టెం గ్రామం వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్స్ గొట్టిముక్కుల రమేష్ (లచ్చన్న), కా. యూసుఫ్ బీ (సోని), కా. మిన్కో కా. చందు, కా. సృజన (నవత, రాగో), కా. దనసరి సారక్క (అనిత), కా. పద్దం చైతు (రోషన్), కా. రామె, కా. దేవెలు అమరులయ్యారు. తెలంగాణ ప్రజాఫ్రంట్ అధ్యక్షుడు కా. మద్దిలేటి అక్టోబర్ 14, 2015న గుండెపోటుతో అమరుడయ్యాడు.

అమరవీరుల సంస్మరణ వారాన్ని ఉద్యమ ప్రాంతాలలో స్ఫూర్తి దాయకంగా జరుపండి. ఈ స్మారక వారం సందర్భంగా ప్రజల్ని పెద్ద ఎత్తున కదిలిద్దాం. అందుబాటులో ఉన్న అన్ని సాధనాలను వీలైనంత విస్తృతంగా ఉపయోగించుకుంటూ పార్టీ శ్రేణులలో, పీ.ఎల్.జీ.ఏ. బలగాలలో, గ్రామాలలో అమరవీరుల గొప్ప త్యాగాలను పెద్ద ఎత్తున ప్రచారం చేయండి. అవకాశం ఉన్న గ్రామాలలో/బస్తీలలో అమరవీరుల స్థూపాలను నిర్మించండి. పోస్టర్లు, బ్యానర్లు, కరపత్రాలు, వాల్‌రైటింగ్, పత్రికా ప్రకటనల రూపంలో అమరుల ఆదర్శాలను ఎత్తిపట్టండి. ప్రతి గ్రామంలో / బస్తీలలో సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించండి. ప్రజల్ని పెద్ద ఎత్తున సమీకరించటం ద్వారా ప్రజలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించండి. అమరుల త్యాగాలు, ధైర్య సాహసాలు, దృఢ సంకల్పం, ఆదర్శాలను స్మరించుకుంటూ, వాటిని అలవరుచుకుంటూ నూతన ప్రజాస్వామిక భారత నిర్మాణానికై వారి మార్గాన్ని అనుసరించేలా ప్రజల్ని ఉత్తేజపరుద్దాం. అమరుల బాటలో ముందుకు సాగుదాం. అమరవీరులకు మనమివ్వగలిగిన నిజమైన నివాళి ఇదే.

**(చివరి పేజీ తరువాయి)**

సమావేశాలకు, అమరవీరులకు నివాళులర్పించడానికి అనుమతి ఇవ్వకుండా ఏప్రిల్ 20న ఎప్పటిలా 144 సెక్షన్ విధించినాడు.

ప్రత్యేక తెలంగాణ పోరాటంలో ఆదివాసుల భాగస్వామ్యం తక్కువేమి కాదు. క్రియాశీలకంగా పాల్గొన్నారు. హద్దులు, ఆంక్షలతో కూడిన తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. టీ.ఆర్.ఎస్. పార్టీ అధికారంలోకి వచ్చింది. కే.సీ.ఆర్. ముఖ్యమంత్రి పదవిని చేపట్టినాడు. కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో 2015 ఏప్రిల్ 20 న అమరవీరుల సంస్మరణ దినం మొదటిది. అమరులను స్మరించుకుంటూ సభలు, సమావేశాలు జరుపుకోవచ్చని ఆదివాసులు ఆశపడ్డారు. కానీ నిరాశే మిగిలింది. గత ప్రభుత్వాల లాగనే ఇంద్రవెల్లిలో 144 సెక్షన్ విధించి స్థూపం చుట్టూ పోలీసుల కాపలా పెట్టి ఎవరిని దగ్గరకు రానివ్వలేదు. దీనితో ఆదివాసులు టీ.ఆర్.ఎస్. ప్రభుత్వంపై నిరసన తెలియజేస్తూ ప్రతీ సంవత్సరం లాగానే గ్రామాలలో, గూడెలలో సభలు, సమావేశాలు నిర్వహించి ఇంద్రవెల్లి అమరువీరులను స్మరించుకుంటూ నివాళు లర్పించారు.

టీ.ఆర్.ఎస్. ప్రభుత్వ చర్యకు వ్యతిరేకంగా ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, హక్కుల సంఘాల నాయకులు, ఆదివాసులు నిరసన తెలియజేయడంతో టీ.ఆర్.ఎస్. ప్రభుత్వం ఏప్రిల్ 20, 2016న ఇంద్రవెల్లిలో 144 సెక్షన్ ఎత్తివేసి సభలకు, సమావేశాలకు అనుమతినివ్వకుండా పెద్ద ఎత్తున ప్రజలు రాకుండా ఆంక్షలు పెట్టి సాంప్రదాయ పద్ధతిలో నివాళులర్పించడానికి అనుమతినిచ్చింది. దీనితో ఆదివాసులు, అమరుల కుటుంబ సభ్యులు కలిసి ఇంద్రవెల్లి స్థూపానికి ఎర్రరంగు వేసి జెండాను ఎత్తి అమరవీరులను స్మరించుకుంటూ, వారి త్యాగాలను ఎత్తిపడుతూ, అమరుల ఆశయాలను కొనసాగిస్తామని శపథం చేస్తూ, ఇంద్రవెల్లి అమరవీరులకు జోహార్లు అంటూ కుటుంబ సభ్యులు, ఆదివాసీ సంఘాల నాయకులు, వందలాది ఆదివాసులు ఇంద్రవెల్లి అమరువీరులకు ఘనంగా నివాళు లర్పించారు. ★

# బోల్షివీకరణ సాధించడానికి కొన్ని మౌలిక షరతులు

**- స్టాలిన్**

(జర్మన్ కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు హెర్జోగ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కామ్రేడ్ స్టాలిన్ చెప్పిన అంశాలివి. 'జర్మన్ కమ్యూనిస్టు పార్టీకి గల అవకాశాలూ, బోల్షివీకరణ సమస్య' అనే పేరిట ఈ ఇంటర్వ్యూ 'ప్రావ్దా' పత్రిక నెంబర్ 27లో, 1925 ఫిబ్రవరి 3న ప్రచురితమైనది.)

బోల్షివీకరణను సాధించాలంటే కనీసం కొన్ని మౌలిక షరతులను పరిపూర్తి చేయాలి. ఇవి లేకుండా కమ్యూనిస్టు పార్టీల బోల్షివీకరణ సాధ్యం కాదు.

1. పార్టీ తనను తాను పార్లమెంటరీ ఎన్నికల యంత్రాంగానికి ఉపాంగంగా భావించుకోరాదు. నిజానికి సోషల్ డెమాక్రటిక్ పార్టీ తనను తాను ట్రేడ్ యూనియన్లకు పనికిమాలిన ఒక అనుబంధంగా భావించుకోరాదు. కొన్ని అరాచకవాద శక్తులు కొన్నిసార్లు తాము అలాంటివారమని చెప్పుకుంటాయి. పార్టీ తనను తాను కార్మిక వర్గ అత్యున్నత వర్గసంస్థగా భావించుకోవాలి. దాని కర్తవ్యం ఇతర అన్ని రూపాల కార్మిక వర్గ సంస్థలనూ, అంటే ట్రేడ్ యూనియన్ల నుండి మొదలుకొని పార్లమెంటులోని పార్టీ బృందం వరకూ అన్నిటికీ నాయకత్వం వహించడం.

2. పార్టీ, ముఖ్యంగా దాని నాయకత్వ శక్తులు విప్లవాచరణతో విడదీయరాని సంబంధాన్ని కలిగి ఉన్న మార్క్సిజం విప్లవ సిద్ధాంతంపై కూలంకషమైన పట్టు సంపాదించాలి.

3. తయారుగా ఉన్న పార్ములాల మీదా, చారిత్రకంగా ఉన్న పోలికల మీదా ఆధారపడి పార్టీ తన నినాదాలనూ, ఆదేశాలనూ రూపొందించకూడదు. విప్లవోద్యమ నిర్దిష్ట అంతర్గత, అంతర్జాతీయ పరిస్థితుల మీద నిశితంగా చేసిన విశ్లేషణల ఫలితంగా అవి రూపొందాలి. అలాగే అది తప్పనిసరిగా అన్ని దేశాల విప్లవాల అనుభవాలను దృష్టిలో ఉంచుకోవాలి.

4. పార్టీ ఈ నినాదాలు, ఆదేశాలు ఎంత సరైనవనేదాన్ని విప్లవ ప్రజానీకం చేసే పోరాటాల కొలిమిలోనే నిగ్గుదేల్చాలి.

5. పార్టీ మొత్తం పని అంతటినీ, ప్రత్యేకించి దానిలో ఇప్పటికీ సోషల్ డెమాక్రటిక్ సంప్రదాయాలు నిర్మూలన కాకుండా యింకా మిగిలి ఉన్నప్పుడు, పార్టీ వేసే ప్రతి అడుగూ, తీసుకునే ప్రతి చర్యా విశాల కార్మిక ప్రజారాశులను విప్లవస్ఫూర్తితో విప్లవీకరించడానికీ, వారికి శిక్షణ గరపడానికీ, వారిని విద్యావంతం చేయడానికీ, సహజంగా దోహదపడేలా నూతన విప్లవ పద్ధతుల్లో తిరిగి సంఘటితం చేయాల్సి ఉంటుంది.

6. పార్టీ తన పనిలో సూత్రాలను కచ్చితంగా కట్టుబడి ఉండడాన్ని (దీన్ని సెక్టేరియనిజంతో గందరగోళపరచరాదు!) ప్రజలతో అత్యధిక సంబంధాలనూ, బంధాలనూ కలిగి ఉండటంతో (తోక పట్టుకొని పోయే ధోరణితో దీన్ని గందరగోళ పరచరాదు) జోడించాలి. ఇలా చేయకపోతే పార్టీ ప్రజలకు ఏమీ నేర్పలేకపోవడమే కాదు వారి నుండి ఏమీ నేర్చుకోలేదు కూడా, అది ప్రజలకు నాయకత్వం వహించి వారిని తన స్థాయికి ఎదిగించలేక పోవడమే కాక, వారి అభిప్రాయాలను పట్టించుకొని వారి తక్షణ అవసరాలను ముందే అంచనా కట్టలేకపోతుంది కూడా.

7. పార్టీ తన పనిలో రాజీలేని విప్లవస్ఫూర్తిని (దీన్ని విప్లవ దుందుడుకువాదంతో గందరగోళ పరచరాదు!) అత్యధికమైన పట్టువిడుపులతో, విన్యాసాలు చేయగల సామర్థ్యంతో (దీన్ని అవకాశవాదంతో గందరగోళ పరచరాదు) జోడించాలి. ఇలా చేయకపోతే పార్టీ అన్ని రకాల పోరాట, నిర్మాణ రూపాలపై పట్టు సాధించలేక పోతుంది, కార్మిక వర్గ రోజువారి సమస్యలను కార్మిక వర్గ విప్లవ మౌలిక ప్రయోజనాలతో జోడించలేక పోతుంది, అలాగే తన పనిలో చట్టబద్ధ, చట్టవ్యతిరేక పోరాటాలను జోడించలేకపోతుంది.

8. పార్టీ తన తప్పులను కప్పిపుచ్చుకోకూడదు, అది విమర్శలకు వెరవకూడదు. అది తన తప్పుల నుండి నేర్చుకోవడం ద్వారా తన కార్యకర్తలను మెరుగుపరిచి వారిని విద్యావంతం చేయాలి.

9. పార్టీ తన ముఖ్యమైన బృందంలోకి పురోగామి యోధుల నుండి అత్యున్నత శక్తులను భర్తీ చేసుకోవాలి. వారు విప్లవ కార్మికవర్గ ఆకాంక్షలకు అసలైన ప్రతినిధులుగా ఉండేలా ఆశయం పట్ల తగినంత అంకితభావం కలిగినవారై ఉండాలి. కార్మికవర్గ విప్లవానికి నిజమైన నాయకులుగా మారడానికి తగినంత అనుభవం కలిగిన వారై ఉండాలి. వారు లెనినిజం వ్యూహం, ఎత్తుగడలను అన్వయించ గలిగిన వారై వుండాలి.

10. అత్యున్నత సమైక్యతను సాధించే లక్ష్యంతో పార్టీ తన సంస్థల సామాజిక పొందికను ప్రణాళికా బద్ధంగా మెరుగుపర్చుకుంటూ, చెడగొట్టే అవకాశవాద శక్తులను తన నుండి ఏరి పారేయాలి.

11. సైద్ధాంతిక (ఐడియాలాజికల్)సమైక్యత, ఉద్యమ లక్ష్యం పట్ల స్పష్టత, ఆచరణాత్మక చర్యలో సమైక్యత, పార్టీ సభ్యుల విశాల రాశులకు పార్టీ కర్తవ్యాల పట్ల ఉన్న అవగాహనల ప్రతిపాదికన పార్టీ ఉక్కు క్రమశిక్షణను సాధించాలి.

12. పార్టీ ప్రణాళికబద్ధంగా తన నిర్ణయాల, ఆదేశాల అమలు తీరుతెన్నులను తెలుసుకోవాలి. ఇది జరగకుంటే ఈ నిర్ణయాలూ, ఆదేశాలూ ఒట్టి వాగ్దానాలుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. ఇది పార్టీపై విశాల కార్మికరాసుల కున్న విశ్వాసాన్ని వమ్ము చేస్తుంది.

---

**"ఇటు దోపిడీదారుల ప్రతిఘటనను నలిపి వేయడానికి, అటు సోషలిస్టు ఆర్థిక వ్యవస్థను "నిర్మించే" కృషిలో అపారమైన ప్రజా బాహుళ్యాన్ని - రైతులనూ, పెటీ బూర్జువాలనూ, పాక్షిక కార్మికులనూ - నడిపించడానికీ, కార్మిక వర్గానికి రాజ్యాధికారం, ఒక కేంద్రీకృత బలప్రయోగ సంస్థ, ఒక హింసాత్మక సంస్థ అవసరం."**

**రాజ్యం, విప్లవం -లెనిన్**

# ఆపరేషన్ గ్రీన్‌హంట్ 3వ దాడి మధ్యనే

# విజయవంతమైన ఒడిశా రాష్ట్ర ప్రథమ మహాసభ




ఒడిశా రాష్ట్రంలో 80వ, 90వ దశకంలో విప్లవోద్యమ విస్తరణ మొదలయింది. దక్షిణ ఒడిశాలో ఆంధ్ర, దండకారణ్య విప్లవోద్యమ ప్రభావం, ఉత్తర ఒడిశాలో బీహార్, జార్ఖండ్ పోరాట ప్రభావం ఉన్నది. ఒడిశాలో విప్లవోద్యమ విస్తరణ కోసం ప్రయత్నించారు. ఐక్యతా కాంగ్రెస్ (9వ కాంగ్రెస్) తర్వాత డీ.కే – బీహార్– జార్ఖండ్‌ల మధ్య ప్రాంతంలో ఉద్యమ విస్తరణ కొసం నిర్ణయించారు. ఈ నిర్ణయాన్ని అమలు చేయడానికి 2007లో, 2010లో కృషి చేశారు.

ఈ మొత్తం కాలంలో ఇప్పటి వరకు 111 మంది కామ్రేడ్స్ తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించినారు. అమరుల త్యాగాల ఫలితం, అనేక మంది కామ్రేడ్స్ కృషి వలన విప్లవోద్యమం రాష్ట్ర స్థాయికి ఎదిగింది. 2015 ఆగస్టులో రాష్ట్ర మహాసభను శత్రు నిర్బంధం మధ్యలో విజయవంతంగా జరుపుకున్నారు. ఇది ఒడిశా చరిత్రలో చారిత్రాత్మకమైనది. ఈ మహాసభకు 6గురు మహిళా కామ్రేడ్స్‌తో సహా 24 మంది కామ్రేడ్స్ ప్రతినిధులుగా హాజరయినారు. పీ.ఓ.ఆర్.తో పాటు 14 తీర్మానాలను మహాసభ అమోదించింది. మహాసభ 8 రోజులు ఉత్సాహ వాతావరణంలో జరిగింది.

**తీర్మానాలు**

1. అమరవీరులకు జోహార్లు.
2. జైలు కామ్రేడ్స్‌కు జేజేలు.
3. జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు.
4. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై పోరాటాలు కొనసాగించాలి.
5. బ్రాహ్మణీయ హిందూ మతోన్మాద ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడాలి.
6. దళిత, మత మైనారిటీల సమస్యలపై పోరాడాలి.
7. రైతాంగ సమస్యలపై పోరాటాలు చేపట్టాలి.
8. కరువు సమస్యపై, వలస కార్మికుల హక్కులకై పోరాడాలి.
9. మహిళా సమస్యలు, మహిళలపై అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడాలి.
10. నిర్వాసిత సమస్యకు వ్యతిరేకంగా పోరాడాలి.
11. ప్రత్యేక కోసల రాష్ట్రం కొరకు జరుగుతున్న పోరాటాన్ని బలపరచాలి.
12. కార్మిక చట్టాల సవరింపు పేరుతో హక్కులను కాలరాచే పాలకవర్గాల కుట్రలకు వ్యతిరేకంగా పోరాడాలి.
13. డీ.కే., దండకారణ్య, బీహార్–జార్ఖండ్‌లలో జరుగుతున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్ 3వ ఫాసిస్టు దాడికి వ్యతిరేకంగా విశాల ప్రజానీకాన్ని కూడగట్టాలి.

బ్రాహ్మణీయ హిందూ మతోన్మాద మోడీ ప్రభుత్వం ఆపరేషన్ గ్రీన్‌హంట్ 3వ దశ దాడిని తీవ్రంగా కొనసాగిస్తూ పెద్ద ఎత్తున సాయుధ బలగాల కూంబింగ్స్ నడుమ పీ.ఎల్.జీ.ఏ., మిలీషియా, విప్లవ ప్రజానీకం రక్షణలో ఒడిశా రాష్ట్ర ప్రథమ మహాసభ విజయవంతంగా ముగిసింది. ★

---

**(13వ పేజీ తరువాయి)**

చేస్తున్నారు. వచ్చిన వేతనంలో ఈ ఫైనాన్స్‌లు, ఎల్.ఐ.సీ.లు కడుతూ తీవ్ర ఆర్థిక యిబ్బందులు పడుతున్నారు. చివరికి ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారు.

**ఒత్తిడితోనే జీవనం**: సింగరేణి కార్మికులు నిత్యం ఒత్తిడితో జీవనం సాగిస్తున్నారు. సింగరేణిలో 3 షిఫ్టుల్లో కార్మికులు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. మొదటి షిఫ్టు ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు, రెండవ షిఫ్టు మధ్యాహ్నం 3 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు, మూడవ షిఫ్టు రాత్రి 11 గంటల నుండి ఉదయం 7 గంటల వరకు ఉంటాయి. కార్మికులు భూగర్భ గనుల్లోకి వెళ్లి 8 గంటలు పని చేసి తీవ్ర ఒత్తిడితో ఇంటికి వెళ్తారు. అర్ధ రాత్రి కూడా విధులు నిర్వహిస్తుండడంతో సింగరేణి కార్మికులకు నిద్రలేమి, ఆరోగ్య సమస్యలతో పాటు, కుటుంబ సమస్యలు, బాధ్యతలు, అధికారుల కఠినత్వంతో నిత్యం ఒత్తిడికి గురి కావలసిన పరిస్థితులు ఎదర్కొంటున్నారు. సింగరేణిలో నల్ల జీ.ఓ.లు అమలవుతున్నాయి. 'న్యూకోల్ పాలసీ'లో భాగంగా సింగరేణిలో కార్మికుల మీద పని భారం మరింత పెరిగింది.

దేశంలో, రాష్ట్రంలో "మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియా" పేరుతో దేశాన్ని పాలకులు అమ్ముతున్నారు. కార్మికులను యథేచ్ఛగా దోపిడీ చేసేందుకు, బడా కార్పొరేట్ వర్గాలకు మరింత సంపద దోచి పెట్టేందుకు ప్రభుత్వ విధానాలు దోహదపడుతున్నాయి. కావున కార్మికవర్గం సంఘటితంగా పోరాడినప్పుడే కార్మికుల హక్కులు రక్షింపబడుతాయి. మన దేశాన్ని, మన సంపదను కాపాడుకోగలుగుతాం!! ★

## అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం

మార్చి 8న పార్టీ, పీ.ఎల్.జీ.ఏ. సభ్యుల సమక్షంలో అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినాన్ని విజయవంతంగా నిర్వహించారు. వక్తలు మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు, ఆసిడ్ దాడులు, గృహ హింస, వరకట్న, లైంగిక వేదింపులను వ్యతిరేకించారు. ప్రత్యేకించి ప్రజాస్వామిక పోరాటాలు, విప్లవోద్యమాలలో భాగస్వాములవుతున్న మహిళలపై, ఉద్యమ ప్రాంతాలలోని సాధారణ మహిళలపై పోలీసులు, అర్ధ సైనిక బలగాలు జరుపుతున్న హత్యలు, అత్యాచారాలను తీవ్రంగా ఖండించారు. నూతన ప్రజాస్వామిక విప్లవ విజయంతోనే మహిళలకు విముక్తి లభిస్తుందని పేర్కొన్నారు. మహిళలు భాగస్వాములు కాకుండా విప్లవం విజయవంతం కాదని, అందుకొరకు మహిళలందరు విప్లవోద్యమంలో సంఘటితం కావాలని వక్తలందరు పిలుపునిచ్చారు.

చర్ల ఏరియా కమిటీ పరిధిలోని ప్రజా సంఘాలు చెన్నాపురం, పూజారి కాంకేర్ గ్రామాల పరిధిలో మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని వందలాది మంది గ్రామ ప్రజలతో ఘనంగా జరుపుకున్నారు.

### రాజకీయ ఖైదీల విడుదల కొరకు ప్రజా సంఘాల సభ



రాజకీయ ఖైదీల విడుదల కొరకు కాగడాల ప్రదర్శన

భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల సంస్మరణలో మార్చి 23 నుండి 29 వరకు రాజకీయ ఖైదీల హక్కుల వారంలో భాగంగా మార్చి 27న వరంగల్ జిల్లా హన్మకొండలోని అంబేద్కర్ భవన్‌లో రాజకీయ ఖైదీల విడుదల కమిటీ బహిరంగసభ నిర్వహించింది. ఉరిశిక్షలను రద్దు చేయాలని, ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడిని వెంటనే నిలిపి వేయాలని, యు.ఏ.పీ.ఏ., ఏ.ఎఫ్.ఎస్.పీ.ఏ. వంటి క్రూర నిర్బంధ చట్టాలను ఎత్తి వేయాలని, రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలని, ఐ.పీ.సీ. నుండి రాజద్రోహ నేరాన్ని తొలగించాలని వక్తలు డిమాండ్ చేశారు.

రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలని మార్చి 23న భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లో ప్రజా సంఘాల నాయకత్వంలో కాగడాలతో ఊరిగేంపు నిర్వహించారు.

## ఉ.తె.డబ్ల్యు.

### అటవీశాఖ కార్యాలయం కాల్చివేత



హరితహారం పేరుతో పోడు భూములను స్వాధీనం చేసుకోవటాన్ని, ఆదివాసులపై జరుగుతున్న దాడులు, అరెస్టులు మానుకోవాలని, ఆపరేషన్ గ్రీన్‌హంట్ 3వ దశ దాడిని విరమించుకోవాలని, ఏటూరు నాగారంలో టైగర్ జోన్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ వరంగల్ జిల్లా తాడ్వాయి మండల కేంద్రంలోని అటవీశాఖ అతిథి గృహాన్ని, జీపును ఏప్రిల్ 16న దళం, మిలీషియా కలిసి కాల్చివేసింది.

### ఎర్రమట్టి క్వారీ ఎక్స్‌కవేటర్ దహనం




దహనం చేసిన ఎక్స్‌కవేటర్

గనుల తవ్వకం, ఓపెన్‌కాస్ట్‌లతో ప్రజలను నిర్వాసితులను చేయటాన్ని వ్యతిరేకిస్తూ మే 4, 5 తేదీలలో బంద్ పాటించాలని కోరుతూ వరంగల్ జిల్లా ములుగు మండలం మల్లంపల్లి గ్రామ శివారులోని ఎర్రమట్టి క్వారీలోని ఎక్స్‌కవేటర్‌ను మే 3న దళం తగులబెట్టింది.

### ఏటూరు నాగారం - మహా దేవ్‌పూర్ దళ కమాండర్ అరెస్టు

ఏటూర్ నాగారం - మహా దేవ్‌పూర్ ఏరియా దళ కమాండర్ కామ్రేడ్ మధును ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో ఏటూరు నాగారం మార్కెట్ యార్డు ప్రాంతంలో ఏప్రిల్ 4న పోలీసులు అరెస్టు చేశారు.

## ఖమ్మం జిల్లా

### ఇన్ఫార్మర్‌పై హత్యాయత్నం

ఖమ్మం జిల్లా పినపాక మండలం జానంపేట పంచాయితీలోని సుందరయ్య నగర్‌కు చెందిన మాడవి రమేశ్ ఇన్ఫార్మర్‌గా పనిచేస్తూ దళాల కదలికల సమాచారాన్ని పోలీసులుకు చేరవేస్తున్నాడు. దళం

పలుమార్లు తన పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించినప్పటికీ అతను ఇన్ఫార్మర్‌గా పని చేస్తూనే ఉన్నాడు. దీంతో దళం ఏప్రిల్ 29న మాడవి రమేశ్‌పై కత్తులతో హత్యాయత్నం చేసింది.

**ఇన్ఫార్మర్ ఖతం**

మార్చి 1న బొట్టెం ఎన్‌కౌంటర్‌లో తొమ్మిది మంది కామ్రేడ్లు అమరులు కావటానికి కారకుడైన ఇన్ఫార్మర్ బొట్టెం గ్రామస్తుడు కొచాక్ నందాల్‌ను పీ.ఎల్.జీ.ఏ. బలగాలు ప్రజాకోర్టు నిర్వహించి ప్రజల ఆమోదంతో ఖతం చేసాయి.

**ముసిలేరు వంతెన ధ్వంసం**


మే 4, 5 తేదీలలో బంద్ పాటించాలని కోరుతూ ఖమ్మం జిల్లా చర్ల మండలంలోని ముసిలేరు వంతెనను పీ.ఎల్.జీ.ఏ. బలగాలు ధ్వంసం చేశాయి.

**మొబైల్ టవర్ ధ్వంసం**

మే 4, 5 తేదీలలో బంద్ పాటించాలని కోరుతూ ఖమ్మం జిల్లా దుమ్ముగూడెం మండలం సీతానాగారం లోని మొబైల్ టవర్‌ను పీ.ఎల్.జీ.ఏ. బలగాలు ధ్వంసం చేశాయి.

## ఆదిలాబాద్ జిల్లా

**వంతెన పనులు చేస్తున్న వాహనాల దహనం**



దళం దహనం చేసిన ప్రొక్లెయిన్

నిర్వాసితత్వానికి వ్యతిరేకంగా, మే 4, 5 తేదీలలో బంద్‌ను పాటించాలని కోరుతూ ఆదిలాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం గూడెం సమీపంలో ప్రాణహిత నదిపై నిర్మిస్తున్న అంతర్ రాష్ట్ర వంతెన పనులను చేస్తున్న ప్రొక్లెయిన్, ఇతర వాహనాలను ఏప్రిల్ 29న దళం దహనం చేసింది.

## సింగరేణి

### ఎర్రగుంటపల్లె, కళ్యాణిఖని మెగా ఓపెన్‌కాస్ట్‌లను అడ్డుకున్న గ్రామ ప్రజలు

ఓపెన్‌కాస్ట్‌ల వల్ల ఎర్రగుంటపల్లె నాశనం అవుతుందని గ్రామస్థులు కొద్ది రోజుల నుండి నిరాహారదీక్షలు చేపట్టినా సింగరేణి యాజమాన్యం గ్రామస్థుల ఆక్రందనలను లక్ష్య పెట్టకుండా యుద్ధ ప్రాతిపదికన ఓపెన్‌కాస్ట్ లను తవ్వడానికి సిద్ధమయింది. యాజమాన్య మొండి వైఖరికి నిరసనగా గ్రామస్థులు ఓపెన్‌కాస్ట్‌కు వ్యతిరేకంగా ఎర్రగుంటపల్లె నుండి మందమర్రి బస్టాండ్ వరకు భారీ ర్యాలీని నిర్వహించి జాతీయ రహదారిపై, జీ.ఎం. కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఓపెన్‌కాస్ట్ లను తవ్వేందుకు వేసిన శిలా ఫలకాన్ని ధ్వంసం చేశారు.

ఆదిలాబాద్ తూర్పు జిల్లా డివిజన్‌లోని మందమర్రి, బెల్లంపల్లి, కాశీపేట మండలాలలోని 19 గ్రామాలు, మందమర్రి, కాశీపేట, బెల్లంపల్లి, ఎర్రగుంటపల్లె, మామిడిగూడెం, చిన్న ధర్మారం, పెద్ద ధర్మారం, గొండుగూడ, అచ్చుతరావు తండా, పెద్దనపల్లి (ఎస్) ప్రజలు పెద్ద ఎత్తున కదిలి మా గ్రామాలను కనుమరుగు చేసి బొందలగడ్డలుగా మార్చి వారి బతుకులను నాశనం చేసే కళ్యాణిఖని మెగా ఓపెన్‌కాస్ట్‌ను తవ్వకుండా సింగరేణి యాజమాన్యాన్ని అడ్డుకున్నారు. టీ.ఆర్.ఎస్. ప్రభుత్వం ప్రజల జీవించే హక్కును కాలరాస్తూ సింగరేణి యాజమాన్యానికి అండగా వుండి ఓపెన్‌కాస్ట్‌లకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలపై పోలీసులతో దాడులు చేయిస్తున్నది. కళ్యాణిఖని మెగా ఓపెన్‌కాస్ట్ అయ్యే ప్రాంతం ఏజెన్సీ ప్రాంతం, 1/70 చట్టం, 5వ షెడ్యూల్ కిందకు వస్తాయి. ఈ ప్రాంతంలో ప్రాజెక్టులు నిర్మించాలంటే పెసా చట్టం ప్రకారం గ్రామ సభలు నిర్వహించాలి. ఈ చట్టాలను తుంగలో తొక్కి సింగరేణి యాజమాన్యం టీ.ఆర్.ఎస్. ప్రభుత్వం అండతో పోలీసుల పశుబలంతో ఓపెన్‌కాస్ట్‌లు తవ్వుతుంటే నిర్వాసిత ప్రజలు కదిలి శిలాఫలకాలను ధ్వంసం చేసి సింగరేణి యాజమాన్యాన్ని తరిమికొట్టారు.



ఓపెన్‌కాస్ట్ శిలాఫలకాన్ని ధ్వంసం చేస్తున్న గ్రామస్తులు

ఓపెన్‌కాస్ట్ నిర్వాసిత గ్రామాల ప్రజలకు, తెలంగాణ ప్రజాఫ్రంట్, ఓ.సీ. వ్యతిరేక కమిటీ, హక్కుల సంఘాలు, తెలంగాణ నిర్వాసిత కమిటీ, తెలంగాణ విద్యార్థి వేదిక, చైతన్య మహిళా సంఘం, ప్రజా కళామండలి, తెలంగాణ పర్యావరణ పరిరక్షణ సంస్థ, తెలంగాణ విద్యార్థి సంఘం, డెమోక్రటిక్ విద్యార్థి సంఘం, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘాలు అండగా నిలబడి 'ఓపెన్‌కాస్ట్ హఠావో – తెలంగాణ బచావో' అంటూ ఊరేగింపు నిర్వహించి మందమర్రి జీ.ఎం. కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ప్రజలు పెద్ద ఎత్తున కదిలి వస్తున్నారని పోలీసులు మందమర్రి పరిధిలో 144 సెక్షన్ ప్రకటించి, నాయకత్వాన్ని అరెస్టు చేసి బెల్లంపల్లి పోలీసు స్టేషన్‌లో బందించారు. ఈ విషయం తెలుసుకున్న బాధిత గ్రామాల ప్రజలు రాస్తారోకోలు, ధర్నాలు చేసారు. మహిళలు పెద్ద ఎత్తున దుబ్బగూడెంలో రాస్తారోకో చేసినారు. ఎర్రగుంటపల్లె మహిళలు పోలీసుల వలయాన్ని చేదించుకుని జీ.ఎం. కార్యాలయాన్ని దిగ్బంధించి అరెస్టు అయినవారిని విడిపించుకున్నారు. బొందలగడ్డలుగా చేసి వారి బ్రతుకులను నాశనం చేసే ఓపెన్‌కాస్ట్ తవ్వకాలను ప్రాణాలర్పించయినా అడ్డుకుంటామని అన్నారు. కళ్యాణిఖని మెగా ఓపెన్‌కాస్ట్‌ను ప్రజలు సంఘటితంగా అడ్డుకున్నారు.

## ప్రాజెక్టుల పేరుతో చెంచులను, గోండులను, కోయలను నిర్వాసితులను చేస్తున్న ప్రభుత్వం

## ఓపెన్‌కాస్ట్‌ల నిర్మాణాలతో విధ్వంసం కానున్న ప్రజల బతుకులు

చెంచు జాతి ప్రజలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని నల్లమల ప్రాంతంలో నివసిస్తున్నారు. ఈ ప్రాంతంలో వజ్రాలు, యురేనియం, కలప, ఇతర ఖనిజాలున్నాయి. వీటిని కొల్లగొట్టేందుకు ప్రజలను ఇక్కడినుండి తరిమివేయాలనే కుట్రతో పాలకులు వ్యూహం పన్నుతున్నారు. డీబీర్స్ అనే వజ్రాల కంపెనీ యు.పి.ఏ.-2 కాలంలో నల్లమల అటవీ ప్రాంతాన్ని కబ్జా చేసేందుకు రహస్య ఒప్పందం జరిగింది. అదే విధంగా కవ్వాల టైగర్ జోన్ ప్రాజెక్టు క్రింద కూడ అపారమైన ఖనిజ సంపద వున్నది. ఈ సందపను దోపిడీ చేసేందుకు పులుల అభయారణ్యాలను ఏర్పాటు చేసే పేరుతో ప్రజలను అడవినుండి తరిమేస్తున్నారు. దీనికి నిరసనగా ఆదివాసీ, ఆదివాసేతర ప్రజలు, ప్రజా సంఘాలు, హక్కుల సంఘాలు కదిలి పోరాటాలు నిర్వహించడంతో పాలకులు ప్రజలకు నష్టపరిహారాల ఆశచూపుతున్నారు. తరతరాలుగా జీవిస్తున్న పీడిత ప్రజలు మాత్రం ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారాన్ని వ్యతిరేకిస్తున్నారు.

వరంగల్ జిల్లా ఏటూరు నాగారం మండలంలోని కంతనపల్లి గ్రామం వద్ద గోదావరిపై మరో పోలవరం లాంటి బహుళార్ధక సాధక నీటి ప్రాజెక్టును కే.సీ.ఆర్. ప్రభుత్వం నిర్మించతలపెట్టింది. దీనివల్ల వరంగల్, కరీంనగర్, ఖమ్మం, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలోని కొన్ని గ్రామాలను కలుపుకొని దాదాపు 150 గ్రామాల వరకు ముంపుకు గురౌతాయి. దీనితో స్థానిక ప్రజలు, ఆదివాసీ సంఘాలు, ఇతర తెలంగాణ సంఘాలు కలిసి కంతనపల్లి ప్రాజెక్టు నిర్మాణ వ్యతిరేక కమిటీగా ఏర్పడి నిరసన ప్రదర్శనలు, సభలు, సమావేశాలు జరిపారు. సర్వేకు వచ్చిన అధికారులను, ప్రజా ప్రతినిధులను ఘెరావు చేశారు. దీనితో కంతనపల్లి ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రభుత్వం నిలిపివేసింది. ఇది ప్రజా విజయంగా చెప్పుకోవచ్చు.

## ఓ.సీ.లకు వ్యతిరేకంగా ప్రజల పోరాటాలు, బూటకపు ప్రజాభిప్రాయాన్ని బహిష్కరించిన ప్రజలు

వరంగల్ జిల్లా భూపాలపల్లి మండంలోని గడ్డిగాని గ్రామంలో ఓ.సీ.ప్రాజెక్టు సెక్టార్-1 నిర్మాణానికి సింగరేణి యాజమాన్యం, పర్యావరణ శాఖ, ప్రభుత్వ యంత్రాంగం కలిసి జరిపిన ప్రజాభిప్రాయ సేకరణలో ఓ.సీ.ని వ్యతిరేకిస్తూ ప్రజలు సభను బహిష్కరించారు. అదే విధంగా ఖమ్మం జిల్లాలో టేకులపల్లి, మణుగూర్, సత్తుపల్లి మండలాలు; ఆదిలాబాద్ జిల్లా మువ్వాడ; కరీంనగర్ జిల్లా తాడిచర్ల లలో నిర్మించతలపెట్టిన ఓ.సీ.లకు వ్యతిరేకంగా ప్రజలు నిరసన ప్రదర్శనలు చేశారు. భూములు ఇవ్వమని చెప్పారు.

హరితహారం పేరుతో ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్‌లలోని ఏజెన్సీ ప్రాంతాలలో ఆదివాసులు, పీడిత ప్రజలు గత 30, 40 సంవత్సరాలుగా సాగుచేసుకుంటున్న పోడు భూములను అటవీ అధికారులతో ప్రభుత్వం కబ్జా చేసుకుని బహుళజాతి సంస్థలకు కట్టబెట్టాలని చూస్తున్నది. దీనికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసీ సంఘాలు, ఇతర ప్రజా సంఘాలు నిరసన ప్రదర్శనలు కొనసాగించాయి. అటవీ అధికార్లపై ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్‌లలో ప్రజలు దాడులు చేశారు.

## కరువు సమస్యపై రైతుల పోరాటాలు

వరంగల్, మహబూబ్‌నగర్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో రైతు సంఘాల నాయకత్వంలో ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు తగిన ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, వరి, పత్తికి గిట్టుబాటు ధరలు చెల్లించాలని, వర్షాభావం కారణంగా కరువు ఏర్పడిన 432 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని, కరువు ఏర్పడిన దగ్గర ఆహారపంటలకు నష్టపరిహారం చెల్లించాలని, రైతులకు పూర్తి రుణ మాఫీ ప్రకటించాలనే డిమాండ్లపై రైతు సంఘాల నాయకత్వాన రైతులు పోరాటాలు కొనసాగించారు. ★

---

**(15వ పేజీ తరువాయి)**

మాత్రమే సిసిఐ కొనుగోలు చేస్తున్నది. దీంతో మిగిలిన 90 శాతం పత్తిని ప్రైవేటు వ్యాపారులు తక్కువ ధరకే కొంటున్నారు. తీవ్రంగా నష్టపోతున్న పత్తి రైతులు ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరిపై చెప్పులు విసిరి నిరసన వ్యక్తం చేశారు. ప్రపంచ వాణిజ్య సంస్థ, పాలక వర్గాలు, ప్రైవేటు వ్యాపారులు రైతులను అన్ని విధాలుగా దోపిడీ చేస్తుండడంతో వ్యవసాయరంగం, రైతాంగం, గ్రామీణ ప్రాంతాలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయి గ్రామాల్లో ఉపాధి కరువైంది. దీంతో ప్రజలు ఉపాధి కొరకు పట్టణాలు, నగరాలకు వలసపోయి చౌకగా దొరికే కూలీలుగా మారుతున్నారు. కొన్ని స్వతంత్ర సర్వే సంస్థల అంచనాల ప్రకారం ఏటా 50 లక్షల మంది ప్రజలు నగరాలకు వలసపోతున్నారు. ప్రత్యామ్నాయం లభిస్తే వ్యవసాయం నుంచి తప్పుకోవడానికి 78 శాతం పైగా ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు అర్జున్‌సేన్‌గుప్త కమిటీ తన నివేదికలో పేర్కొంది.

ప్రపంచీకరణ విధానాలలో రైతుల సమస్యలకు పరిష్కారం దొరకదు. ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలతో వ్యవసాయ రంగం, రైతాంగం సంక్షోభం నుండి బయట పడగలుగుతాయి. ఈ దిశలో ప్రజలు విప్లవోద్యమ ప్రాంతాలలో జనతన సర్కారులను ఏర్పాటు చేసుకుంటున్నారు. జనతన సర్కార్లు సోషలిస్టు ఆర్థిక పునాదులపై దున్నేవారికే భూమి అనే నినాదంతో విప్లవ భూ సంస్కరణలను అమలు చేస్తున్నాయి. ఇక్కడ రైతుల ఆత్మహత్యలు లేవు. వ్యవసాయరంగం, రైతాంగం సంక్షోభం నుండి బయట పడటానికి, ప్రపంచ వాణిజ్య సంస్థ నుండి వైదోలగడానికి దున్నేవారికే భూమి ఇరుసుగా వున్న నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం కావటానికి ప్రజలు, ప్రజాస్వామిక వాదులు విద్యావంతులు, మేధావులు, కళాకారులు, రచయితలు ఐక్యమై పోరాడాలి.

★

# ఆపరేషన్ గ్రీన్‌హంట్ 3వ దశ దాడిని తిప్పి కొడుతున్న దండకారణ్య ప్రజలకు, మిలీషియా, పి.ఎల్.జీ.ఏ. యోధులకు విప్లవ జేజేలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టు పార్టీని నిర్మూలించే లక్ష్యంతో నూతనంగా ఆధునాతన ఆయుధాలను, సీ.ఆర్.పీ.ఎఫ్. 5 బెటాలియన్లను మంజూర్ చేస్తున్నాయి. భద్రతా బలగాలను మరింత సాయుధం చేయటానికి కేంద్ర బడ్జెట్ 2016 – 17లో 10శాతం రక్షణ శాఖకు కేటాయించారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి రక్షణ రంగానికి రూ॥2.58 లక్షల కోట్లు కేటాయిస్తున్నట్లు ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌లో ప్రతిపాదించాడు. కేంద్ర హోంశాఖ 2016 –17 సం॥రానికి రూ॥77,300 కోట్లు కేటాయించారు. ఇది గతంతో పోలిస్తే 24.56 శాతం ఎక్కువ.

ప్రతి కి.మీ. దూరానికి ఒక పోలీసు క్యాంపును ఏర్పాటు చేస్తున్నారు. దండకారణ్య వ్యాప్తంగా నిత్యం వేలాది పోలీసు బలగాలు కూంబింగ్‌లు నిర్వహిస్తూ మహిళలపై అత్యాచారాలు చేస్తూ, గ్రామాలను ధ్వంసం చేస్తూ, బూటకపు ఎన్‌కౌంటర్‌లలో సాధారణ ప్రజలను సహితం హత్యలు చేస్తూ బీభత్సకాండను సృష్టిస్తున్నాయి.

మావోయిస్టు పార్టీ నాయకత్వంలో దండకారణ్య ప్రజానీకం, మిలీషియా, పీ.ఎల్.జీ.ఏ. యోధులు ఖనిజ సంపదను, జనతన సర్కార్లను కాపాడుకోవడానికి ప్రభుత్వం సృష్టిస్తున్న విధ్వంసాన్ని అడ్డుకోవడంలో భాగంగా ఈ సంవత్సరం ఫిబ్రవరి 2016 నుండి ఏప్రిల్ 2016 వరకు కొనసాగించిన 13 చిన్న, మధ్య రకం ప్రతిఘటన చర్యలలో 36 మంది పోలీసులు (కోబ్రా, సీ.ఆర్.పీ.ఎఫ్., డీ.ఆర్.జీ.) చనిపోగా, 53 మంది గాయపడ్డారు. చనిపోయిన పోలీసులలో సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి కూడ ఒకడు ఉన్నాడు. అలాగే ప్రజా ద్రోహులైన (డీ.ఆర్.జీ) వారు కూడా ఉన్నారు. కూంబింగ్‌లలో చనిపోవడమే కాకుండా ఎక్కడ బూబీట్రాప్‌లు పేలి గాయాల పాలౌతామో అనే ఆందోళనలో పోలీసులు ఉన్నారు.

జరిగిన చర్యలలో ముఖ్యంగా దక్షిణ బస్తర్ డివిజన్ పామేడ్ ఏరియా బొట్టెం గ్రామం వద్ద మార్చి 1, 2016న మావోయిస్టుల మకాంపై తెలంగాణ గ్రేహౌండ్స్, ఛత్తీస్‌గఢ్ పోలీసు బలగాలు కలిసి దాడి చేయగా 9 మంది కామ్రేడ్స్ అమరులయినారు. ఈ ఘటనతో విర్రవీగుతున్న పోలీసులను తెల్లవారే పీ.ఎల్.జీ.ఏ. యోధులు దుగ్గమర్క వద్ద పోలీసులపై దాడి చేయగా 15 మంది కోబ్రాలు చనిపోగా, 17 మంది గాయపడ్డారు.

సుక్మా జిల్లా మర్లగూడెం వద్ద సీ.ఆర్.పీ.ఎఫ్. జవానులు ప్రయాణిస్తున్న వాహనాన్ని పీ.ఎల్.జీ.ఏ. బలగాలు మందు పాతరతో పేల్చివేసిన ఘటనలో ముగ్గురు జవానులు చనిపోయారు. 12 మందికి తీవ్రంగా గాయలయ్యాయి.

మార్చి 30, 2016న దంతేవాడ జిల్లా కేంద్రానికి 12 కి.మీ. దూరంలో హైవే రోడ్డుపై మైలారం గ్రామ సమీపంలో పోలీసు కాన్వాయ్‌పై ల్యాండ్ మైన్ పేల్చగా ఒక ఎస్.ఐ.తో సహా 7గురు పోలీసులు చనిపోయారు.

ఏప్రిల్ 8, 2016న దక్షిణ బస్తర్‌లోని పామేడ్ పోలీసు స్టేషన్ వద్ద హెలిప్యాడ్ రక్షణ సిబ్బందిపై జరిపిన దాడిలో ఇద్దరు (ఒక డీ.ఆర్.జీ.) పోలీసులు చనిపోగా, 4గురు గాయపడ్డారు.

ఏప్రిల్ 26, 2016 న దక్షిణ బస్తర్‌లోని బాసగూడెం పోలీసులు రాత్రి కూంబింగ్ నిర్వహిస్తూ మిలీషియా డేరాపైకి రాగా మిలీషియా జరిపిన ఫైరింగ్‌లో ఒక పోలీసు చనిపోయాడు. ఒక పోలీసు గాయపడ్డాడు.

ఈ లాంటి చర్యలు పోలీసుల దూకుడుకు అడ్డకట్ట వేస్తూ ప్రజలలో, క్యాడర్‌లలో ఆత్మవిశ్వాసం పెంచి మంచి ప్రభావాన్ని వేస్తున్నాయి. అదే విధంగా సర్వం విధ్వంసం చేయాలనుకుంటున్న పోలీసుల మనో ధైర్యం దెబ్బతింటున్నది.

**(33వ పేజీ తరువాయి)**

విధానాలకు పాతరేయాలి.

1990 దశకం ఆరంభంలో సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలు అమలులోకి తెచ్చినప్పుడు పన్నులు, లైసెన్సులు అవినీతిని పెంచుతున్నాయని, సరళీకరణ విధానాలు వ్యాపార ప్రపంచంలో పారదర్శకతను పెంచుతాయని ఊదరగొట్టారు. నిజానికి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాలకు, నల్లధనం సృష్టి కావటానికీ, అది ప్రపంచ సంచారం చేయటానికీ అవినాభావ సంబంధం ఉంది. కాబట్టి విధానాల్లో మార్పు రాకుండా నల్లధనాన్ని అరికడతామనో, విదేశాల్లో దాచుకున్నది కక్కిస్తామనో ప్రభుత్వాధినేతలు చెప్పేమాటలకు విలువలేదు. ప్రపంచీకరణ, దాని అభివృద్ధి నమూనా ఫలితమే నల్లధనం అక్రమాలని ఐసిఐజె చేసిన విశ్లేషణ ముమ్మాటికీ నిజం. బినామీ కంపెనీలు, బహుళజాతి డ్రగ్ స్మగ్గింగ్, వ్యవస్థీకృత నేర ముఠాలు, ప్రైవేటు సైన్యాలు, మాదక ద్రవ్యాలు, ఆయుధాల అక్రమ రవాణా అనేకానేక నికృష్ట కార్యకలాపాలే నల్లధనం కూడబెట్టడానికి హేతువులు. ఈ అక్రమార్జన విధానాలను నిరోధించవలసిన బాధ్యత ప్రజాస్వామిక, ప్రజా సంఘాల, సామాజిక కార్యకర్తలపైననే ఉంది. ఈ నల్లధనానికి వ్యతిరేకంగా ప్రజలు మిలిటెంట్‌గా పోరాడవలసిన అవసరం ఉంది.

★

# దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాద కార్పొరేట్ సంస్థల వనరుల దోపిడీకి, నిర్వాసితానికి, ఆపరేషన్ గ్రీన్‌హంట్ 3వ దాడికి వ్యతిరేకంగా సీ.ఆర్.బీ. తలపెట్టిన మే 4, 5 బందుకు మద్దతుగా తెలంగాణలో బంద్‌ను విజయవంతం చేయండి!

ప్రజలారా!

కేంద్రంలో బీ.జే.పీ. (ఎన్.డీ.ఏ.) ప్రభుత్వం, రాష్ట్రంలో టీ.ఆర్.ఎస్. ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఎల్.పీ.జీ. విధానాలను దూకుడుగా అమలు చేస్తున్నాయి. దీని ఫలితంగా దేశంలో, మధ్య భారతంలో, తెలంగాణ రాష్ట్రంలో సామ్రాజ్యవాద కార్పొరేట్ సంస్థలు వనరుల లూటీ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. రాష్ట్రంలో కే.సీ.ఆర్. సింగిల్ విండో విధానం ద్వారా కార్పొరేట్ సంస్థలకు భూమి, నీరు, విద్యుత్ లాంటి వసతులను ఉచితంగా ఇస్తున్నాడు. దీనితో రాష్ట్రంలో తీవ్రమైన నిర్వాసిత సమస్యను ప్రజలు ఎదుర్కొంటున్నారు. కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం సామ్రాజ్యవాదానికి దళారీగా వ్యవహరిస్తూ హిందూ సామ్రాజ్య నిర్మాణ లక్ష్యంతో దళితులు, ఆదివాసులు, మైనారిటీలు, పీడిత జాతులపై, ప్రజాస్వామికవాదులపై, పీడిత సెక్షన్ల విద్యార్థులపై, అధ్యాపకులపై హత్యలు, దాడులు, రాజద్రోహ నేరాలు మోపుతూ బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని అమలు చేస్తున్నది.

కే.సీ.ఆర్. హిందూ ఫాసిస్టులతో అంటకాగుతూ భూస్వాముల, దొరల పాలనను కొనసాగిస్తున్నాడు. ఈ లూటీకి, ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రజలు, పార్టీ ప్రతిఘటిస్తుండడంతో ప్రజలపై, విప్లవోద్యమంపై ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడవ దాడిని తీవ్రంగా కొనసాగిస్తున్నాడు. విమాన దాడులు కొనసాగించడానికి ఏయిర్ ఫైరింగ్ రిహార్సల్స్ కొనసాగిస్తున్నారు. మావోయిస్టు పార్టీని నిర్మూలించే లక్ష్యంతో దాడులు కొనసాగిస్తున్నారు. కార్పొరేట్లు కొనసాగిస్తున్న వనరుల లూటీని నిరోధించి ప్రజల రాజ్యాధికారాన్ని స్థాపించడమే మావోయిస్టు పార్టీ లక్ష్యం. అంటే జనతన సర్కార్లను ఏర్పాటు చేసుకొని జల్, జంగల్, జమీన్‌ల పై ప్రజలకు అధికారాన్ని నెలకొల్పడమే. దీని కోసం ఎన్ని త్యాగాలకైనా సిద్ధం కావాలని పిలుపునిస్తున్నాము. లేని యెడల ఈ పాలకులు మనల్ని నాశనం చేస్తారు.

ఈ రోజు తెలంగాణలో గోదావరి, కృష్ణా నదులతో పాటు అనేక ఉప నదులున్నాయి. బొగ్గు, ఇనుము, సున్నపురాయి, లాటరేట్, డోలమైట్, వజ్రాలు, యురేనియం, సారవంతమైన భూములు, అటవీ ప్రాంతాలున్నాయి. ఈ వనరులన్నింటినీ దోచుకోవడానికి, పెట్టుబడిదారులకు దోచి పెట్టడానికి గత ప్రభుత్వాల లాగానే కే.సీ.ఆర్. ప్రభుత్వం అణచి వేస్తున్నది. అభివృద్ధి నమూనా మాటున చేపట్టిన పోలవరం, కంతనపల్లి నీటి ప్రాజెక్టులు, ఖమ్మం జిల్లా నుండి మొదలు ఆదిలాబాద్ వరకు అంటే సత్తుపల్లి, టేకులపల్లి, కోయగూడెం, పెనుగడప, మణుగూర్, ఇల్లందు, భూపాలపల్లి, తాడిచర్ల, గుండాల, కాశీపేట, ముచ్చాడ, డోర్లి, ఎర్రగుంటపల్లి, దుబ్బపల్లె, శ్రావణపల్లెలో ఓపెన్‌కాస్ట్ తవ్వకాలు, వరంగల్ జిల్లా మల్లంపల్లిలో డోలమైట్, లాటరేట్ క్వారీల తవ్వకాలు, బయ్యారం, మామిడిగుండాల, గార్లలో ఇనుము, లాటరేట్ తవ్వకాలు, హరితహారం పేరుతో ఏజెన్సీ జిల్లాలైన ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్‌లో ఆదివాసులు గత 30 సం॥రాలుగా సేద్యం చేసుకుంటున్న భూముల నుండి ఫారెస్టు అధికారుల చేత గెంటి వేయించడంతో లక్షలాది మంది నిర్వాసితులవుతున్నారు. రంగారెడ్డి, నల్గొండ జిల్లాలలో రాచకొండ గుట్టల ఏరియాను ఫైరింగ్ రేంజ్ నిర్మాణం కోసం, ఫిల్మ్ సిటీ కోసం రామోజీరావు లాంటి వాళ్లకు కట్టబెట్టడం, గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ పెట్రో కెమికల్, రసాయన పరిశ్రమలు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, ఫార్మా కంపెనీలు నెలకొల్పడంతో అవి విడుదల చేస్తున్న విష పదార్థాలు, బొగ్గు పులుసు వాయువుల కారణంగా మొత్తం రాజధాని, మూసీ నది, దాని పరివాహక ప్రాంతం కాలుష్యంతో నిండి పోవడంతో తీవ్రమైన అనారోగ్యాలకు గురౌతున్నారు. జనం జీవనం కొనసాగించలేని పరిస్థితి ఏర్పడింది. ఆ నీళ్లతో పండించిన పంటలు తింటే జబ్బులు వస్తున్నాయి.

ఇది ఇలా ఉండగా గత ప్రభుత్వాలు మూసివేసిన నిజాంషుగర్ ఫ్యాక్టరీ, పాల్వంచలో స్పాంజ్ ఐరన్ మిల్లు, వరంగల్ లోని ఆజాంజాహి మిల్లు, సిర్పూర్ కాగజ్‌నగర్ లోని పేపర్ మిల్లు, రామగుండంలోని ఎరువుల కర్మాగారం, కమలాపురం బిల్ట్ పరిశ్రమ లను పునురుద్ధరిస్తానన్న కే.సీ.ఆర్. పునురుద్ధరించకపోవడంతో వేలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. లక్షలాది మంది కార్మికులు, రైతులు నిరుద్యోగులుగా మారారు. కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో గ్రానైట్ రాతి గుట్టలను ధ్వంసం చేస్తూ పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారు. గోదావరి నుండి ఇసుకను హైదరాబాద్, వరంగల్ లాంటి నగరాలకు పెద్ద ఎత్తున తరలించడంతో భూగర్భ జలాలు అడుగంటి నీటి సమస్య ఏర్పడుతుంది.

ఖనిజ సంపదను దోచుకోవడానికి టైగర్ జోన్ల పేరుతో ఆదిలాబాద్ లో గోండులను, మహబూబ్‌నగర్‌లో చెంచులను అడవుల నుండి గెంటి వేస్తున్నారు. మహబూబ్‌నగర్‌లోనే పోలెపల్లి సెజ్ నిర్మాణం చేసి ప్రజలను నిర్వాసితులను చేశారు.

తెలంగాణలో మూతపడిన పరిశ్రమలను పునరుద్ధరించకుండా టీ.ఆర్.ఎస్., కే.సీ.ఆర్. ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడని కాలుష్యాన్ని వెదజల్లే, అనారోగ్యాన్ని కల్గించే, నిరుద్యోగాన్ని పెంచే రసాయన ఫ్యాక్టరీలను ఆహ్వానిస్తున్నది. సామ్రాజ్యవాదుల లక్ష్యం కూడా

**(మిగతాది 47వ పేజీలో)**

# రోహిత్ వేముల ఆత్మహత్య మూలాలను ఛేదించండి!
# గాట్స్ ఒప్పందాన్ని వ్యతిరేకించండి!!

రోహిత్ వేముల 2015 డిసెంబర్ 18న విసికి రాసిన లేఖలో ఉరితాడును, విషాన్ని హిందూ అగ్రవర్ణ ఆధిపత్యానికి, జాత్యహంకారానికి ప్రతీకలుగా చూసాడు. తన ఫేస్‌బుక్‌లో మతము, జాత్యహంకారము హింసకు తెరచిన ద్వారాలని, అవి పూర్తిగా మూర్ఖమైనవి, కల్పితమైనవని అని రాసాడు. పేరాశ, వెలివేత సామ్రాజ్యవాద, ఆధిపత్య భావజాల లక్షణాలన్నాడు. మన చుట్టూ కారుణ్యమూ, చైతన్యమూ వెల్లివిరియాలని, ప్రపంచంలో ప్రేమ, ప్రకృతిని మించిన శక్తులు లేవన్నాడు. ఆయన పుట్టిన, పెరిగిన సమాజమూ, చదువుకున్న చదువూ, చుట్టు వాతావరణమూ పోరాటాలూ, కాలమూ, అధ్యయనమూ ఆయననట్లా తీర్చిదిద్దాయి. క్యాంపస్‌లలో విద్యార్థిలోకం ఒక సంక్షోభంలో సంఘర్షణ పడుతూ ఇట్లా ఒక తాత్విక దృక్పథం అలవర్చుకుంటున్న రోజులివి.

అందుకే రోహిత్ వేముల ఆత్మహత్య జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటన అనంతరం దేశవ్యాప్తంగా యూనివర్సిటీల్లో దళిత, ఆదివాసీ, వెనుకబడిన, మత మైనారిటీ, పీడిత జాతుల విద్యార్థులు పెద్దఎత్తున దోపిడీ పాలకవర్గాలు అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా వుద్యమిస్తున్నారు. ప్రొఫెసర్ సి.కాశీంపై టిఆర్ఎస్ ప్రభుత్వం కుట్రపూరితంగా మోపిన రాజద్రోహ నేరానికి వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు, ప్రజాస్వామికవాదులు, విద్యార్థులు రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున పోరాటాలు కొనసాగించారు.

జెఎన్‌యుని ఉగ్రవాదుల కేంద్రంగా పేర్కొంటూ జెఎన్‌యు విద్యార్థి సంఘం నేత కన్హయ్య కుమార్‌ను, ఉమర్ ఖలీద్, అనిర్బన్‌లను అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థి సంఘాలు, ప్రజాస్వామికవాదులు, ప్రజాసంఘాలు, ఎస్‌సి,ఎస్‌టి,బిసి, మైనార్టీ సంఘాలు పోరాటాలు కొనసాగిస్తున్నారు.

విశ్వవిద్యాలయాలపై, ఉన్నత విద్యాలయాలపై సంఘ్ పరివార్, రాజ్యం దాడులు ముమ్మరమయ్యాయి. ప్రతిఘటన కూడ తీవ్రతరమవుతున్నది. ఐఐటి మద్రాసులో అంబేద్కర్ పెరియార్ స్టడీ సర్కిల్‌ను నిషేధించమని లేఖ రాసి వెనక్కి తీసుకోవాల్సి వచ్చిన దగ్గర్నించి రోహిత్ వేముల ఆత్మహత్యను ప్రేరేపించిన లేఖ రాసే దాకా కేంద్ర మానవ వనరుల శాఖా మంత్రి స్మృతి ఇరానీ మనుస్మృతిని ఎన్‌డిఎ రాజ్యాంగంగా అమలు చేస్తూ గాట్స్ ఒప్పందానికి తాకట్టు పెట్టే దిశగా పడుతున్న ప్రయాసంతా బయటపడుతున్నది.

నైరోబీ గాట్స్ సమావేశంలో భారత్ ఆమోదించిన తీర్మానం వ్యవసాయరంగం, విద్యారంగాల విషయంలో మనను ఎటువంటి దాస్యానికి ముడివేసిందో పారదర్శకంగా బయటపెట్టలేకపోతున్న దళారీ పాలకవర్గం ఒకవైపు కరువు, వ్యవసాయ సంక్షోభంతో లక్షలాది మంది రైతుల ఆత్మహత్యలకు పరిష్కారాలు చూపలేనిస్థితిలో విద్య, సాంస్కృతిక రంగాలపై భావజాలపరంగా విరుచుకపడుతున్నది. విద్యాలయాలను పోలీసు క్యాంపులుగా, కాన్‌సెంట్రేషన్ క్యాంపులుగా మారుస్తున్నది. రోహిత్ వేముల ఆత్మహత్యకు ప్రేరణ, ఉదయ్‌భానుపై హత్యాప్రయత్నం చేసిన రాజ్యమే విద్యార్థులకు అండగా నిలిచిన ప్రొఫెసర్లపై జెఎన్‌యు, హెచ్‌సియులలో కేసులుపెట్టి అరెస్టులు చేస్తున్నది. జెఎన్‌యు లోని డిఎస్‌యుకు సమర్థకులుగా ఉన్నారని ప్రొఫెసర్ జిఎన్ సాయిబాబా, ఎస్‌ఆర్ గిలానిలపై ఆరోపణలూ, అరెస్టులయినా అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్‌కు, స్టూడెంట్ జెఎసికి అండగా ఉన్నారని ప్రొఫెసర్ కెవై రత్నం, తథాగత్‌లపై దాడి, కేసులు, అరెస్టులు, సస్పెన్షన్‌లయినా ఈ తీవ్ర నిర్బంధం, దాడి పథకంలో భాగంగానే చూడాలి.

1991కన్నా ముందు ప్రపంచ మార్కెట్‌నంతా ప్రపంచబ్యాంకు, ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ ద్వారా మాత్రమే కంట్రోల్ చేయాలని చూసిన అమెరికా సామ్రాజ్యవాదం 1992 తర్వాత డబ్ల్యుటివో, గాట్స్ ద్వారా ఆయా దేశాల ఆంతరంగిక రాజకీయ ఆర్థిక వ్యవహారాల్లో, ముఖ్యంగా వ్యాపార, వాణిజ్య వ్యవహారాల్లో జోక్యం చేసుకునే ప్రయత్నం చేస్తున్నది. ఈ క్రమంలో విద్యారంగంలో పనిచేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు, విద్యను మార్కెట్‌తో అనుసంధానించే జ్ఞానసరుకు (ఇంటలెక్చువల్ కమోడిటి)గా మారుస్తున్న కుట్రను ప్రతిఘటించే క్రమంలోనే ఈ దాడులు పెరుగుతున్నవి. విద్యను ప్రైవేటీకరిస్తూ, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, విదేశీ విశ్వవిద్యాలయాలు తెచ్చే ఎంఓయూల అమలు తొందర ఒకవైపు, కాషాయీకరణ వుత్సాహం ఒకవైపు కేంద్ర ప్రభుత్వాన్ని ఈ ఫాసిస్టు ఆలోచనలకు, దాడులకు పురికొల్పుతున్నాయి. అందువల్ల రోహిత్ ఘటన రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా విద్యారంగపు ప్రాథమిక విద్య నుండి యూనివర్సిటీ స్థాయి వరకు ప్రైవేటైజేషన్‌కు, విద్యను సరుకుగా మార్చే ప్రక్రియకు, కాషాయీకరణకు వ్యతిరేకంగా వెల్లువెత్తుతున్న ఉద్యమాలకు సంకేతం. కాబట్టి రానున్న రోజుల్లో తలెత్తే విద్యార్థి వెల్లువను ప్రజాస్వామిక రాజకీయాల చుట్టూతా అశేష విద్యార్థి సముదాయాన్ని సమీకరించుకొని, సంఘటితం చేయడానికి విద్యార్థులు

రాజకీయపరంగా, ఉద్యమపరంగా సన్నద్ధం కావాలి. అందుకోసం విద్యార్థులు మరింత వైవిధ్యభరితమైన ఐక్యసంఘటన వేదికలను నిర్మించాలి.

పైన పేర్కొన్నవిధంగా విద్యార్థిరంగాన్ని విస్తృత, సమరశీల ఉద్యమాన్ని నిర్మించి దాని ఆధారంగా దేశంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద, బడా భూస్వామ్య అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి.

నైరోబీ గాట్స్ సమావేశంలో భారత్ ఆమోదించిన తీర్మానాన్ని విస్తృతంగా అధ్యయనం చేసి, దానిపై తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు నిర్వహించాలి. ప్రజాస్వామికవాదులు కామన్ స్కూల్స్ పద్ధతిని, నైబర్‌హుడ్ స్కూల్ పద్ధతిని కోరుతూ ఉంటే తెలంగాణలో నాలుగు వేల ప్రభుత్వ స్కూళ్లను, ముఖ్యంగా ఉర్దూ మీడియం స్కూళ్లను మూసివేస్తూ మండలానికి ఒక రెసిడెన్షియల్ స్కూల్ పెట్టే నిర్ణయంలో దాగిన కుట్రను విప్పిచెప్పాలి. నైరోబీ గాట్స్ ఒప్పందం రద్దు కోసం, దాన్నుండి భారతదేశం బైటికి రావాలనే డిమాండ్‌తో, కామన్ స్కూల్ నినాదంతో ప్రభుత్వ విద్యాలయాల పరిరక్షణ కోసం, ప్రైవేట్, విదేశీ విశ్వవిద్యాలయాలను వ్యతిరేకిస్తూ మొత్తంగా విద్యారంగాన్ని కాషాయీకరించే, మార్కెటీకరించే విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి. వేలాది మందిని ఉద్యమంలోకి తీసుకరావాలి. మిలిటెంట్ పోరాటాలలో వేలాదిమందిని కదిలించాలి. అప్పుడే వాసిలో, రాశిలో ప్రగతిని సాధించడం సాధ్యమవుతుంది.

రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర, జిల్లా, మండల, కాలేజీ, ఎస్‌సి, ఎస్‌టి, బిసి హాస్టల్స్ వరకు ఉద్యమ నిర్మాణాలు చేయాలి. సైద్ధాంతికంగా, రాజకీయంగా అభివృద్ధిని సాధించాలి. మౌలిక సైద్ధాంతిక అవగాహన పెంచుకొని విద్యార్థులను కదిలించాలి. అన్యవర్గ ధోరణులపై స్వీయవిమర్శ, విమర్శలతో పోరాడాలి. వర్గపోరాట జ్వాలల్లో జ్వలింపబడుతూ మంచి కమ్యూనిస్టులుగా తయారు కావాలి. ఈ తీవ్ర నిర్బంధంలో తప్పులు చేయవద్దు. నైతిక పొరపాట్లతో సహా అన్ని రకాల అన్యవర్గ ధోరణుల నుండి బయటపడాలి. మానసిక సంసిద్ధత, ధైర్యం, దృఢ సంకల్పం, సృజనాత్మకంగా ఆలోచిస్తూ సమష్టి నిర్ణయం, వ్యక్తిగత బాధ్యతతో పని కొనసాగించాలి. నిర్ణయాలు ప్రజాస్వామికంగా జరగాలి. విద్యార్థుల్లో మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథాన్ని పెంపొందించాలి.

ఉజ్వల భవిష్యత్తు కలిగిన కామ్రేడ్స్ నవీన్‌బాబు, ఎర్రోళ్ల వీరస్వామి, వివేక్, శ్రుతి, సాగర్, సూర్యం వంటి అమరుల స్ఫూర్తితో మన ఆశయసాధన కోసం పునరంకితమవుతూ మూడవ గ్రీన్‌హంట్ దాడిని ఓడించే లక్ష్యంతో విశాల దృక్పథంతో కలిసివచ్చే మిత్రులందరినీ కలుపుకుంటూ ఉద్యమాన్ని బలోపేతం చేస్తారని ఆశిస్తున్నాం.

జగన్,
అధికార ప్రతినిధి,
తెలంగాణ రాష్ట్ర కమిటీ

---

**(45వ పేజీ తరువాయి)**

వెనుకబడిన దేశాల్లోనే, యిలాంటి పరిశ్రమలను స్థాపించి తమ దేశాల్లో మాత్రం ఈ పరిశ్రమలను నిర్మించడం లేదు. ప్రజల అభివృద్ధి పేరుతో సామ్రాజ్యవాదుల లాభాల కోసమే అనేక ప్రాజెక్టుల నిర్మాణాలు చేస్తున్నారు. దీన్ని తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోవాలి. బహుళజాతి కంపెనీల కారిడార్‌లకు నీరు, విద్యుత్‌ను అందించడానికే ప్రజలను జల సమాధి చేస్తున్నారు. దేశవ్యాప్తంగా, రాష్ట్రంలో ఆదివాసీ ప్రజలే ప్రధానంగా నిర్వాసితానికి గురౌతున్నారు. దీనితో తెలంగాణలో ప్రజలు నిర్వాసితానికి వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ఈ పోరాడుతున్న ప్రజలను అణచడానికి, ప్రజలకు అండగా వున్న మావోయిస్టు పార్టీని నిర్మూలించడానికి పోలీసు యంత్రాంగాన్ని ఆధునీకరిస్తూ కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఆపరేషన్ గ్రీన్‌హంట్ 3వ దశ దాడిని తీవ్రతరం చేస్తున్నాడు. బంగారు తెలంగాణ పేరుతో రక్తపుటేరుల తెలంగాణను నిర్మిస్తున్నాడు. అందుకని దోపిడీకి, నిర్వాసితానికి, ఆపరేషన్ గ్రీన్‌హంట్ 3వ దశ దాడికి వ్యతిరేకంగా సీ.ఆర్.బీ. యిచ్చిన మే 4, 5 బందుకు మద్దతుగా తెలంగాణలో బందును విజయవంతం చేయాలని ప్రజలకు, ప్రజాస్వామికవాదులకు, ప్రజా సంఘాలకు పిలుపునిస్తున్నాం.

విప్లవాభివందనాలతో,
జగన్,
అధికార ప్రతినిధి,
తెలంగాణ రాష్ట్ర కమిటీ
సీ.పీ.ఐ. (మావోయిస్టు)

ఏప్రిల్ 18, 2016

> "ఒకవైపు విప్లవాన్ని విజయం దిశగా సక్రమంగా నిర్వహించడానికి గాను, ప్రతి దేశంలోని కమ్యూనిస్టు పార్టీ ప్రజల నుంచి ఒక స్నేహితుడిని సంపాదించుకోవడానికి ప్రతి చిన్న అవకాశాన్ని ఉపయోగించుకుని తీరాలి. ఆ స్నేహితుడు ఎంత ఊగిసలాడే వాడే అయినా, ఎంత అశక్తుడు, ఎంత నమ్మదగని వాడైనా, ఆ అవకాశం ఎంత తాత్కాలికమైనదైనాగాని కూడా ఉపయోగించుకుని తీరాలి." –లెనిన్

# ఇంద్రవెల్లి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించిన ఆదివాసీ ప్రజానీకం, అమరుల కుటుంబాలు

ఇంద్రవెల్లి మారణకాండకు 35 ఏళ్లు. 1981 ఏప్రిల్ 20 నాడు ముఖ్యమంత్రి అంజయ్య (కాంగ్రెస్) ప్రభుత్వం అమాయక ఆదివాసులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి 60 మందికి పైగా పొట్టన పెట్టుకుంది. పదుల సంఖ్యలో గాయపడ్డారు.



ఆదివాసీ ప్రాంతంలో ఆదివాసేతరులు సరుకులు, వడ్డీ వ్యాపారం పేరుతో ఆదివాసులను మోసగించి వారి భూములను స్వాధీనం చేసుకొని ఆ భూముల్లో వారిని కూలీలుగా చేసుకొని సంపదను దోచుకున్నారు. ఆదివాసులపై అటవీ అధికారుల దౌర్జన్యాలు, భూస్వాముల దోపిడీ, ఆదివాసేతరుల భూఆక్రమణలకు వ్యతిరేకంగా పీపుల్స్‌వార్ పార్టీ నాయకత్వంలో ఆదివాసులు సంఘటితపడి ఆదివాసీ రైతుకూలీ సంఘం ఏర్పాటు చేసుకొని మా భూములు మాకే దక్కాలని, అడవిపై హక్కు మాదేనని నినదిస్తూ ఆదివాసేతరుల దోపిడీకి వ్యతిరేకంగా ఇంద్రవెల్లిలో 1981 ఏప్రిల్ 20న బహిరంగ సభను ఏర్పాటు చేసుకొన్నారు. సభకు ప్రభుత్వం అనుమతిని ఇచ్చింది. ఆదివాసీ రైతు కూలీ సంఘం గూడెంలలో ప్రచారం చేసి గోండు, కొలాం ప్రజలను కదిలించింది. ప్రభుత్వం సభకు ముందుగా అనుమతినిచ్చి సభ రోజే రద్దు చేసి ఆ ప్రాంతమంతా బలగాలను మోహరించి 144 సెక్షన్ విధించింది. ఈ విషయం తెలువని ఆదివాసులు ఏప్రిల్ 20న ఇంద్రవెల్లి సభకు దట్టమైన అడవి నుండి కొండ కోనలను దాటుకుంటు సాంప్రదాయక వాయిద్యాలతో, ఆట, పాటలతో ఆదివాసీ రైతుకూలీ సంఘం వర్ధిల్లాలి అంటూ నినాదాలతో గుంపులు గుంపులుగా ఉప్పెనగా తరలివస్తున్న ఆదివాసులను చూసి బెంబెలెత్తిన పోలీసులు ఎలాంటి హెచ్చరికలు చేయకుండా విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఒక్కసారిగా కాల్పుల శబ్దాలు విన్న ఆదివాసులు ప్రాణ భయంతో కకావికలమయి చెట్టుకోకరు, పుట్టకోకరుగా పరిగెత్తుతుంటే పోలీసులు వెంటపడి కాల్పులు జరుపుతూ 60 మందికి పైగా ఆదివాసులను పొట్టన బెట్టుకున్నారు. పదుల సంఖ్యలో గాయాలపాలైనారు.

ఈ మారణకాండ వార్త విన్న దేశ ప్రజలు, ప్రపంచ ప్రజలు ఉలిక్కిపడి దిగ్భ్రాంతికి లోనయ్యారు. జలియన్ వాలా బాగ్ గాయాలు మానకముందే ఆంధ్రప్రదేశ్‌లో (కాంగ్రెస్ ప్రభుత్వం) ముఖ్యమంత్రి అంజయ్య ఇంద్రవెల్లిలో 60 మందికి పైగా అమాయక ఆదివాసుల్ని కాల్చిచంపి, రక్తపుటేరులు పారించి, పదుల సంఖ్యలో గాయాలు చేసిన ఇంద్రవెల్లి మారణకాండను ముక్త కంఠంతో ఖండించారు.

ముఖ్యమంత్రి అంజయ్య మాత్రం ఇంద్రవెల్లి సభ రద్దు అయిందని 144 సెక్షన్ అమలులో వున్నదని ఈ ప్రాంతంలో గుంపులు గుంపులుగా తిరుగొద్దని ప్రచారం చేస్తున్నప్పుడు (గోండీ భాష రాని, మరే ఇతర భాష రాని ఆదివాసులు) ఆదివాసులకు, పోలీసులకు జరిగిన ఘర్షణలో 13 మంది చనిపోయారని కొద్ది మంది గాయపడ్డారని నిస్సిగ్గుగా ప్రకటించాడు.

ఇంద్రవెల్లి మారణకాండ జరిగిన రెండు సంవత్సరాలకు 1982లో ఇంద్రవెల్లి అమరవీరుల త్యాగాలకు గుర్తుగా స్థూపం నిర్మించుకొని తమ కోసం అమరులయిన అమరవీరులకు జోహార్లు తెలుపుతూ వారి త్యాగాలను ఎత్తిపడుతూ అమరుల ఆశయాలను కొనసాగిస్తామని శపథం చేస్తూ నివాళులర్పించారు. ఇంద్రవెల్లి అమర వీరులకు నివాళులర్పించడం ప్రభుత్వానికి, పోలీసులకు కంటగింపుగా తయారయింది. మేము కాల్చి చంపిన వాళ్లకు స్థూపం కట్టి ఇంద్రవెల్లి అమరువీరులకు జోహార్లు అంటూ నివాళులర్పించడం భరించలేకపోయారు. అప్పటి నుండి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో 144 సెక్షన్ పెట్టి ప్రభుత్వం అమరువీరుల సంస్మరణ దినాన్ని అడ్డుకోవడం మొదలు పెట్టింది. అయినప్పటికీ విప్లవ ప్రజానీకం, ఆదివాసులు ఎక్కడికక్కడ గ్రామాలలో, గూడాలలో ప్రతి సంవత్సరం ఏప్రిల్ 20న ఇంద్రవెల్లి సంస్మరణ దినాన్ని సభలు, సమావేశాలు పెట్టి నివాళులర్పిస్తున్నారు.

నక్సలైట్లే దేశభక్తులని అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ ముఖ్యమంత్రి ఎన్.టీ. రామరావు 1986 మార్చిలో ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపాన్ని పోలీసులతో కూల్చివేసాడు. ఈ దుశ్చర్యను ఆదివాసులు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, హక్కుల నాయకులు, వ్యతిరేకించడంతో మళ్లీ ఎన్నికల్లో గెలువాలంటే ఆదివాసుల ఓటు బ్యాంకు అవసరమని కంటి తుడుపు చర్యగా ఇంద్రవెల్లి స్థూపాన్ని పునర్నిర్మాణం చేసి మొసలి కన్నీరు కార్చిండు. సభలకు,

(మిగతాది 38వ పేజీలో)